ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 15.09.2025 | సంపుటి : 12 సంచిక : 57 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో

# సత్తాచాటాలి

### కాంగ్రెస్ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల ఇన్‌ఛార్జిలతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు

- పార్టీ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి
- పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి
- ప్రజలకు భరోసా కల్పించాలి
- నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల ఇన్‌ఛార్జిలతో ముఖ్యమంత్రి సమావేశం

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల ఇన్‌ఛార్జిలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఉప ఎన్నిక గెలుపు కోసం క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. పార్టీ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని సీఎం సూచించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. "నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలి. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుంది. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది. పార్టీ గెలుపు కోసం పనిచేయాల్సిన గురుతర బాధ్యత మీపైనే ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మీ పనితీరుతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నా. జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి" సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావే శంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో ఈవెంట్స్ ఇండస్ట్రీది

# కీలక పాత్ర

### వారితో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధం: మంత్రి జూపల్లి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో ఈవెంట్స్ ఇండస్ట్రీ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని అక్షయ్ కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో జరిగిన సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవెంట్స్ ఇండస్ట్రీతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈవెంట్స్ ఇండస్ట్రీ ద్వారా విదేశాలకు వెళ్లకుండానే తెలంగాణను డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు అద్భుతమైన కేంద్రంగా మార్చవచ్చని మంత్రి చెప్పారు. మిగతా 2లో..

## 'అలయ్ బలయ్'కి

# హాజరుకండి

జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే 'అలయ్ బలయ్' కార్యక్రమానికి హాజరుకావాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు





# హైదరాబాద్‌లో దంచికొడుతున్న వానలు

నగరంలోని లోతట్టు ప్రాంత ప్రజలకు ఇక్కట్లు

రహదారులు జలమయం

2

# అమెరికాపై సుంకాలు తగ్గించాల్సిందే..

### లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే..

గొప్ప జనాభా కలిగిన దేశంగా చెప్పుకునే భారత్ మా దగ్గర గుప్పెడు మొక్కజొన్నలు కూడా కొనదు • అక్కసు వెళ్లగక్కిన అమెరికా మంత్రి



### అమెరికా అతిగా ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకోవాలి

జీటీఆర్‌ఐ నివేదిక హెచ్చరిక

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్ కచ్చితంగా దేశీయ క్లౌడ్ టెక్నాలజీ, ఆపరేటింగ్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ హెచ్చరించింది. మిగతా 2లో..

వాషింగ్టన్(జనంసాక్షి): దేశంలో 140 కోట్లమంది ఉన్నారని గొప్పలు చెప్పుకొనే భారత్.. తమ దగ్గరి నుంచి గుప్పెడు మొక్కజొన్నలూ కొనడం లేదని అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హొవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు. అగ్రరాజ్యంపై విధిస్తున్న సుంకా లను తగ్గించాలని, లేదా తమతో వ్యాపారం విషయంలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సిందేనని నోరుపారేసుకున్నారు. పెద్దఎత్తున సుంకాలు విధిస్తూ.. భారత్, కెనడా, బ్రెజిల్ వంటి కీలక మిత్రదేశాలతో విలువైన సంబంధాలను సరిగ్గా నిర్వహిస్తున్నారా? అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఈమేరకు సమాధానం చెప్పారు. "భారత్- అమెరికా వాణిజ్య సంబంధాలు ఏకపక్షంగా ఉన్నాయి. వారు ఇక్కడ విక్రయాలు చేపడుతూ.. ప్రయోజనాలు మిగతా 2లో..

## చమురు కొనుగోళ్లు నిలిపివేయకపోతే

# 100 % వడ్డింపులే..



### అమెరికాపై రెండు దర్యాప్తులు మొదలు

చర్చల వేళ షాకిచ్చిన చైనా..

బీజింగ్(జనంసాక్షి): ఎప్పుడూ చైనాపై ఏదో ఒక దర్యాప్తు మొదలుపెట్టామని అమెరికా చెప్పడం సర్వ సాధారణంగా చూస్తుంటాం. కానీ, ఈ సారి సీను రివర్స్ అయింది. వాషింగ్టన్ రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంభిస్తోందంటూ.. బీజింగ్ మిగతా 2లో..

- రష్యాతో దోస్తీపై చైనాకు ట్రంప్ హెచ్చరిక..
- యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు
- ఆంక్షలు సమస్యలను క్లిష్టతరం చేస్తాయి
- మండిపడ్డ చైనా విదేశాంగ మంత్రి కౌంటర్

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యా విషయంలో దూకుడు పెంచుతూ నాటో దేశాలు, చైనాలను హెచ్చరించారు. చమురు కొనుగోలును వెంటనే నిలిపేయాలని.. లేదంటే చైనాపై 100 శాతం పన్నులు విధిస్తానని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలపై చైనా స్పందించింది. అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై చైనా విదేశాంగ మంత్రి స్పందించారు. స్లోవేనియా పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ..'యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు. ఇదే సమయంలో పలు దేశాలపై ఆంక్షలు సమస్యలను క్లిష్టతరం చేస్తాయి. ప్రస్తుతం చైనా ఎలాంటి యుద్ధం చేయడం లేదు.. యుద్ధంలో పాల్గొనడం లేదని చెప్పుకొచ్చారు. అయితే, చైనాపై ట్రంప్ టారిఫ్‌ల ప్రకటన చేసిన కొద్దిసేపటికే వాంగ్ యి ఇలా కామెంట్స్ చేయడం గమనార్హం. అంతకుముందు ట్రంప్.. చైనాపై భారీ సంఖ్యలో సుంకాలు మిగతా 2లో..



## ఆందోళనల్లో మరణించిన వారిని

# అమరవీరులుగా గుర్తిస్తాం

### నేపాల్ తాత్కాలిక ప్రధాని కర్కీ ప్రకటన

ఖాట్మాండ్(జనంసాక్షి): నేపాల్‌లో సోషల్ మీడి యాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో అ ట్టుడికిన విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థి తుల్లో నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రిగా సుశీలా కర్కీ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, ప్రధాని సుశీలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆందోళనల్లో భాగంగా ఆస్తులను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీలా కర్కీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా.. నేపాల్‌లో నిరసనలు, ఆందోళనల వేళ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనపై దర్యాప్తు చేపడతామని స్పష్టం చేశారు. తాను అధికారాన్ని అనుభవించేందుకు రాలేదని తెలిపారు. ఆరు నెలలకు మించి ఈ పదవిలో ఉండబోమని, ఆ తర్వాత కొత్త పార్లమెంట్‌కు బాధ్యతలను అందిస్తామని చెప్పారు. ప్రజలకు సేవ చేయడానికే బాధ్యతలు చేపట్టాం. దేశ పునర్నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని, వారి మద్దతు లేకుండా తాము విజయం సాధించలేమని అన్నారు. ఇక, ఈరోజు తాత్కాలిక ప్రభుత్వంలో కేబినెట్ మిగతా 2లో..

# విమర్శలు కాదు.. దర్యాప్తు చేయించాలి

రాహుల్ గాంధీ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరును తప్పుపట్టిన మాజీ సీఈసీ ఎస్. వై.ఖురేషీ



2 లో..

# నిరసనలతో దద్దరిల్లిన లండన్

### లక్ష మందితో భారీ యాంటీ ఇమిగ్రేషన్ ర్యాలీ

- అక్రమ వలసలు దేశానికి భారమంటూ మిన్నంటిన ఆందోళనలు
- నిరసనకారులకు, పోలీసులకు మధ్య తోపులాట
- 26 మంది పోలీసు అధికారులకు గాయాలు



### ఆందోళనలకు తలొగ్గేదిలేదు

నిరసనలను తీవ్రంగా ఖండించిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ 2 లో..

లండన్(జనంసాక్షి):యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) రాజధాని లండన్ నగరం వలస వ్యతిరేక నిరసనలతో దద్దరిల్లింది. యాంటీ-ఇమిగ్రేషన్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ ఆధ్వర్యంలో 'యూనైటెడ కింగ్‌డమ్' పేరుతో జరిగిన ఈ ర్యాలీలో లక్షకుపైగా నిరసనకారులు పాల్గొన్నారని మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. యూకేలో జరిగిన అతిపెద్ద నిరసన ప్రదర్శనల్లో ఇదొకటిగా చెబుతున్నారు.ఈ నిరసన ప్రదర్శనలో ఇటు పోలీసులు, అటు నిరసనకారుల మధ్య తోపులాటలు జరిగాయి.యాంటీ-ఇమిగ్రేషన్ కార్యకర్త రాబిన్‌సన్ నేతృత్వంలో మిగతా 2లో..

# పాకిస్తాన్‌కు కాంగ్రెస్ మద్దతిస్తోంది

- ప్రధాని మోదీ అసహనం



దిస్పూర్(జనంసాక్షి):తనపై,తనతల్లి హీరా బెన్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను శివభక్తుణ్ని.. కాంగ్రెస్ విమర్శల విషాన్ని హరించేస్తా'అని స్పష్టం చేశారు.ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ అసోంలో దరంగ్ జిల్లాలో ఆదివారం వేలకోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. 'నేను ఇలా మాట్లాడితే మోదీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శలు చేస్తుంది. నన్ను ఎంత దూషించినా పట్టించుకోను. ఎందుకంటే నేను శివుని భక్తుడిని.. విమర్శల విషాన్ని హరించేస్తా.కానీ దేశ ప్రజలపై దాడి చేస్తే మాత్రం మౌనంగా ఉండను. ప్రజలే నా దేవుళ్లు. నా బాధను వాళ్ల ముందు వ్యక్తం చేయకపోతే .. ఎవరి ముందు చేస్తాను. అందుకే వాళ్లే నా యజమానులు, నా దేవతలు, నా రిమోట్ కంట్రోల్. నాకు వేరే రిమోట్ కంట్రోల్ లేదు' అని స్పష్టం చేశారు.అయితే, అస్సాం సభలో ప్రధాని మోదీ మరోసారి' రిమోట్ కంట్రోల్' వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ మిగతా 2లో..

# వరద సాయం.. ఉగ్రస్థావరాలకు..

- మారని పాక్ దుర్బుద్ధి
- వరదబాధితుల కోసం సేకరించి నిధులు లష్కరే స్థావరాల పునరుద్ధరణకు కేటాయింపు



ఇస్లామాబాద్(జనంసాక్షి):ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికలపై మేకపోతు గాంభీర్యాలు పలికే పాక్ లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి.ఆపరేషన్ సిందూర్ మిగతా 2లో..

# కాలువలోకి దూసుకెళ్లిన కారు

- మహిళలు, చిన్నారులు సహా ఏడుగురు మృతి
- మరో ప్రమాదంలో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రక్కు
- ఒకరు మృతి, 18 మంది తీవ్రగాయాలు
- రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదాలు




9లో..

## తెలంగాణ వ్యాప్తంగా తనిఖీల్లో..

# భారీగా పట్టుబడ్డ గంజాయి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ వ్యాప్తంగా డ్రగ్స్ కేంద్రాలు, ముఠాలపై ఈగల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్, పోలీసు బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రైళ్లు, పారిశ్రామిక వాడల్లో చేపట్టిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 91 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. మిగతా 2లో..



# హైదరాబాద్‌లో దంచికొడుతున్న వానలు

### లోతట్టు ప్రాంత ప్రజలకు ఇక్కట్లు.. రహదారులు జలమయం



**హైదరాబాద్(జనంసాక్షి):**నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముషీరాబాద్, రామ్‌నగర్, తార్నాక, ఎల్బీనగర్, కాచిగూడ, కుషాయిగూడ, కాప్రా, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయ్యాయి. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం ధాటికి హబీబ్‌నగర్‌లోని అఫ్జల్‌సాగర్ కాలువలో ఇద్దరు గల్లంతయ్యారు. డ్రైనేజీలో మామ, అల్లుడు కొట్టుకుపోయారు. మామను కాపాడే ప్రయత్నంలో అల్లుడు కూడా గల్లంతయ్యాడు. వీరిద్దరి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. అలాగే, ముషీరాబాద్‌లో ఓ యువకుడు నాలాలో కొట్టుకుపోయాడు. నాలాపై ఉన్న గోడపై కూర్చొని ఉండగా, గోడ కూలడంతో సన్నీ (24) గల్లంతయ్యాడు.మరోవైపు, షేక్‌పేట, రాయదుర్గం, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట, ముషీరాబాద్, రామ్‌నగర్, తార్నాక, ఎల్బీనగర్, కాచిగూడ, కుషాయిగూడ, కాప్రా, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. వర్షం నీటితో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంజారాహిల్స్‌లో జలమయమైన రహదారులను అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించారు.

అశోక్ నగర్ స్టీల్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్

మియాపూర్ మదీనాగూడ మార్గంలో జాతీయ రహదారిపై వరదనీరు చేరింది. సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అకస్మాత్తుగా కుండపోత వర్షం కురిసింది. కవాడీగూడ పద్మశాలి కాలనీలో పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లో, కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగారు. రోడ్లపై నిలిచిన నీటిని తొలగిస్తున్నారు.

## ఆందోళనలో మరణించిన వారిని అమరవీరులుగా గుర్తిస్తాం

విస్తరణ జరిగే అవకాశం ఉంది.ఇదే సమయంలో ప్రధాని కీలక ప్రకటన చేశారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా 'అమరవీరులు'గా గుర్తిస్తామని హామీ ఇచ్చారు. ఇది ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవంగా భావిస్తున్నారు. అధికారం కోసం కాకుండా దేశాన్ని తిరిగి గాడిన పెట్టడానికే తాము వచ్చినట్టు వెల్లడించారు. దీంతో, ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నేపాల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## స్కూల్‌లో డ్రగ్స్ తయారీ.. బోయిన్‌పల్లిలోని పాఠశాల సీజ్

**హైదరాబాద్(జనంసాక్షి):**అల్ప్రాజోలం తయారీ కేసులో సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని మేధా పాఠశాలను అధికారులు సీజ్ చేశారు. నిన్న మేధా స్కూల్‌లో మత్తు పదార్థాల తయారీని ఈగల్ బృందం పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే.ఈనేపథ్యంలో మేధా పాఠశాలకు ఉన్న అనుమతులను విద్యాశాఖ రద్దు చేసింది. ఆ పాఠశాలలోని విద్యార్థులను ఇతర స్కూళ్లలో చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మలేల జయప్రకాశ్‌గౌడ్(39) హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లి సాయికాలనీలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో మేధా పేరుతో పాఠశాల నిర్వహిస్తున్నాడు. డబ్బు సంపాదించాలనే ఆశతో అల్ప్రాజోలం తయారీ దందాకు తెరలేపాడు. తయారీ ఫార్ములాను గురువారెడ్డి అనే వ్యక్తి ఇచ్చాడు. స్కూలు రెండో అంతస్తులోని రెండు గదుల్లో పరికరాల సాయంతో తయారుచేసి, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లోని కల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఈగల్ బృందం శనివారం ఆకస్మిక తనిఖీలు చేసింది. జయప్రకాశ్‌గౌడ్, అతడికి సహకరిస్తున్న బోయిన్‌పల్లికి చెందిన పెంటమోల్ ఉదయ్ సాయి(23), గౌటె మురళి(23)లను అదుపులోకి తీసుకుంది.

## ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై పట్టని ప్రభుత్వం: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి 200 రోజులైనా ప్రభుత్వాలు స్పందించట్లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురి మృతదేహాలు ఇప్పటికీ వెలికితీయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందించలేదని ఆరోపించారు. "కాళేశ్వరంలోని సమస్యలకు ఎన్‌డీఎస్‌ఏ బృందాన్ని పంపించిన కేంద్రం.. ఇప్పుడు ఎందుకు పంపట్లేదు. ఎస్ఎల్‌బీసీ ఘటనపై దర్యాప్తు కోసం ఒక్క బృందాన్ని కూడా ఎందుకు పంపలేదు? తెలంగాణలో కాంగ్రెస్‌ను భాజపా కాపాడుతోంది. భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఆరు కుటుంబాలకు న్యాయం చేస్తాం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ఆరుగురి ప్రాణాలను బలిగొన్న వారికి శిక్ష పడేలా చేస్తాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# అమెరికాపై సుంకాలు తగ్గించాల్సిందే..

పొందుతున్నారు. కానీ, మమ్మల్ని వారి దేశంలో అడ్డుకుంటున్నారు. 140 కోట్ల జనాభా ఉందని భారత్ గొప్పలు చెప్పుకొంటుంది. మరి.. మా మొక్కజొన్నలను ఎందుకు కొనరు? ఇది న్యాయమేనా? ప్రతిదానిపైనా సుంకాలు విధిస్తోంది. న్యాయమైన పరస్పర వాణిజ్యం నిర్వహిద్దామని అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. మేం ఏళ్లతరబడి తప్పు చేశాం. కాబట్టి సుంకాల చర్యలు తీసుకున్నాం. ఇది అధ్యక్షుడి నమూనా. దీన్ని అంగీకరించాలి. లేదా ప్రపంచంలో గొప్ప వినియోగదారుడి తో వ్యాపారం విషయంలో కష్టకాలం తప్పదు" అని లుట్నిక్ వ్యాఖ్యానించారు.

### అమెరికా అతిగా ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకోవాలి

సొంతంగా తయారు చేస్తున్న సైబర్ సెక్యూరిటీ, డేటా ఆధారిత ఏఐ వంటి అంశాల్లో కూడా స్వయంసమృద్ధి సాధిస్తే.. అదే అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని పేర్కొంది. భారత్ భద్రత, ఆర్థిక వ్యవస్థ.. అమెరికా సాఫ్ట్‌వేర్, క్లౌడ్, సోషల్ మీడియాపై తీవ్ర స్థాయిలో ఆధారపడటం ప్రస్తుతం భౌగోళిక రాజకీయ అస్థిరతల మధ్య సమస్యాత్మకమని జీటీఆర్ఐ నివేదిక వెల్లడించింది. అతిగా ఆధారపడటం వల్ల.. హఠాత్తుగా సేవలు లేదా డేటా నిలిపివేత ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుందని గుర్తు చేసింది. "అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌ల వంటి షాక్‌లను భారత్ ఎదుర్కొంటోంది. కానీ, దీనిని లోతుగా పరిశీలిస్తే.. డిజిటల్ అవసరాల కోసం అమెరికా టెక్నాలజీ సంస్థలపై ఆధారపడటం వల్ల వచ్చే ముప్పే తీవ్రమైందిగా కనిపిస్తోంది. ఒక వేళ అమెరికా వాటిని నిలిపివేయాలని ఆదేశిస్తే మాత్రం డిజిటల్ పేమెంట్లు, ట్యాక్స్ ఫైలింగ్స్ తీవ్రంగా ప్రభావితం అవుతాయి" అని పేర్కొంది. భారత ఫోన్లు, కంప్యూటర్లు, రక్షణ పరికరాలు, ప్రభుత్వ అప్లికేషన్లు అత్యధికంగా అగ్రరాజ్య సిస్టమ్స్ ఆధారంగానే పనిచేస్తున్నాయని వెల్లడించింది.భారత ప్రభుత్వం కచ్చితంగా 2030 నాటికి పూర్తిచేసేలా.. డిజిటల్ స్వరాజ్ మిషన్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఉందని తెలిపింది. నాటి కల్లా సొంత ఆపరేటింగ్ సిస్టమ్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా వ్యవస్థలను సృష్టించుకోవాలని పేర్కొంది. చైనా, ఐరోపాలు ఇప్పటికే ఈ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాయని గుర్తు చేసింది. టెక్ సార్వభౌమత్వ సాధనలో భారత్ వెనకబడిపోతోందని తెలిపింది. భారత్ వద్ద ఉన్న అతిపెద్ద బలం ప్రజల డేటా అని.. దానిని వాణిజ్య చర్చల్లో పణంగా పెట్టకూడదని నివేదిక పేర్కొంది. భారత్‌లోని భారీగా ఉన్న వినియోగదారుల డేటా అమెరికాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, దానిమీద వచ్చే ఆదాయాలకు ఇంధనంగా మారుతుందని చెప్పింది. ఇది చమురు, రేర్‌ఎర్త్ మెటీరియల్ వలే భారత్‌కు వ్యూహాత్మక ఆస్తిగా అభివర్ణించింది.

### చమురు కొనుగోళ్లు నిలిపివేయకపోతే

# 100 % వడ్డింపులే..



విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో 100 శాతం కన్నా ఎంతో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే పన్నులు విధిస్తేనే యుద్ధం ముగుస్తుందన్నారు. లేదంటే తన సమయంతోపాటు అమెరికా డబ్బునూ వృథా చేస్తున్నట్లేనని అన్నారు.అంతటితో ఆగకుండా.. రష్యాపై బీజింగ్ పట్టు సాధించిందని.. సుంకాలు విధించడం ద్వారా దీన్ని బలహీనపరచవచ్చని అన్నారు. ఈ యుద్ధానికి బైడెన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలే కారణమని మరోసారి ఆరోపించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై టారిఫ్‌లు విధించాలని ఈయూ, జీ7 దేశాలకు విజ్ఞప్తి చేసిన మరుసటి రోజే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.

### అమెరికాపై రెండు దర్యాప్తులు మొదలు

రెండు దర్యాప్తులు మొదలుపెట్టింది. అది కూడా స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళ కావడం గమనార్హం. ఈ సమావేశంలో జాతీయ భద్రత, టిక్‌టాక్ సోషల్ మీడియా యాజమాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండెక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసీ చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలుపెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారు చేస్తుంటాయి. చైనా లో తయారైన సెమీకండెక్టర్లపై వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తును చేపట్టింది.ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ కానున్నారు. అమెరికా ఎగుమతి నియంత్రణలు, టారిఫ్‌లు వంటి వాటిని ఈ సందర్భంగా చైనా బలంగా ప్రస్తావించే అవకాశం ఉంది. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకొంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎమ్ఐసీ కూడా ఉంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు తన గురిని చైనా (%జష్ట్రఱఅఖ%)పై పెట్టారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా సంకేతం పంపారు. భారీస్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో 100 శాతం కన్నా ఎంతో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో ఈవెంట్స్ ఇండస్ట్రీది కీలక పాత్ర

రాజస్థాన్‌తో పోలిస్తే తెలంగాణలో గొప్ప చారిత్రక కట్టడాలు, సంస్కృతి, పురాతన ప్యాలెస్‌లు ఉన్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో రూ.కోట్లు ఖర్చు చేసే బదులు మన రాష్ట్రంలోనే ఆ వేడుకలు నిర్వహించుకోవడం ద్వారా పర్యాటక రంగానికి ఊతం ఇవ్వొచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ సదస్సులో తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ అధ్యక్షులు బలరాం బాబు తదితరులు పాల్గొన్నారు.

## విమర్శలు కాదు.. దర్యాప్తు చేయించాలి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరును మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై.ఖురేషీ వ్యతిరేకించారు. ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న రాహుల్‌పై అభ్యంతరకరమైన వ్యా ఖ్యలు చేయడానికి బదులు. .ఈసీ వాటిపై దర్యాప్తునకు ఆదేశించి ఉండాల్సిందని అన్నారు. ప్రతిపక్ష నేత స్థానంలో ఉన్న రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలు, చేసిన ఆరోపణలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ఈసీకి ఉందని చెప్పారు. బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను నిర్వహించిన విధానాన్ని కూడా మాజీ ఎన్నికల కమిషనర్ తప్పుబట్టారు.సరైన విధంగా విధులు నిర్వహించకపోవడం వల్ల ఎన్నికల కమిషన్‌పై విమర్శలు వస్తుంటే మాజీ కమిషనర్‌గానే కాకుండా భారత పౌరుడిగానూ తాను తీవ్ర వేదనకు గురవుతానని ఖురేషీ అన్నారు. ఎన్నికల విషయంలో ఏం చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం అనే విషయాలను ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మన నిర్ణయాలను ప్రభావితం చేసే అన్ని శక్తులు, ఒత్తిళ్లను ఎదుర్కొనే విధంగా అధికారులు ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజల, ప్రతిపక్షాల విశ్వాసాన్ని గెలుచుకునేలా ఉండాలని ఆయన అన్నారు. ప్రతిపక్షాలతో మాట్లాడితేనే చాలా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. తాను ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో కూడా ప్రతిపక్షాలు తనను కలవడానికి వస్తే తప్పకుండా వారి వాదనలు వినేవాడినని చెప్పారు.ఎన్నికల సమయంలో తీసుకువస్తున్న కొత్త ఓటర్ల జాబితాలో కూడా ఎటువంటి తప్పులు లేవని మీరు అఫిడవిట్ ఇవ్వగలరా అని ఎన్నికల కమిషన్‌ను ఖురేషీ ప్రశ్నించారు. ఒకవేళ అందులో తప్పులు ఉన్నాయని తేలితే ఎన్నికల అధికారులు సైతం శిక్ష అనుభవించాల్సి వస్తుందని..దానికి మీరు సిద్ధమేనా అని ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఖురేషీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ.. రాజకీయ పార్టీలతో తాము క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని..ఇంత నిర్మాణాత్మక పద్ధతిలో మరెక్కడా సమావేశాలు జరగవని పేర్కొంది.

## తెలంగాణ వ్యాప్తంగా తనిఖీల్లో.. భారీగా పట్టుబడ్డ గంజాయి

రైళ్లలో గంజాయి సరఫరా చేస్తోన్న నలుగురిని, రైలులో గంజాయి తరలిస్తున్న మరో ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.వరంగల్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేయగా.. 32 కిలోల గంజాయి పట్టుబడింది. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వరంగల్‌లో మరోచోట 214 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, సరఫరాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లా వాజేడులో 30 కిలోల గంజాయి పట్టుబడగా.. ఇద్దరిని అరెస్టు చేశారు. సంగారెడ్డిలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో అల్ప్రాజోలం తయారీ యూనిట్ గుట్టురట్టయింది. 270 గ్రాముల అల్ప్రాజోలం, 7.89కిలోల నోర్డాజీపమ్, రూ.16.31లక్షలు విలువైన డ్రగ్స్, పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

## నా నెల సంపాదన రూ.200 కోట్లు'..

### గడ్కరీ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నాకు నెలకు రూ.200కోట్ల ఆదాయం వస్తుంది. ఎవర్ని మోసం చేసి సంపాదించాల్సి ఖర్మ పట్టలేదంటూ నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.దేశవ్యాప్తంగా వాతావరణ కాలుష్యం తగ్గింపుతో పాటు ఇతర ఉపయోగాల్ని దృష్టిలో ఉంచుకుని 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాలు జరపాలంటూ కేంద్రం నిర్ణయించింది. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాల అంశంలో తన కుటుంబం ఆర్థికంగా లబ్ది పొందుతోందంటూ వచ్చిన ఆరోపణల్ని గడ్కరీ ఖండించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొన్నారు. 'ఈ సందర్భంగా నా బ్రెయిల్ విలువ రూ.200కోట్లు.. నేను మోసంతో కాదు, నిజాయితీతో సంపాదిస్తున్నాను. నా కుమారులు వ్యాపారంలో ఉన్నారు. నేను వారికి సలహాలు ఇస్తాను. కానీ మోసం చేయను. ఇటీవల నా కుమారుడు ఇరాన్ నుంచి 800 కంటైనర్ల యాపిల్స్‌ను దిగుమతి చేశాడు. అలాగే 1000 కంటైనర్ల అరటిపళ్లను ఎగుమతి చేశాడు'అని చెప్పారు.నాకు డబ్బుకు కొదవలేదు. షుగర్ ఫ్యాక్టరీ, డిస్టిలరీ, పవర్ ప్లాంట్ వ్యాపారాలు ఉన్నాయన్న గడ్కరీ.. ఇవన్నీ వ్యక్తిగత లాభం కోసం కాకుండా వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చేస్తున్నానని స్పష్టం చేశారు.

# నిరసనలతో దద్దరిల్లిన లండన్

యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీ సమయంలోనే 'స్టాండ్ అప్ టు రేసిజమ్' ప్రదర్శన కూడా జరిగింది. దీనిలో సుమారు ఐదువేల మంది పాల్గొన్నారు. ఈ రెండు వర్గాల మధ్య గొడవలు జరగకుండా నిరోధించేందుకు పోలీసులను భారీగా మోహరించారు. పోలీసులు ప్రదర్శనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించగా, నిరసనకారులు పోలీసులపై బాటిల్స్‌తో పాటు పలు వస్తువులతో దాడులు చేశారని పోలీసు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో 26మంది అధికారులు గాయపడ్డారని, వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. అల్లర్లకు పాల్పడ్డ 25 మందిని అరెస్టు చేశామని. మరింతమందిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ మాట్ ట్విస్ట్ తెలిపారు.

### ఆందోళనలకు తలొగ్గేది లేదు

**లండన్(జనంసాక్షి):**వలసలకు వ్యతిరేకంగా బ్రిటన్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందే. 'యునైట్ ది కింగ్‌డమ్' పేరిట లండన్ వీధుల్లో నిర్వహించిన ప్రదర్శనలో లక్షమందికిపైగా ఆందోళనకారులు పాల్గొన్నారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా.. వాటర్ బాటిళ్లు, వస్తువులతో దాడులు చేశారు. ఈ పరిణామాలను బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్రంగా ఖండించారు. ఆందోళనలకు తలొగ్గే ప్రసక్తే లేదన్నారు. జాతీయ జెండా ముసుగులో హింసకు పాల్పడుతున్న అతివాదులకు బ్రిటన్ ఎప్పటికీ లొంగిపోదని ప్రకటించారు."ప్రజలకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉంది. అయినప్పటికీ.. రంగు, నేపథ్యం ఆధారంగా పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని సహించబోం. అధికారులపై దాడి చేయడం ద్వారా ఆందోళనకారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోలేరు. సహనం, వైవిధ్యం, గౌరవమనే పునాదులపై బ్రిటన్ నిర్మితమైంది. జాతీయ జెండా దేశంలో వైవిధ్యతను సూచిస్తుంది. హింస, భయం, విభజనకు చిహ్నంగా ఉపయోగించేందుకు దానిని ఎప్పటికీ అప్పగించబోం" అని ఓ వార్తాసంస్థతో ప్రధాని పేర్కొన్నారు.

# పాకిస్తాన్‌కు కాంగ్రెస్ మద్దతిస్తోంది



రిమోట్ కంట్రోల్ చేశారని మోదీ ఆరోపించారు. అలాగే, ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గాంధీ కుటుంబం రిమోట్ కంట్రోల్‌లో ఉన్నారని కూడా విమర్శించారు.2019లో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రముఖ అస్సామీ సంగీత కళాకారుడు భూపెన్ హజారికాకు భారతరత్న అవార్డ్‌తో సత్కరించింది. ఆ అవార్డుపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శలు గుప్పించారు. మోదీ గాయకులకు, నర్తకులకు అవార్డు ఇస్తున్నారు' అని ఎద్దేవా చేశారు. అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో ఖర్గే క్షమాపణలు చెప్పారు. ఖర్గే.. భూపెన్ హాజారికాను ఉద్దేశిస్తూ చేసిన విమర్శలను రాష్ట్ర సీఎం హిమంత బిశ్వశర్మ తనతో ప్రస్తావించినట్లు మోదీ తాజాగా సభలో గుర్తు చేశారు.అవును. భారత ప్రభుత్వం ఈ దేశపు ముద్దుబిడ్డ అస్సాం గర్వకారణం భూపేన్ హజారికాను భారతరత్నతో సత్కరించిన రోజున కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేశారు. మోదీ ఈ అవార్డును 'గాయకులు, నృత్యకారులకు'ఇచ్చారని అన్నారంటూ అస్సాం సభలో మోదీ గుర్తు చేస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో.. బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించారు.ఇటీవల రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రలో మోదీని, మోదీ తల్లిని కొందరు దూషించినట్లుగా ఓ వీడియోను విడుదల చేసింది. ఆ సమయంలో ఆ వీడియోపై ..మోదీ స్పందిస్తూ.. కాంగ్రెస్ తన తల్లి హీరాబెన్‌ను రాజకీయాల్లోకి లాగడం సరైందికాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా బీహార్ కాంగ్రెస్ విభాగం సోషల్ మీడియాలో ఓ ఏఐ వీడియోను పోస్టు చేసింది. ఆ వీడియోను మోదీ, తల్లి హీరాబెన్‌ను ఉద్దేశించి ఉండటం తీవ్ర దుమారం రేగింది. కాంగ్రెస్ తనని వ్యక్తిగత హననం చేయడంపై ఇవాళ అస్సాంలో మోదీ స్పందించారు. దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ రక్షిస్తోంది..: మోదీ ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అస్సాంలో పర్యటించారు. దరంగ్ జిల్లాలో బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. '1962లో చైనాతో యుద్ధం తర్వాత అప్పుడు ప్రధానిగా ఉన్న నెహ్రూ ఈశాన్య ప్రాంత ప్రజలకు చేసిన గాయాలు నేటికీ మానిపోలేదు. ప్రస్తుత తరం కాంగ్రెస్ ఆ గాయాలపై ఇప్పటికీ ఉప్పు చల్లుతుంది' అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇది బయటపడిందన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టిందన్నారు. కానీ, హస్తం పార్టీ మాత్రం మన సైన్యానికి కాకుండా దాయాది దేశంలోని సైన్యానికి మద్దతిస్తోందన్నారు. పాక్ అబద్ధాలు కాంగ్రెస్ అజెండాలుగా మారుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆక్రమణదారులకు, దేశ వ్యతిరేకులకు ఆ పార్టీ రక్షణ కవచంగా మారిందంటూ.. వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. 'నేను శివభక్తుడిని. మీరు నన్ను ఎంత తిట్టినా.. శివుడిలా విషాన్ని గొంతులోనే దాచుకుంటా. కానీ, ఎవరికైనా అవమానం జరిగితే మాత్రం తట్టుకోలేను. గాయకుడు భూపెన్ హజారికాకు భారతరత్న ఇవ్వడం మంచి నిర్ణయమా కాదా? కానీ ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించినందుకు కాంగ్రెస్ పార్టీ అవమానించింది' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని పేర్కొన్నారు. దీనికి ముందు దరంగ్ జిల్లాలోని మంగల్‌దోయ్‌లో రూ.6,300 కోట్ల విలువైన ఆరోగ్య, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దరంగ్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణంతో పాటు, నర్సింగ్ కాలేజీ, జీఎన్‌ఎమ్ పాఠశాలను ప్రారంభించారు.

## వరద సాయం.. ఉగ్రస్థావరాలకు..

సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధి మారని దాయాది దేశం తినడానికి సరైన తిండి లేకపోయినా కూడా.. వరద భాదితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్ర స్థావరాల పునరుద్ధరణకు ఖర్చు చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబా (%మీఱతీఖిఓ ఖఅఖ%)ను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి.ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన అనంతరం మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్‌ఈటికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ.1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకు అయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ.4.7 కోట్లకు పైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి.వీటికి కావాల్సిన నిధులను సేకరించడానికి పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరుతో విరాళాలు సేకరించి.. ఉగ్రసంస్థలకు మళ్లిస్తోంది. 2005లోనూ పాక్‌లో సంభవించిన భారీ భూకంపం సమయంలోనూ పాక్ ఇదే తరహాలో నిధులు సేకరించినట్లు భారత వర్గాలు పేర్కొన్నాయి. అప్పట్లో మానవతా సాయం పేరుతో సేకరించిన దాదాపు బిలియన్ డాలర్ల నగదులో దాదాపు 80 శాతాన్ని ఉగ్రసంస్థ ఎల్‌ఈటిలో మౌలిక సదుపాయాల కోసం మళ్లించినట్లు తెలిపాయి.మురీద్కేలోని మర్కాజ్ తోయిబా ఓ పెద్ద ఉగ్ర స్థావరం. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో విస్తరించింది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి కూడా ఉన్నాయి. ఉగ్రవాదాన్ని విస్తరించడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర.

## దక్షిణ చైనా సముద్ర జలాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలు

### - చైనా నౌకలను అడ్డుకొన్న తైవాన్..!

**తైపీ(జనంసాక్షి):**తైవాన్ కోస్ట్‌గార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సీజీఏ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్ట్‌గార్డ్ నౌక ఒకటికాగా.. మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్‌షా ద్వీపం వద్ద కార్యకలపాలు సాగిస్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకొంది. దీంతో తైవాన్-చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 సమయంలో రెండు చైనా నౌకలను డాంగ్‌షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్‌ను రంగంలోకి దించారు. అది శుక్రవారం చైనా కోస్ట్‌గార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో.. అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే.. ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రదేశానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది.

# యూరియా టోకెన్ల కోసం వెళ్తూ ఇద్దరు రైతులు మృతి




**గూడూరు, సెప్టెంబర్14 (జనంసాక్షి):** యురియా బస్తాల టోకెన్ల కోసం వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటనలో ఇద్దరు రైతులు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం జగన్నాయకు లాగూడెం క్రాస్ రోడ్ వద్ద 365 జాతీయ రహదారిపై ఉదయం ప్రమాదం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గూడూరు మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన బానోత్ లాల్య(77) , ధారావత్ వీరన్న (47) అనే ఇద్దరు రైతులు టీవీఎస్ ఎక్సెల్ బైక్ పై బొద్దుగొండ రైతు వేదిక వద్దకు యూరియా బస్తాల కోసం వెళ్తుండగా జగన్నాయకులగూడెం 365 జాతీయ రహదారి క్రాస్ రోడ్ వద్ద బొలెరో వాహనం బైకును ఢీకొట్టడంతో బానోత్ లాల్య అక్కడికక్కడే మృతి చెందగా,బానోత్ వీరన్న కు తీవ్ర గాయాలైనాయి. ప్రమాదం జరిగిన విషయాన్నీ తెలుసుకున్న గూడూరు సిఐ సూర ప్రకాష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసు వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు.మహబూబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాదావత్ వీరన్నను అక్కడ ప్రథమా చికిత్స చేయించి,అక్కడి నుంచి ఖమ్మం హాస్పిటల్ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేటి నుంచి మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైల్ నిలుపుదల

**జెండా ఊపి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్**




**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లాలో వందే భారత్ ట్రైన్ స్టాప్ ఇవ్వాలని ప్రయాణికుల ఆకాంక్ష మేరకు రాజకీయ నాయకుల వినతుల మేరకు ఈ నెల 15 నుండి కేంద్ర ప్రభుత్వం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైల్ స్టాప్ కు ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 15 సోమవారం ఉదయం 8.15 గంటలకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంచిర్యాల రైల్వే స్టేషన్ లో కేంద్ర హెూమ్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా వందే భారత్ 20101 నాగ్ పూర్ – సికింద్రాబాద్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తారు.

# విద్యార్థులు దేశానికి మంచిపేరు తేవాలి

**నూతన ల్యాబ్‌ను ప్రారంభించిన ఆదిలాబాద్ ఎంపీ, ఖానాపూర్ ఎమ్మెల్యే**



**కడెం, సెప్టెంబర్ 14(జనం సాక్షి) :** విద్యార్థులు దేశానికి మంచిపేరు తేవాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. కడెం మండల్ నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలోని టిజిఎస్ డబ్ల్యూ ఆర్ ఈఐఎస్ (గురుకుల) పాఠశాల, కళాశాలను ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ ఆదివారం రోజున సందర్శించారు. వారికి ప్రిన్సిపల్ శకుంతల, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థినులు స్వాగతం పలికారు. టిజిఎస్ డబ్ల్యూ ఆర్ ఈజిఎస్ గురుకుల పాఠశాల కళాశాలలో రూ.13 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను వినియోగించుకోవాలని, నేటి బాలలే రేపటి పౌరులు అనే విధంగా రాష్ట్రాల్లోనే కాకుండా దేశా నలుమూలల్లో మీరు ప్రతి ఒక్కరు కూడా అత్యున్న స్థాయిలోకి వెళ్లాలని తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో పాటు రాష్ట్ర, దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కళాశాలలో ఉన్న సమస్యల పట్ల విద్యార్థినులను, ప్రిన్సిపల్ ని అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్న వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఏ సమస్య అయినా వెంటనే పరిష్కరించేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శకుంతలతో పాటు ఉపాధ్యాయులు, కడెం మండల విద్యాధికారి షేక్ హుస్సేన్, వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, నాయకులు ఆకుల లచ్చన్న, బొడ్డు గంగన్న, ముస్కు రాజేందర్, కాశవేని శ్రీనివాస్ యాదవ్, మోహన్ నాయక్, శ్రీరామ్, రాపర్తి శ్రీనివాస్, రంజిత్ తదితరులు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# తెలంగాణ వివాహ గమ్యస్థానంగా ఎదగాలి

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఘనంగా సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** తెలంగాణ వివాహ గమ్యస్థానంగా ఎదగాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర పర్యాటక శాఖ మద్దతుతో హైదరాబాద్‌లోని అక్షయ కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన నాలుగో టీసీఈఐ సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ గ్లోబల్ 2025ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవెంట్ ఇండస్ట్రీ అనేది కలలను నిర్మించే ఆర్కిటెక్టులకు నిలయమన్నారు. వీరంతా అద్భుతమైన క్షణాలను సృష్టించే కళాకారులు అన్నారు. ఇద్దరు వ్యక్తులను మాత్రమే కాదని, రెండు కుటుంబాలను, రెండు సంస్కృతులను కలిపే వారధిగా పని చేస్తున్నారని చెప్పారు. మనం వెడ్డింగ్ డెస్టినేషన్ల గురించి ఆలోచించినప్పుడు ఎక్కువగా రాష్ట్రానికి బయట ఉన్న ప్రాంతాలనే గుర్తు చేసుకుంటామన్నారు. కానీ తెలంగాణ ఈ భావనను మార్చడానికి సిద్ధంగా ఉందన్నారు. మన రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి బడ్జెట్‌కు సరిపోయేలా.. గ్రాండ్ గా వెడ్డింగ్‌లు నిర్వహించేందుకు అందమైన వేదికలు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రతిష్ఠాత్మక వెడ్డింగ్ ప్లానర్ల అందరికీ నా మనవి ఏమిటంటే.. 'తెలంగాణను కొత్త దృష్టితో చూడండి, దేశ, విదేశాల్లో మీ క్లయింట్లకు ఈ గమ్యస్థానాలను పరిచయం చేయండి. తెలంగాణ టూరిజం మీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ అందమైన వేదికలను ప్రపంచానికి చూపించేందుకు మీ సహకారం కావాలి. దయచేసి మీ పరిధిని దక్షిణ భారతానికి మాత్రమే పరిమితం చేయకండి. మీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందగల గొప్ప ప్రతిభ ఉంది. అందువల్ల, తదుపరి ఎడిషన్‌ను 'ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాన్ఫరెన్స్'గా రూపొందించాల్సిన సమయం ఇదేనని' చెప్పారు. తెలంగాణను ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మారుద్దామన్నారు. ప్రపంచవ్యాప్తంగా వెడ్డింగ్ ఇండస్ట్రీలో తెలంగాణకు అగ్ర స్థానాన్ని తీసుకురావడానికి మనమంతా కలిసి ముందడుగు వేద్దామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణా ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణకు అగ్రగామి వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ఎదిగే సామర్థ్యం ఉన్నప్పటికీ, పెద్దస్థాయి వివాహాలు ఎక్కువగా జరగడం లేదన్నారు. రాజస్థాన్, కేరళ వంటి ఇతర రాష్ట్రాలు ఇప్పటికీ ముఖ్యమైన గమ్యస్థానాలుగా ఉన్నాయన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు మూడు ప్రత్యేకమైన ప్రదేశాలను వెడ్డింగ్ డెస్టినేషన్లుగా ప్రచారం చేయాలని నిర్ణయించామన్నారు. ఇవన్నీ నగరానికి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. అవి.. అనంతగిరి, నాగార్జునసాగర్, సోమశిల అన్నారు. వివాహ ప్రణాళికకర్తలకు, ముఖ్యంగా రాష్ట్రానికి వెలుపల నుంచి వచ్చే వారికి సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అత్యంత సులభంగా సేవలు పొందే అవకాశం కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కాంగ్రెస్‌కు 450 పైగా ప్రతినిధులు, 600 మందికి పైగా సందర్శకులు హాజరయ్యారు. భారతదేశ వెడ్డింగ్, ఈవెంట్స్ రంగానికి ఒక కీలక ఘట్టంగా చెప్పవచ్చు. అంతర్జాతీయ వక్తలు అలీ బక్తియార్, స్టెఫానీ, గిడియాన్, పర్వరిట్ మాస్టర్ క్లాస్లు నిర్వహించారు. కళా నైపుణ్యం, ఆచారాలు, సాంకేతికత, సాంస్కృతిక కలయిక వంటి విభాగాలపై మాట్లాడారు. భారత ప్రొఫెషనల్స్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎదగడానికి ప్రేరణ పొందారు. ఫ్లోరల్ ఎక్స్‌ట్రావగాంజాలో డిజైనర్లు తమ ప్రత్యేక డెకర్ కాన్సెప్ట్‌లతో ప్రేక్షకులను మెప్పించారు. స్వాన్ వెడ్డింగ్ అవార్డ్స్ కోసం దేశవ్యాప్తంగా 150 నామినేషన్లు వచ్చాయి. వ్యాపారాలు పెంచేందుకు, ఆవిష్కరణలు, ప్రాక్టికల్ స్ట్రాటజీ డైనమిక్ వర్క్‌షాప్‌లు, ప్యానెల్ చర్చలు జరిగాయి. దక్షిణ భారతీయ సంగీతం, నృత్యం, కళల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇది కేవలం ఒక ఈవెంట్ మాత్రమే కాకుండా, వెడ్డింగ్ ప్రపంచానికి ఒక నిర్వచక ఘట్టంగా నిలిచింది. ప్రపంచంలో అత్యంత ఆకట్టుకునే వెడ్డింగ్ గమ్యస్థానంగా ఇది నిలిచింది. దీని ప్రభావం ఈ రెండు రోజులకు మించిన అంతర్జాతీయ గుర్తింపును అందిస్తుంది. ఈ కార్యక్రమంలో టీసీఈఐ అధ్యక్షులు ఏ బలరాం బాబు, జాతీయ కార్యదర్శి రవి బురా, కోశాధికారి తౌఫిక్ ఎం ఖాన్, సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ సమన్వయకర్త ఎం సాయి శ్రవణ్, సహ–సమన్వయకర్తలు హిరీష్ రెడ్డి, మహబూబ్ షేక్, కార్తీక్ వెపురి, ఆర్యన్ రాజ్‌పుత్, శరణ్ కందాల, ప్రవీణ్ అగర్వాల్, నితికా ఖండేల్వాల్ పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వీరంగం సృష్టించిన యువకులు

**మహేశ్వర వైన్ షాపును ఇక్కడి నుండి మార్చాలని ప్రజల డిమాండ్**



**పెద్దవంగర సెప్టెంబర్ 14(జనం సాక్షి) :** మద్యం మత్తులో యువకులు తమను తాము మర్చిపోయి మద్యం దుకాణం ఎదుట రహదారిపై వీరంగం సృష్టించారు. పూర్తి వివరాల్లోకి వెళితే.... పెద్దవంగరలోని మహేశ్వర మద్యం దుకాణంలో చిన్నవంగర గ్రామానికి చెందిన యువకులు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మద్యం సేవించారు. మద్యం సేవించినంక వారిలో వారికి మాటా మాట పెరిగిపోయింది. దీంతో యువకులు తమను తాము మర్చిపోయి వద్దే కొత్తపల్లి ప్రధాన రహదారిపై వైన్ షాప్ ఎదుట గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు చేయి చేసుకొని, రహదారిపై నెట్టి వేసుకుంటూ ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ఇది గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అర్ధగంట అయిన పోలీసులు రాకపోవడంతో గ్రామస్తులు రంగంలోకి దిగి ఘర్షణ పడుతున్న యువకులను చెదరగొట్టారు. పలువురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో మహేశ్వర వైన్ షాప్ సమీపంలో ఉన్న కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. మద్యం దుకాణంలో రోజు తప్ప తాగి ఇలాంటి గొడవలు జరుగుతున్నాయని, మందుబాబుల వలన మా కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. కూతపెట్టు దూరంలో పోలీస్ స్టేషన్ ఉన్నా.. మందుబాబుల ఆగడాలు ఆగపోవడంతో పోలీసుల పనితీరుపై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మాకు రక్షణ కల్పించాలని అధికారులను కోరుతున్నారు.

# కారులో పాము కలకలం.. హడలిపోయిన దంపతులు



**భూపాలపల్లి (జనంసాక్షి) :** కారులో పాము కలకలం రేపింది ఈ ఘటనే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. భూపాలపల్లి జిల్లాకు చెందిన భూపాల్, అతని భార్య వివాహ వేడుక నిమిత్తం కారులో బయల్దేరారు. పెళ్లి ముగిశాక తిరిగి కారులోనే వస్తుండగా.. భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద భూపాల్ సడెన్ బ్రేక్ వేశాడు. ఎందుకంటే తన కాళ్ల కిందే పాము ఉన్నట్లు గమనించాడు భూపాల్. దీంతో అతని గుండె ఆగిపోయినంత పనైంది. వెంటనే కారును ఆపిన భూపాల్.. స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించాడు. స్నేక్ క్యాచర్ పామును పట్టుకోవడంతో.. భూపాల్ దంపతులు ఊపిరి పీల్చుకున్నారు. పామును చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.



# బలరాముడి పర్యావరణ స్ఫూర్తి

- 377 మొక్కలు నాటిన సింగరేణి సీఎండీ బలరాం నాయక్

**భూపాలపల్లి, సెప్టెంబర్ 14 (జనం సాక్షి):** భూపాలపల్లి ఏరియా సింగరేణిలోని మిలీనియం క్వార్టర్స్ లో ప్రతి అడుగు పచ్చదనం అనే ఉద్దేశంతో నర్సరీలో స్వయంగా 377 మొక్కలు నాటిన సిఎండి, ఇప్పటివరకు మొత్తం 20,377 మొక్కలు నాటి అందరిలో పర్యావరణ స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని మొక్కలు నాటుతూ, సిఎండి ఎన్ బలరామ్ చేస్తున్న పర్యావరణ యజ్ఞాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు సమస్త మానవాళికి ఆరోగ్యకరమైన స్వచ్ఛమైన గాలి పచ్చదనం కల్పిస్తూ వర్షాలు పడడం లో తోడ్పడతాయని అన్నారు. రానున్న తరాలకు మనం అందించగలిగే గొప్ప సంపద మొక్కలు నాటి వాటిని రక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు అందరూ కూడా మొక్కలు నాటి పచ్చదనానికి నాంది పలికారు. ఈ కార్యక్రమంలో, డైరెక్టర్ పి,పి ఎల్వి సూర్యనారాయణ, జిఎం ఎన్విరాన్మెంట్ , సైదులు, ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దు

- బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బడుగు బలహీన, దళిత గిరిజన విద్యార్థుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటమాడొద్దని బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర అన్నారు. వెంటనే ఫీజు రీయంబర్స్మెంట్ రిలీజ్ చేసి కాలేజీ యజమాన్యాలు సమ్మెకు పోకుండా కాలేజీలు బంద్ చేయకుండా కృషి చేయాలని చదువు అయిపోయిన విద్యార్థులకు వెంటనే వారి సర్టిఫికెట్లు వచ్చే విధంగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న ప్రొఫెసర్ విద్యావేత్త కోదండరాంకు విజ్ఞప్తి చేశారు. లేకుంటే రాబోయే కాలంలో విద్యార్థుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు 420 హామీలు ఇవ్వడమే గాక ఒకటి కూడా అమలు చేయకుండా నేడు విద్యార్థుల జీవితాలతో చెలగాటమా డుతున్నదన్నారు. ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండబెడతామన్నారు. రెండు లక్షలు ఉద్యోగాలు సంవత్సరానికి ఇస్తామని నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేయటమే కాకుండా చదువుకునే విద్యార్థులకు విద్యను లేకుండా బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు శాశ్వతంగా విద్యను దూరం చేయడం కోసమే ఫీజు రియంబర్స్మెంట్ పథకానికి తూట్లు పొడుస్తూ యాజమాన్యం సమ్మెకు పోయే విధంగా ప్రభుత్వం ప్రవర్తిస్తున్నదని, వెంటనే కోదండరాం మహేష్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్ గౌడ్, బట్టి విక్రమార్క హనుమంతరావు సీనియర్ నాయకులు అందరూ ముఖ్యమంత్రిని ఒప్పించి వెంటనే రియంబర్స్మెంట్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులను రాష్ట్రంలో ఎక్కడికి పోయినా అడ్డుకుంటామని పిలుపునిచ్చారు.

# కబడ్డీ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి




- కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పోగుల సారంగపాణి

**స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** కబడ్డీ క్రీడాకారులు జిల్లా రాష్ట్రస్థాయిలో క్రీడల్లో రాణించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పోగుల సారంగపాణి అన్నారు. స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్ ఉన్నత పాఠశాలలో జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సబ్ జూనియర్స్ బాల బాలికల కబడ్డీ ఎంపికలు దిగ్విజయంగా నిర్వహించారు. ఈ సెలక్షన్ కు బాలుర నుండి 150మంది బాలికల నుండి 120 మంది అఫీషియల్స్ 30 మంది హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేషన్ ఘన్పూర్ సిఐ వేణు హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈసందర్భంగా పోగుల సారంగ పాణి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపిక అయిన బాల బాలికల కబడ్డీ క్రీడాజట్లు, ఈనెల 25 నుండి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో నీ ముప్కల్ లో జరగబో యే 35వ సబ్ జూనియర్స్ అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపా ణి, అధ్యక్షుడు వై కుమార్ గౌడ్,జిల్లా ప్రధానకార్యదర్శి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి తోట కూరి గట్టయ్య యాదవ్, సహాయ కార్యదర్శి డాక్టర్ వెంకటేశ్వర్లు,కోశాధికారి ఏదినూరి ఉప్పలయ్య, రిఫ్రిజ్ బోర్డు చైర్మన్ చింతకింది సుధాకర్, వివిధ మండ లాల అధ్యక్ష కార్యదర్శులు,నూకల రాజు, అన్నెపు కుమార్, రాజు, చందర్, ఆంజనేయులు, షఫీర్ జిల్లా పరిషత్ పాఠశాల మాజీ ఎస్ఎంసి చైర్మన్ భాస్కుల సమ్మయ్య క్రీడాకారులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతి నిధి సెప్టెంబర్ 14 (జనంసాక్షి):** జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ....మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకులు, ఇతర పనులను వేగవంతం చేయాలని, మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజు ఇంటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి ఇంటికి నిరంతరంగా త్రాగునీటిని సరఫరా చేసేలా పనులను పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. వార్డులలో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో కృషి చేసి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
15 సెప్టెంబర్ 2025

# మట్టి మనుషుల మహేతిహాసం

## సాయుధ పోరాటం సాహిత్యం




భారత కమ్యూనిస్టు పార్టీ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పిస్తున్నాను. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వివిధ వేదికల ద్వారా సభలు సమావేశాలు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో మొగలుల సామంతులుగా ఉన్న అసఫ్జాహీలు స్వతంత్రాన్ని ప్రకటించుకుని 1748నుంచి 1948 వరకు అనగా సుమారు 200 సంవత్సరాల వరకు తెలంగాణ ,మరాఠా, కన్నడ ప్రాంతాలను పాలించారు. ముఖ్యంగా ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నేతృత్వంలో మతోన్మాదం, నిరంకుశత్వం పెచ్చు పెరిగి అమాయక ప్రజలపై దాడులు జరిగాయి. ఖాశీం రజ్వి నాయకత్వంలో కొనసాగిన రజాకర్ల దురాగతాలు తెలంగాణలో చీకటి అధ్యాయం అని చెప్పవచ్చు. ఊళ్ళకు ఊర్లు తగలబెట్టడం, ప్రజల కనీస అవసరాలు తీర్చకపోవడం, ప్రాథమిక హక్కుల్ని కాలరాయడం, విద్యా వైద్య సదుపాయాలు లేకపోవడం అన్నింటికంటే ముఖ్యంగా గ్రామాలలో నిజాం ప్రతినిధులుగా చలామణి అయిన జమీందారులు, జాగీర్దారులు, దేశ్ ముఖులు, దేశ్ పాండేలు, దొరలు, పటేల్, పట్వారీలు, అతనికి కప్పం చెల్లించే నెపంతో పెద్ద మొత్తంలో జనం నుంచి ధనాన్ని ధాన్యాన్ని వసూలు చేసేవారు. వీళ్ళ అకృత్యాలను గురించి వట్టికోట, దాశరథి రంగాచార్య తమ నవలల్లో కూలంకషంగా వివరించారు. సబ్బండ వర్ణాల వారు గ్రామంలోని పెత్తందారులైన దొరలకు వెట్టి చేయాల్సి వచ్చేది. గ్రామాలకు అధికారులు వచ్చినప్పుడు దొరల ఇండ్లలో వంటావార్పుకు అవసరమైన కిరాణ సామగ్రిని కోమట్లు, తినడానికి అవసరమైన విస్తళ్లను బ్రాహ్మణులు కుట్టి ఇవ్వాలి. ఇలాంటివన్నీ ఆనాడు చాలా మామూలుగా జరిగిపోయేవి. అణగారిన పేద వర్గాలు శ్రమించి చేసే పనులకు ఏమాత్రం ప్రతిఫలం దక్కేది కాదు. పైగా దొరలతో తిట్లు చివాట్లు. అప్పుడప్పుడు తన్నులు తినాల్సి వచ్చేది. దొర దగ్గర పనిచేసే మనుషులు కూడా అదే దర్పాన్ని కనబరిచేవారు. ఔరంగజేబు పరిపాలనలో జిజియా పన్ను వసూలు చేసినట్లుగా నిజాం కాలంలో మనిషి చస్తే కూడా బూడిద పన్ను పేరుతో డబ్బు వసూలు చేసేవారు. సభలు సమావేశాలు నిర్వహించుకోవడానికి పత్రికలు నడపడానికి స్వేచ్ఛ ఉండేది కాదు. తమకు వ్యతిరేకంగా పత్రికలలో వార్తలు రాసాడనే కారణంతో షోయబుల్లాఖాన్ యొక్క చేతులను నరికి వేశారు. గస్తీ నిషాన్ తిర్పన్ (జి. ఓ . నెం.53) వాక్ స్వాతంత్ర్యం ఉండేది కాదు. ఈ పరిస్థితులలో హైదరాబాదు నగరంలో 1921 వ సంవత్సరంలో కార్వే పండితుని అధ్యక్షతన జరిగిన సంస్కరణ సభలో ఆలంపల్లి వెంకట రామారావు తెలుగులో ఉపన్యాసించడానికి మొదలుపెట్టగానే తెలంగిబి బేడంగి (దిక్కు మొక్కు లేనిది) అంటూ కేకలు వేయిచు అవహేళన పరిచిన నేపథ్యంలో ఆత్మాభిమానం దెబ్బతిన్న తెలుగు ప్రముఖులైన మాడపాటి హనుమంతరావు, కొండా వెంకట రంగారెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, మందుముల నర్సింగరావు, బూర్గుల రామకృష్ణారావు, టేకుమళ్ల రంగారావు ప్రభృతులు ఆంధ్ర జన సంఘం పేరుతో ఒక సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అదే ఆంధ్ర మహాసభగా రూపుదిద్దుకొని తెలంగాణలో సాంస్కృతిక చైతన్యంతో పాటు సామాజిక చైతన్యానికి ఊపిరిలూదింది. కౌలు రైతు హక్కుల గురించి, వెట్టిచాకిరి రద్దు గురించి, లెవీ వసూలు గురించి కె .సి. గుప్తా అణా గ్రంథమాల ద్వారా వెలువరించిన పుస్తకాలు, నీలగిరి, తెనుగు, గోలకొండ పత్రికలు ప్రజలలో చైతన్యాన్ని కలిగించాయి. కాగా 1930లో జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి గారి అధ్యక్షతన మొదలైన ఆంధ్ర మహాసభ క్రమంగా 1944 భువనగిరి మహాసభ నాటికి రావి నారాయణరెడ్డి వంటి అభ్యుదయ శక్తుల చేతులలోకి వచ్చింది. దాంతో రాజకీయ చైతన్యం కూడా పెరిగింది. ఈ భువనగిరి మహాసభలలోనే ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోయింది. మితవాదుల సభ పులిజాల రంగయ్య చేతిలోకి వెళ్ళగా రావి నారాయణరెడ్డి గారి చేతుల్లోకి అతివాదుల సంఘం చేరింది. ఆనాటి సభలకు హాజరైన ప్రజలు ప్రగతిశీల నాయకత్వం ఇచ్చిన చైతన్యంతో గ్రామాలకు వెళ్లి భూ పోరాటాలకు నాంది పలికారు. అందులో భాగంగానే పాలకుర్తిలో చాకలి ఐలమ్మ తను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న భూమిలో పంటను కాపాడుకోవడానికి "సంగం" అండతో జరిగిన దాడిని తిప్పి కొట్టింది. ఇది స్ఫూర్తిగా పలు గ్రామాలలో పోరాటాలు జరిగాయి. గ్రామాలలో ఆంధ్ర మహాసభ శాఖలు ఏర్పడి ఎక్కడికక్కడ ప్రజలు తిరుగుబాటు చేశారు. అదే సందర్భంలో ఖాశీం రజ్వీ నాయకత్వం లో రజాకార్ల మూకలు ప్రజలపై అమానుషమైన దాడులకు పాల్పడింది. ఈ నేపథ్యంలో పీడిత ప్రజానీకం పక్షాన కమ్యూనిస్టు పార్టీ అండగా నిలిచి ఉద్యమాన్ని ఉధృతం చేసింది. రావి నారాయణరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వర రావు, భీమ్ రెడ్డి నరసింహారెడ్డి, ధర్మబిక్షం, రాజ బహదూర్ గౌర్, మగ్దూం, దేవులపల్లి వెంకటేశ్వరరావు, మాకినేని బసవ పున్నయ్య, నల్ల నరసింహులు, ఓంకార్, బద్దం ఎల్లారెడ్డి, ఎస్. వి. కే .ప్రసాద్, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, మల్లు స్వరాజ్యం, చిర్రావూరి, సి. యాదగిరి రావు వంటి ప్రముఖులతో పాటు మరె ఎంతో మంది అజ్ఞాత వీరులు పోరును తీవ్రతరం చేశారు. ఈ సమయంలోనే షేక్ బందగి, కొమరయ్య వంటి వీరులు అమరులయ్యారు.


ఈ ప్రజా పోరు నేపథ్యంగా అపారమైన ప్రజా సాహిత్యం వెల్లువలా వచ్చింది. మగ్దూం నిజాం రాజరికన్ని ధిక్కరిస్తూ"అది ఒక దయ్యాల మేడ, శిథిల సమాజాల నీడ"అంటే మరో ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు ఓహెూ ఓహెూ పల్లె దొరా! ఓహెూ ఓహెూ పాత దొరా! ఒంటరి తుంటరి తొండి దొరా! ఎంతకు మారని మొండి దొరా! అని నిరసించాడు. తిరునగరి రామాంజనేయులు "నైజాము సర్కారు రా, నాజీల మించిందిరా, అని తూర్పారబట్టాడు. దాశరథి"ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని, తీగలను తెంపి అగ్నిలో దింపినావు, నా తెలంగాణ కోటి రత్నాల వీణ"అని వర్ణించాడు. సోమ సుందర్ "ఖబడ్దార్ పాదుషాయే! అంటూ"ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభావింతురు, ఒక నెత్తుటి బొట్టు లోనే ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు" అని హెచ్చరించాడు. ప్రజా కవి కాళోజి"దొంగలు దొంగలు ఊర్లు పంచుకొని, దొరలై వెలిగేదేన్నాళ్ళు, నల్లగొండలో నాజీవృత్తుల, నగ్న నృత్యమింకెన్నాళ్లు" అని ప్రశ్నించాడు. ముఖ్యంగా బండి యాదగిరి రాసిన బండెనుక బండి గట్టి అనే పాటలో చుట్టుపట్ట సూర్యపేట, నట్టనడుమ నల్లగొండ... గోలకొండ ఖిల్ల కింద, నీ గోరి కడతాం కొడుకో! అనే పాట ఆనాటి ప్రజలను ఉర్రూతలూగించింది. అలాగే వట్టికోట ఆళ్వారు స్వామి రచించిన ప్రజల మనిషి, గంగు, దాశరథి అగ్ని ధార ,రుద్రవీణ, రంగాచార్య చిల్లర దేవుళ్ళు, జనపదం, మోదుగు పూలు, మహీధర ఓనమాలు, రథచక్రాలు, బొల్లిముంత శివరామ కృష్ణ మృత్యుంజయులు, పొట్లపల్లి రామారావు జైలు కథలు, కాంచనపల్లి చిన్న వెంకట రామారావు, పి.వి. నరసింహారావు గొల్ల రామవ్వ కథలు, సుంకర మాభూమి నాటకం మొదలైనవి ఆనాటి ప్రజా పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించినవి.

మట్టి మనుషుల మహేతిహాసంగా సాగిన ఈ ప్రజా పోరాటం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఫాబ్లో నెరూడా వంటి రచయితలతోనూ స్టాలిన్ లాంటి మహా నాయకులతోనూ మన్నన పొందింది. ఈ పోరాటంలో 4,000 మంది అమరులు కాగా వేలాది గ్రామాలు వెట్టి నుంచి విముక్తి పొందాయి. 10 లక్షల ఎకరాల భూపంపిణీ జరిగింది. సెప్టెంబర్ 1947లో మొదలైన సాయుధ పోరాటం అక్టోబర్ 1951 దాకా సాగింది. కమ్యూనిస్టులు ఆనాడు పీడిత ప్రజానీకం పక్షాన వీరోచితంగా పోరాడినందున 1952లో జరిగిన మొదటి పార్లమెంట్ ఎన్నికలలో నల్లగొండ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఆనాటి తెలంగాణ సాయుధ సమరసేనాని రావి నారాయణరెడ్డి దేశంలో నెహ్రూ కన్నా అత్యధిక మెజార్టీని సాధించి చరిత్రను సృష్టించాడు. అలాగే తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించి అందులో ప్రత్యక్షంగా పాల్గొన్న నేతలు తర్వాత పరిశోధకులు, దాని పూర్వాపరాలను విశ్లేషిస్తూ విలువైన గ్రంథాలను రచించారు. అప్పటి ప్రజా సాహిత్యం పై వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరిగాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని"ప్రపంచ కార్మికులారా! ఏకం కండి."అని మానవాళికి సందేశం ఇచ్చే కమ్యూనిస్టులు సంఘటితమై కార్పోరేటికరణ పాలైన ప్రస్తుత వ్యవస్థను ప్రక్షాళన చేయటానికి స్ఫూర్తినివ్వాలని కోరుకుంటున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# తెలంగాణ గిరిజనుల
## జీవన విధానం, సాహిత్య చిత్రణ



భారత ఉపఖండం భిన్న జాతులు, భాషలు, సంప్రదాయాల కలయికగా విలసిల్లుతుంది. ఇందులో గిరిజన సముదాయాలు శతాబ్దాలుగా తమ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ జీవిస్తున్నాయి. తెలంగాణలో ఈ గిరిజనులు అడవులు, కొండలు, నదుల మధ్య నివసిస్తూ భూకృషి, వృక్షరక్షణ, సంప్రదాయ కళలలో ప్రసిద్ధి చెందారు. వారి జీవనం ప్రకృతి ఆధారితమైనది. వ్యవసాయం, పండ్ల సేకరణ, వన్యజంతు సంరక్షణ, స్థానిక వనరుల వినియోగం ద్వారా ఆర్థిక, ఆహార అవసరాలను తీరుస్తారు. కుంట, జాంగ, మాదిగ, రంగారెడ్డి వంటి సమూహాలు ఈ విధానంలో ముందున్నాయి.

సాంస్కృతిక విలువలు భౌతిక, ఆధ్యాత్మిక పరిసరాలపై ఆధారపడి ఉంటాయి. పోలవరం పండుగ, సింగినేలా వేడుకలు సమాజాన్ని ఏకం చేస్తూ సామాజిక బంధాలను బలోపేతం చేస్తాయి. ఇందులో గీతాలు, నృత్యాలు, కథా వర్ణనలు తరాలుగా సంప్రదాయాలను పరిరక్షిస్తున్నాయి. స్థానిక భాషలు, పలుకుబడులు, జానపద కథలు నైతిక పాఠాలు, సామాజిక నియమాలు, ప్రకృతి ఆధార జీవనాన్ని యువతకు బోధిస్తాయి. ఈ కథలు వినోదం మాత్రమే కాకుండా సామాజిక, ఆధ్యాత్మిక, ఆర్థిక విషయాలను ప్రతిబింబిస్తాయి.

గిరిజన మహిళలు కుటుంబ నిర్వహణ, వృక్ష పండ్ల సేకరణ, ఆహార తయారీ, కళల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. వారి కవిత్వం, పాటలు అనుభవాలు, వ్యంగ్యం, ప్రకృతి అవగాహనను వ్యక్తం చేస్తాయి. అయితే, ఆధునికీకరణ, భూసంపత్తి సమస్యలు, విద్యా, ఆరోగ్య అవకాశాల లోపం వంటివి ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు మెరుగుపరచడానికి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, సంప్రదాయ మరియు ఆధునిక జీవనాల మధ్య సమతుల్యం అవసరం.

గిరిజనులు పట్టణాలకు దూరమైన ప్రకృతి వనరుల ప్రాంతాలలో జీవిస్తూ అభివృద్ధి చెందని సమూహాలు. తెలంగాణలో కోయ, గోండు, లంబాడి, ఎరుకల వంటి తెగలు ప్రసిద్ధి. ప్రతి తెగకు ప్రత్యేక భాష, సంప్రదాయం, వృత్తి ఉన్నాయి. వారి వృత్తులు వ్యవసాయం, వృక్షరక్షణ, వన్యజంతు సంరక్షణ, స్థానిక కళలతో ముడిపడి ఉన్నాయి.

తెలంగాణ గిరిజనులు భూ సమస్యలు ఎదుర్కొంటున్నారు. భూమిని ప్రాణంగా భావిస్తారు. 1970లలో శ్రీకాకుళ పోరాటం వంటివి సాహిత్యంలో ప్రతిబింబించాయి. 1952 జాతీయ అటవీ విధానం అడవులను సార్వజనిక ఆస్తిగా ప్రకటించి గిరిజన హక్కులను పరిమితం చేసింది. పోలవరం ప్రాజెక్టు వల్ల వలసలు, జీవన హాని జరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు వరదలు, పోడి, వానలు వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తాయి. కరువు, ఆకలి, మత మార్పిడి దాడులు, ఆచార వ్యవహారాలలో సమస్యలు, చైతన్య లోపం, స్త్రీ హక్కులు, వెట్టి, శ్రమ దోపిడీ వంటివి ఉన్నాయి.

సాహిత్యంలో భూ సమస్యలు శిరంశెట్టి కాంతారావు "బిగిసిన పిడికిళ్ళు"లో చిత్రితమయ్యాయి. కోదండయ్య, యోగిరావు పాత్రలు ఆక్రమణ, చైతన్యాన్ని చూపిస్తాయి. పోలవరం సమస్య జీవన్ "పోటెత్తిన జనసంద్రం", దిలావర్ "అరణ్యరోదన"లో వివరించబడింది. ప్రకృతి వైపరీత్యాలు ఉదయమిత్ర "దాడి"లో ఆదిలాబాద్ పరిస్థితిని చూపాయి.

కరువు, ఆకలి తుమ్మేటి రఘోత్తమ రెడ్డి "పనిపిల్ల"లో వర్గ విభేదాలు, మానసిక సంఘర్షణలు చూపబడ్డాయి. బోయ జంగయ్య "అడవి పూలు"లో మోతి ఆకలి చావు వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. మత మార్పిడి పెద్దం అనసూయ "మూగబోయిన శబ్దం"లో గిరిజన యువతి చదువు, ఉద్యోగం మధ్య సంప్రదాయాలు చూపబడ్డాయి.

ఆచార వ్యవహారాలు సమ్మెట ఉమాదేవి "రేల పూలు"లో 17 కథలు జీవన వైవిధ్యాన్ని వివరిస్తాయి. అల్లం రాజయ్య "మలుపు నాగరికత"లో సానుకూల మార్పు చూపారు. చైతన్యం బి.ఎస్. రాములు "అడవి", జనపరెడ్డి సత్యనారాయణ "అడవి మల్లెలు"లో పోరాట ధైర్యం ప్రతిబింబించింది.

స్త్రీ సమస్యలు మయూరి "మా బడి"లో మహిళా ఏకాంతం, ధైర్యం చూపబడ్డాయి. అల్లం రాజయ్య "బురద"లో ప్రపంచీకరణ, వలసలు, సవాళ్లు వివరించబడ్డాయి. వెట్టి, శ్రమ దోపిడీ పి. చంద్ "రాధాబాయి"లో ఇసుక వ్యాపార దోపిడీ చూపబడింది. గోపీ భాగ్యలక్ష్మి కథలు "జంగు బాయి" మొదలైనవి స్వేచ్ఛ, ఆచారాలు వివరిస్తాయి. శ్రీలత "రెల్లు పూల జల్లు", బోయ జంగయ్య "ఇప్ప పూలు", మోస్రాం మనోహర్ "ఇప్ప పూలు", సాహూ కథలు జీవన పరిస్థితులను ప్రతిబింబిస్తాయి.

తెలంగాణ గిరిజన కథా సాహిత్యం పై పరిశోధనలు జి.శైలమ్మ "తెలుగు కథా సాహిత్యం గిరిజన జీవిత చిత్రణ", ఎ.నరసింహ నాయక్ "తెలంగాణ గిరిజన కథా సాహిత్యం: ఒక సమీక్ష" మొదలైనవి. వ్యాసాలు సంధ్యా తివారి "తెలంగాణ గిరిజనుల సంస్కృతి వైవిధ్యం", జయధీర్ తిరుమలరావు మొదలైనవి.

ఈ సాహిత్యం గిరిజనుల సమస్యలను సాంఘిక, రాజకీయ, మానవ హక్కుల కోణంలో ప్రతిబింబిస్తుంది. గిరిజనులు ఆధునిక సమాజంలో సమానులుగా ప్రతిబింబించబడుతున్నారు. ఈ కథలు సమాజానికి గిరిజనుల గుర్తింపు కల్పిస్తాయి.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

# తెలుగు సాహిత్యంపై పాశ్చాత్య విమర్శ

తెలుగు సాహిత్యం, దాని గొప్ప ఆలంకారిక సంప్రదాయాల నుంచి ఆధునిక రాజకీయ-సామాజిక దృక్పథాల వరకు ప్రయాణించిన ఒక గొప్ప నది. ఈ నదికి ప్రవాహాన్ని జోడించినది పాశ్చాత్య ప్రభావం. ముఖ్యంగా సాహిత్య విమర్శ రంగంలో. 19వ శతాబ్దం ఆధునికీకరణలో ఆంగ్ల విద్య, మిషనరీల ప్రచారం, ముద్రణాశ్రమాలు ద్వారా ప్రవేశించిన పాశ్చాత్య సిద్ధాంతాలు తెలుగు సాహిత్య విమర్శను, సంస్కృత లక్షణ శాస్త్రాల నుంచి విడిపించి, నూతనంగా విశ్లేషణాత్మక, చరిత్రాత్మక, సామాజిక దృక్పథాల వైపు మళ్లించా యి. అయితే, ఈ ప్రభావం కేవలం ఆవిష్కరణలకు మాత్రమే పరిమితం కాదు. స్వంత సాంస్కృతిక మూలాలను కోల్పోయే ప్రమాదానికి కూడా దారితీసింది. తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలో పాశ్చాత్య ప్రభావం 19వ శతాబ్దం మధ్యలో మొదలైంది. సంస్కృత ఆధారిత లక్షణ శాస్త్రాలు (అలంకా రాలు, రసాలు) ఆధారంగా జరిగిన సాంప్రదాయ విమర్శకు బదులుగా, పాశ్చాత్య టెక్స్టువల్ క్రిటిసిజం, కంప్యారిటివ్ అనాలిసిస్ వంటి పద్ధతులు ప్రవేశించాయి. బ్రిటిష్ భాషా శాస్త్రవేత్త సీ.పీ. బ్రౌన్ దీనికి ఆద్యుడు. తెలుగు గ్రంథాల సంపాదన, సంపాదకత్వం, విశ్లేషణలో యూరోపియన్ పద్ధతులను అనుసరించారు. అతని ప్రభావంతో జూలూరి అప్పయ్య శాస్త్రి, కరళపాటి రంగయ్య వంటి పాండితులు తాళపత్ర మాన్యుస్క్రిప్టులను సరిపోల్చి, యానో టేట్ చేసి, ప్రచురించారు. గ్రాఫ్.జి.ఎన్. రెడ్డి రచించిన 'ది ఇన్ఫ్లూయెన్స్ ఆఫ్ ఇంగ్లీష్ ఆన్ తెలుగు లిటరేచర్ (1800-1950)'లో, "సీ.పీ. బ్రౌన్ తెలుగులో ఈ రంగంలో పయనియర్ గా చెపుతారు. అతని ప్రోత్సాహంతో స్థానిక పాండితులు యూరోపియన్ పద్ధతులను నేర్చుకుని, పాత తెలుగు గ్రంథాలను సంపాదించి, పరిష్కారించారు" అని కోట్ చేశారు. ఇది తెలుగు విమర్శను చరిత్రాత్మకంగా, శాస్త్రీయంగా మలిచింది. కానీ, విమర్శనాత్మకంగా చూస్తే, ఇది స్వంత సాహిత్య చరిత్రను 'వెస్టర్న్ లెన్స్' ద్వారా మాత్రమే చూడటానికి దారితీసింది, మన స్వంత భావుకత్వాన్ని (భావకవిత్వం) మరచిపోయే ప్రమాదాన్ని తెచ్చి పెట్టింది.

ఈ ప్రభావం సామాజిక సంస్కరణలలో కూడా కనిపిస్తుంది. కందుకూరి వీరేశలింగం పంతులు (1848-1919) తెలుగు ఆధునిక విమర్శకు ఆధారశిలగా భావిస్తున్నారు. ఆంగ్ల విద్య, బ్రాహ్మో సమాజ ప్రభావంతో, సామాజిక దురాచారాలను విమర్శించారు. 'విగ్రహ తంత్ర విమర్శనం' (1874-76)లో పురాతన ఆచారాలు, బాల్య వివాహాలు, వితంతువుల పునర్వివాహాలపై రాసిన విమర్శలు పాశ్చాత్య హేతువాదం (Rationalism) నుంచి ప్రేరణ పొందాయి. అతని 'వివేకవర్ధిని' పత్రిక ద్వారా ప్రచారం చేసిన 'ప్రబంధ విలాసము'లో సాంప్రదాయ కవిత్వాన్ని పారడీ చేసి, కొత్త దృక్పథాన్ని ప్రవేశపెట్టారు. జి.ఎన్. రెడ్డి రచించిన 'ది ఇన్ఫ్లూయెన్స్ ఆఫ్ ఇంగ్లీష్ ఆన్ తెలుగు లిటరేచర్ (1800-1950)' పుస్తకంలో, "వీరేశలింగం ఆంధ్రలోని సామాజిక సమస్యలు - బాల్య వివాహాలు, వితంతువుల వివాహాలు, కుల వివక్షల పై పాశ్చాత్య ప్రభావంతో విమర్శించారు" అని రాశారు. ఇది తెలుగు విమర్శను సామాజిక ఆయుధంగా మార్చింది. అయితే, ఈ విషయాలను విమర్శనాత్మకంగా చూస్తే, ఈ ప్రభావం మన స్వంత 'ధర్మ శాస్త్రాల' విమర్శనా పద్ధతులను విస్మరించి, 'వెస్టర్న్ మోడల్' ను అనుసరించిందని చెప్పవచ్చు. ఉదాహరణకు, వీరేశలింగం రచనలు "బ్రాహ్మణ్యవాదాన్ని" విమర్శించినా, పాశ్చాత్య "ఇండివిడ్యువలిజం" మన సముదాయ సామరస్య పద్ధతుల్ని బలహీనపరిచినట్లైంది.

20వ శతాబ్దంలో ఈ ప్రభావం మరింతగా ప్రభావం చూపి "రొమాంటిసిజం", "రియలిజం" వంటి సిద్ధాంతాలలో మరింత లోతుగా ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలన చేసినట్లు కనిపిస్తుంది. రాయప్రోలు సుబ్బారావు (1891-1955) 'భావకవిత్వం' ప్రవాహాన్ని సృష్టించారు, ఇది వర్డ్స్వర్త్, షెల్లీల ప్రభావం. అతని 'త్రివేణి', 'అభినవ కవితామండలి' లో ప్రకృతి, ప్రేమ, తత్వశాస్త్రాలపై విమర్శలు పాశ్చాత్య రొమాంటిక్ సిద్ధాంతాలను అనుసరిస్తాయి.

జి.ఎన్. రెడ్డి రచించిన 'ది ఇన్ఫ్లూయెన్స్ ఆఫ్ ఇంగ్లీష్ ఆన్ తెలుగు లిటరేచర్ అనే పుస్తకంలో, "ఆంగ్ల రొమాంటిసిజం భావాలు, తత్వాలు తెలుగు కవిత్వానికి కొత్త జీవం, అందాన్ని ఇచ్చాయి" అని కోట్ చేశారు. ఇది తెలుగు విమర్శను భావోద్వేగాత్మకంగా మలిచింది. కానీ, విమర్శనాత్మకంగా, ఈ రొమాంటిసిజం మన స్వంత 'శృంగార రసాన్ని' మరచి, 'పర్సనల్ ఎమోషన్స్' కు ప్రాధాన్యం ఇచ్చినట్లైంది, ఫలితంగా సామాజిక దూరాలు పెరిగాయి.

గురజాడ అప్పారావు "రియలిజం" ప్రభావంతో 'ముత్యాల సరాలు' (1910) లో రాశారు, ఇక్కడ మాట్లాడే తెలుగు, కొత్త ఛందస్సు ఉపయోగించి సామాజిక విమర్శ చేశారు. "కొత్త మీటర్, కొత్త థీమ్లతో మాట్లాడే భాషలో రాసిన కవితలు తెలుగులో కొత్త కవిత్వానికి మార్గాన్ని సుగమం చేశాయి" అని రెడ్డి వివరిస్తారు. దాసు నారాయణరావు టెన్నిసన్ 'లోటస్ ఈటర్స్' అనువాదంలో, "తెలుగులో సెంటిమెంటల్, డిస్క్రిప్టివ్ పోయట్రీ అరుదు. ఇది ఆంగ్ల పోయట్రీ అప్రిసియేషన్కు అడ్డంకి" అని కోట్ చేశారు. పాశ్చాత్య విమర్శనా పద్ధతుల ద్వారా తెలుగు సాహిత్యంలో లోపాలను హైలైట్ చేశారు. ఆధునిక కాలంలో "మార్క్సిజం", "ఫ్రాయిడియనిజం" , పోస్ట్-కలోనియల్ సిద్ధాంతాలు తెలుగు విమర్శను మరింత రాజకీయీకరణకు దారి చూపాయి. కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వ తత్వ విమర్శనం' (1948)లో పాశ్చాత్య పద్ధతులతో తెలుగు కవిత్వాన్ని విశ్లేషించారు.

ముట్నూరి కృష్ణారావు 'కృష్ణపత్రిక'లో రాసిన విమర్శలు బెంగాలీ, ఆంగ్ల ప్రభావాలతో సామాజిక-సాహిత్యిక విశ్లేషణలు చేశారు. వేదం వెంకటరాయ శాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి వంటి వారు "టెక్స్టువల్ క్రిటిసిజం" ను ముందుకు తీసుకెళ్లారు. పి. దక్షిణామూర్తి 1892లో పింగళి సూరనపై రాసిన విమర్శలో "పోయట్ జీనియస్ను వెస్టర్న్ ప్రిన్సిపల్స్తో ఎవాల్యుయేట్ చేశారు" అని రెడ్డి చెబుతారు.

విమర్శనాత్మకంగా చూస్తే, పాశ్చాత్య ప్రభావం తెలుగు విమర్శను "గ్లోబలైజ్" చేసినా, సొంత సాంస్కృతిక స్వరూపాన్ని కోల్పోయినట్లైంది. సంస్కృత "రస సిద్ధాంతానికి" బదులు "స్ట్రక్చరలిజం" వంటివి దిగుమతి చేయడం వల్ల, మన సాహిత్యం "ఓరియంటల్"గా మిగిలిపోయింది. ఉదాహరణకు, మార్క్సిస్ట్ విమర్శలో తెలుగు కవులను "క్లాస్ స్ట్రగుల్" వర్గ దృక్పథంతో చూడటం " భక్తి సాహిత్యం" "ఆధ్యాత్మికత" ను విస్మరించినట్లైంది. అయితే, ఈ ప్రభావం లేకుండా తెలుగు విమర్శ 'స్టాగ్నెంట్'గా ఉండేదని ఒప్పుకోవాలి.


పాశ్చాత్య విమర్శనా పద్ధతుల ప్రభావం తెలుగు సాహిత్య విమర్శకు కొత్త డైనమిక్స్ ను ఇచ్చిందని ఒప్పుకోవాలి. విశ్లేషణ, సామాజిక ప్రసంగికత, గ్లోబల్ కంపారిజన్. మొదలైనవి, దీన్ని స్వంత సంప్రదాయాలతో సమతుల్యం చేయాలి. లేకపోతే, మన విమర్శ "కలోనియల్ ఎకో " గా మిగిలిపోతుంది. ఈ సమతుల్యతే తెలుగు సాహిత్యాన్ని భవిష్యత్తుకు తీసుకెళుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# నిరంతర తనిఖీలతోనే ప్రమాణాలు


'గురుకుల విద్యార్థులకు కలుషిత ఆహారం', 'కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత', 'సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్' వంటి శీర్షికలతో పత్రికల్లో వార్తలు రావడం సర్వసాధారణంగా మారింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు రాష్ట్రంలో ఎక్కడో చోట ప్రతీ రోజూ చోటు చేసుకుంటున్నాయి. వీటిపై ప్రతిపక్ష పార్టీల నేతలు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే స్వయంగా సీఎం సైతం స్పందించి.. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని కామెంట్ చేశారు. అయినా ఫుడ్ పాయిజన్ ఘటనలు కొనసాగుతున్నాయి. సీఎం మాటలు నీటిమూటలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో సమస్యకు మూలం ఎక్కడుందనే ప్రశ్నను మౌలికంగా అర్థం చేసుకోవాల్సిన అవసరముంది. పక్క రాష్ట్రమైన ఏపీలో ఫుడ్ కమిషన్ వ్యవహరిస్తున్న తీరును పరిశీలించాలి. ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ నిత్యం తన సిబ్బందితో కలిసి ఆకస్మిక, నిరంతర తనిఖీలను కొనసాగిస్తుండటం గమనించొచ్చు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరలవుతుండటం గమనించొచ్చు. సంక్షేమ వసతి గృహాలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం, రేషన్ సరుకుల పంపిణీ విషయమై వచ్చే ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించే దిశగా ముందుకెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లి..విద్యార్థులు, ప్రజలు, అధికారులతో ముచ్చటించి.. అక్కడే మాట్లాడి.. తప్పు చేసిన వారిపైన చర్యలకు ఆదేశాలు ఇవ్వడం, కేసుల నమోదు, చివాట్లు పెట్టడం వంటివి చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు మేలు జరిగే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. తెలంగాణలో సైతం ఆ మేరకు ఫుడ్ కమిషన్ ఏర్పాటు విషయమై ఆలోచన చేయాలి. రాష్ట్రంలో ఫుడ్ కమిషన్ పనితీరు, అధికారుల ఆకస్మిక తనిఖీలు తూతూ మంత్రంగానే సాగుతున్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వం ఫుడ్ కమిషన్ విషయమై ప్రాధాన్యత అంశంగా పరిగణించి, నిజాయితీ గల అధికారులు, వ్యక్తుల ఆధ్వర్యంలో నిరంతరం సంక్షేమ హాస్టళ్లలో తనిఖీలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలి. తద్వారా విద్యార్థులకు నాణ్యతా ప్రమణాలతో కూడిన ఆహారం అందుతుంది. ఫలితంగా వారు చక్కగా విద్యాభ్యాసం కొనసాగించి.. ప్రభుత్వానికి, ప్రభుత్వ పాఠశాలలకు చక్కటి పేరు తీసుకొస్తారు. అది ఆటోమేటిక్గా ప్రజా ప్రభుత్వానికి అనుకూలమైన, సానుకూలమైన సంకేతాలను ప్రజల్లోకి పంపే 'మార్పు' దిశగా అడుగులు పడుతాయి. కాబట్టి ప్రజా ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలి. ఫుడ్ కమిషన్ విషయమై స్పష్టత లేమిని తొలగించి.. ప్రజాప్రభుత్వంలో ప్రజల శ్రేయస్సే ధ్యేయమనే సంకేతాన్ని సర్కారు జనంలోకి బలంగా, విస్తృతంగా పంపాలి. అందుకు ఆచరణలో బలమైన అడుగులు పడాలి.



- అంబీర్ శ్రీకాంత్,
సెల్:81859 68059.

# వివిధ రంగాలలో జానంపల్లి విశిష్ట సేవలు

**సెప్టెంబర్ 15...జానంపల్లి రామేశ్వరరావు వర్ధంతి.**



వనపర్తి సంస్థానాధీశులు హైదరాబాద్ నిజాం పాలకులకు సామంతులుగా ఉండే వారు. వనపర్తి సంస్థానం చరిత్ర కాకతీయ రాజ్యం క్షీణించిన తర్వాత 14వ శతాబ్ద నేపథ్యం కలిగి ఉంది. దక్కన్పై దండయాత్ర చేసి స్థిరపడిన టర్కిక్ ముస్లిం రాజవంశా లు, సంస్థానం బలోపేతానికి కృషి చేశాయి.

స్వతంత్రానంతర భారతదేశంలో తెలంగాణ లోని 14 ప్రధాన జమీందారీ సెగ్మెంట్లలో వనపర్తి ఒకటి. రాజా జానంపల్లి రామేశ్వర్ రావు (ఫిబ్రవరి 6, 1923 - సెప్టెంబర్ 15, 1998) వనపర్తి సంస్థానాధీశులు, దౌత్యవేత్త, భారత పార్లమెంటు సభ్యులు. ఆయన 1923 ఫిబ్రవరి 23న మద్రాసులో రాజా కృష్ణదేవరావు మరియు రాణి సరళా దేవి దంపతులకు జన్మించారు. వనపర్తి సంస్థానాధీశుల కుటుంబములో జన్మించిన రామేశ్వర రావు 1944లో 21 యేళ్ళ వయసులో సంస్థానం పాలన బాధ్యతలను చేపట్టారు. హైదరాబాద్లోని నిజాం కళాశాల, మద్రాసు విశ్వవిద్యాలయం మరియు బాంబే విశ్వ విద్యాలయంలో చదివారు. 1944లో ఆయనకు పూర్తి పరిపాలనా అధికారాలు లభించాయి. రామేశ్వర రావు 1949లో ఇండియన్ ఫారిన్ సర్వీసులో చేరి 1950-52ల మధ్య నైరోబిలో ప్రథమ భారతీయ రాయబారిగా పనిచేశారు. 1953 నుండి 1956 వరకు గోల్డ్కోస్ట్ (ఘనా), నైజీరియాలకు భారత రాయబారిగా ఉన్నారు. వృత్తిరీత్యా వ్యవసాయ దారుడు, వ్యాపారస్తుడు అయిన రామేశ్వర రావు వ్యవసాయము, సాగునీటి అభివృద్ధికి కృషి చేశారు. వ్యవసాయ కూలీలను సంఘటితం చేసి లేబర్ యూనియన్ల ఏర్పాటుకు తోడ్పడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించిన రామేశ్వర రావు 1958లో ఐక్యరాజ్య సమితికి భారతీయ బృందంలో, 1960-61లో ఐక్యరాజ్య సమితి కాంగో కన్సీలియేషన్ కమిషన్లోనూ, 1964-65లో అల్జీర్స్లో జరిగిన ఆఫ్రో-ఆసియా సదస్సులో సభ్యునిగా వెళ్లారు. రామేశ్వర రావు 2వ, 4వ, 6వ లోక్సభలకు మహబూబ్ నగర్ లోక్సభ నియోజకవర్గం నుండి భారత జాతీయ కాంగ్రెసు అభ్యర్థిగా 1957 నుండి 1979 వరకు మూడు సార్లు ఎన్నికయ్యారు. చురుకైన పార్లమెంటు సభ్యుడిగా రామేశ్వర రావు పార్లమెంటు విదేశాంగ వ్యవహారాల సలహా సంఘంలోనూ, ప్రణాళికా సలహా సంఘంలోనూ సభ్యుడిగా పనిచేశారు. రామేశ్వరరావు 1998, సెప్టెంబర్ 15న 75 ఏళ్ల వయసులో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494


## లేమితనం

నేనున్నానంటూ -
భుజం తట్టే వారే లేకపోతే,
నీకూ నాకూ
ఈ ఒంటరితనమే కదా,
ఓ మంచి నేస్తం!

మనుషుల రూపు రేఖలన్నీ
మారిపోతున్నాయి,
ఉన్నపళంగా ఏ వ్యక్తినీ గుర్తు
పట్టలేకపోతున్నాను.
నా చుట్టూ,
నా పక్కలా,

నాతో, నాలో -
ఎవ్వరూ లేరు,
నేనొక్కడినే ఈ లేమితనాన్ని
అనుభవిస్తున్నాను.

బాలాజీ పోతుల
8179283830



# ఇదిగో ఇల్లు..ఏది బిల్లు..?

- పైలెట్ ప్రాజెక్టు నాగిరెడ్డిపల్లిలో 7 నెలలు గడిచిన జమకాని బిల్లు
- లబ్ధిదారు మేకల అనురాధ ఆవేదన..

**బొంరాస్ పేట, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో సాంకేతిక కారణాలవల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం బొంరాస్ పేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని అధికారులు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 97 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి మంజూరు పత్రాలు అందజేశారు.97 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 30 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టారు.మొదటి విడతలో భాగంగా ఫిబ్రవరి 25న అధికారులు,నాయకులు గ్రామంలోని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు మేకల అనురాధ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు.లబ్ధిదారు 600 చదరపు అడుగుల కంటే ఇల్లు ఎక్కువగా నిర్మిస్తుందని గుర్తించిన అధికారులు తగ్గించాలని సూచించగా అధికారుల సూచన మేరకు 600 చదరపు అడుగుల కంటే తక్కువ నిర్మాణం చేపట్టిన స్లాబుదశకు చేరిన ఇప్పటివరకు బిల్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నానని అధికారులు తనకు బిల్లు అందేలా న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేసింది.



### అప్పులు చేసి ఇల్లు నిర్మించాను..

నా పేరు మేకల అనురాధ నాగిరెడ్డిపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన అధికారులు ఇంటి నిర్మాణము 600 చదరపు అడుగుల కంటే ఎక్కువగా ఉందని కుదించి నిర్మించాలని సూచించగా అధికారుల సూచన మేరకు 600 చదరపు అడుగుల కంటే తక్కువ కొలతలతో ఇల్లు నిర్మించి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బిల్లు ఖాతాలో జమ కాలేదని, అధికారులకు మొరపెట్టుకున్న వస్తుంది అంటున్నారు తప్ప ఎప్పుడొస్తుందో బిల్లు క్లారిటీ ఇవ్వడం లేదని జిల్లా కలెక్టర్ గారు స్పందించి నాకు న్యాయం చేసి బిల్లు అందేలా చూడాలి.



**మేకల అనురాధ, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు, నాగిరెడ్డిపల్లి**

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

- యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి ట్రాఫిక్ సిఐ నరసింహారెడ్డి
- డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఏడు కేసులు నమోదు

**యాచారం, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో యాచారం బస్టాండ్ వద్ద సిఐ నందీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సిఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఏడు కేసులు నమోదయ్యాయని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపట్ల కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇతర వాహనాలకు ఇబ్బంది కలిగించొద్దని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఎక్కువ డ్రంకన్ డ్రైవ్ వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు తనిఖీ చేసే నంబర్ ప్లేట్లు, డాక్యుమెంట్లు హెల్మెట్లు లేని వారికి కౌన్సిలింగ్ చేశారు. వాహనాలు నడపడంలో వాహనాలకు కచ్చితంగా నెంబర్ ప్లేట్లు అవసరమైన డాక్యుమెంట్లు అన్నీ ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్న దృష్ట్యా రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. తనిఖీల్లో పలువురు పోలీసులు పాల్గొన్నారు.



## ఎస్ఆర్ కాలేజీలో రాగ్యింగ్

- పట్టించుకోని యాజమాన్యం
- మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

**మేడిపల్లి, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** ఓ విద్యార్థిని తోటి విద్యార్థులు ర్యాగింగ్ చేస్తూ ఆపై దాడిచేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగరకి చెందిన గంగాధరి గణేష్ (17) అనే విద్యార్థి ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.. గణేష్ ని హాస్టల్ లో ముగ్గురు తోటి విద్యార్థులు మొదటి నుంచి ర్యాగింగ్ చేస్తూ, బాధిస్తూ, కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గణేష్ ని బోడుప్పల్ లోని స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. గణేష్ ను ర్యాగింగ్ చేస్తూ కొట్టిన విషయం ఎస్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ రెడ్డి కి తెలిపిన స్పందన రాకపోవడంతో, మేడిపల్లి పీఎస్ లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆపై విద్యార్థులపై చర్యలు చేపట్టాలని ఎస్ ఆర్ కళాశాల ముందు బంధువులు ఆదివారం ఆందోళనకు దిగారు.



### విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్న విషయం మా దృష్టికి తీసుకురాలేదు-హరీష్ రెడ్డి, ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

గణేష్ని తోటి విద్యార్థులు బాధిస్తున్న విషయం తమ దృష్టికి ఎప్పుడు తీసుకు రాలేదని, గణేష్ వేరే విద్యార్థి కొట్టుకున్నారని అదే రూమ్ లో ఉంటున్న ఇతర విద్యార్థులు తెలిపారని, హాస్టల్ లో ఉండలేక కూడా విద్యార్థులు ఇలా తెలుపుతారని అన్నారు. కొట్టిన విద్యార్థుల తల్లిదండ్రులను కూడా రమ్మని చెప్పమని వారి వివరణ కూడా తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు

- డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్

**హయత్‌నగర్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** హయత్ నగర్ లోని ఆర్టీసీ డిపో వద్ద సీఐటీయూ ఆఫీస్ ఆవరణలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) హయత్ నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యం లో సీతారాం ఏచూరి ప్రధమ వర్ధంతి సభ కు కీసర నర్సిరెడ్డి అధ్యక్షతన డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట రమేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయ సాధన అంటే వామపక్ష సెక్యులర్ శక్తుల ఐక్యతతో మతోన్మాద శక్తులను ప్రతిఘటించి సెక్యులరిజం ను కాపాడటం, లౌకిక తత్వాన్ని నిలబెట్టి పాలకవర్గాల దుష్ట చర్యలని అరికట్టడం అని వారు అన్నారు. రాజ్యాంగ విలువల కోసం మనం పోరాడాలని, సమ సమాజ స్థాపన కోసం ఏచూరి చేసిన కృషి ఎనలేని దని వారు గుర్తు చేశారు. నేడు దేశంలో చరిత్రని వక్రీకరించి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంలో చిత్రీకరించి ప్రజలలో విభజన తెచ్చేందుకు సిద్ధమవుతున్నదని వారు పేర్కొన్నారు. దోపిడి ఎక్కడ ఉంటే ఎర్రజెండా అక్కడ ఉంటుందని, ప్రజా సమస్యల గురించి నిరంతరం పోరాటాలు చేసే వారే కమ్యూనిస్టులు అని వారు తెలిపారు. “తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు” చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు తిరగబడతారని మతోన్మాదులను వారు తీవ్రంగా హెచ్చరించారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లో వెట్టి చాకిరికి, భూస్వామ్య భూస్వామ్య ప్యూడలిజానికి వ్యతిరేకంగా ప్రజానీకం బాంచను దొర నీ కాల్మొక్త అన్న పేదోన్ని బందుకులు పట్టించి నిజాం సైన్యానికి ఎదురొడ్డి 4 వేల మంది ప్రాణాలర్పించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం దుర్మార్గమని వారు తెలియజేశారు. నాటి పోరాటం లో హిందువులు, ముస్లింలు అనేకమంది ప్రాణాలు త్యాగం చేసి దేశంలో స్వాతంత్రాన్ని తీసుకొచ్చారని నాటి పోరాటంలో బ్రిటిష్ సైన్యానికి లొంగిన ఆర్ఎస్ఎస్ దేశభక్తులుగా చెప్పుకోవడం దుర్మార్గమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేడు బిజెపి ప్రజల్లో విభజనను సృష్టించడానికి చేసే ప్రయత్నాలను ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. వామపక్ష శక్తులు ప్రతిఘటించి దేశ సమగ్రతను రాజ్యాంగాన్ని, లౌకిక తత్వాన్ని కాపాడాలని, సీతారాం ఏచూరి పోరాట స్ఫూర్తిగా ముందుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సురకంటి శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ కమిటీ సభ్యులు చింతపల్లి కృష్ణయ్య, ఎం నరహరి, సిహెచ్ మల్లేశం, కొత్త గణేష్ గౌడ్, సంధ్య, జే అనిల్ రెడ్డి, డి బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, బిక్షపతి, శ్రీనివాస్, బి కనకయ్య, ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ కాలనీలో 16 ఫీట్ల లోతు కుంగిన డ్రైనేజీ

- చెరువులను తలపిస్తున్న పలు కాలనీలు
- పనులను పర్యవేక్షించిన కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**హయత్‌నగర్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ హాయత్ నగర్ లోని ఆర్టీసీ కాలనీ లో 16 ఫీట్ల కుంగిన డ్రైనేజీ మ్యాన్ హెూల్ వలన లెక్చరర్స్ కాలనీ, వినాయక్ నగర్ కాలని, వినాయక నగర్ కాలనీ ఫేస్ -2, ఆర్టీసీ కాలనీ, ఆర్టీసీ ఎక్స్టెన్షన్ నుండి వచ్చే డ్రైనేజీ నీరు ఎక్కడికక్కడ మాన్యువల్స్ పొంగుతుండడం తో దగ్గరుండి జలమండలి యంత్రాంగంతో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మరమ్మత్తుల పనులను చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల క్రితం నుండి కురిసిన భారీ వర్షాల కారణం గా డ్రైనేజీ మాన్ హెూల్స్ లో వివిధ వ్యర్థ పదార్థాలు ఉండడంతో ఒక్కసారిగా ఆర్టీసీ కాలనీ సాయిబాబా దేవాలయం, వినాయక్ నగర్ కాలనీ రోడ్డు నెం.17, వినాయక నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 29, 30, 31 రోడ్లన్నీ డ్రైనేజీ నీళ్లతో చెరువుల తలపించడం తో కాలనీల వాసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు, సమస్యను తాత్కాలిక పరిష్కారం చేయించడం జరిగిందని వారు అన్నారు. రోడ్లపై పొంగుతున్న డ్రైనేజీ సమస్య ఎక్కడి నుండి అని పర్యవేక్షించగా ఆర్టీసీ కాలనీ మెయిన్ రోడ్డు నెం 4 నుండి వెళ్లే ట్రంక్ లైన్ 16 ఫీట్ల లోతు గల మాన్ హెూల్ కుంగిపోవడం వలన సమస్య ఏర్పడిందని వారు పేర్కొన్నారు. జలమండలి అధికారులు వెంటనే స్పందించి పనులు వేగవంతంతో కొనసాగించడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఐదు కాలనీలలో పొంగుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారం కావడంతో పాటు, శాశ్వత పరిష్కారంగా కొన్ని లైన్లు డైవర్షన్ చేయడం వలన మళ్ళీ సమస్య ఏర్పడకుండా ఉండే విధంగా పరిష్కారం చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో జలమండలి మేనేజర్ రాజు, రాజేందర్ బాబు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కళ్యాం శంకర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, రుక్మారెడ్డి, రమణ, గుర్రం బలరెడ్డి, యాదగిరి గౌడ్, పి.ప్రవీణ్ గౌడ్, కాలనీ వాసులు, బీజేపీ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.




## నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య




**బోడుప్పల్, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 343వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించాలి.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ తన మేధస్సును, తన జీవితాన్ని భారతీయుల కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దార పోసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని,1919లో బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి రౌండు టేబుల్ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత,పీడిత,బడుగు,బలహీన,అంటరాని వర్గాలు అనుభవిస్తున్న దుర్భర పరిస్థితిని, నాటి బ్రిటిష్ ప్రభుత్వం గుండె కరిగేలా సభికులు మంత్రముగ్ధులయ్యే విధంగా ఉపన్యసించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను బ్రిటిష్ పత్రికలు సైతం అభినందించాయి.అలాంటి మహెూన్నత వ్యక్తి అపర మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత, విజ్ఞానాన్ని పెంపొందించుకొని సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని, బడుగు బలహీన వర్గాలు చైతన్యవంతమై తమ హక్కుల కోసం పోరాడుతూ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల మాజీ ఉపసర్పంచ్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త రవి గౌడ్, రాపోలు శ్రీరాములు,గరుగుల యాకయ్య, బండారి సాయి, జడ శ్రీనివాస్, సవరపు బయన్న, భరత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్, ఇంజనీరింగ్ పట్టభద్రులకు అరుదైన అవకాశం



**కాప్రా, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** బీటెక్, బిఎస్సి సైన్స్‌తో పట్టభద్రులైన వారు కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న పీజీ సామాజిక శాస్త్రాల కోర్సులలో అడ్మిషన్లు పొందవచ్చని యూనివర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై వెంకటేశ్వర్లు చెప్పారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ లోని పీజీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ లో పీజీ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. బీటెక్, బిఎస్సి సైన్స్ పూర్తి చేసిన వారు అంబేద్కర్ యూనివర్సిటీ పీజీ కోర్సులైన ఎంఏ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ,ఇంగ్లీష్ ఎకనామిక్స్,సోషియాలజీ,జర్నలిజం లలో అడ్మిషన్లు పొందవచ్చని అన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని బీటెక్, బీఎస్సీ సైన్స్ పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 2025- 26 విద్యా సంవత్సరానికి సెప్టెంబర్ 26వ తేదీ వరకు అడ్మిషన్ల గడువును పెంచినట్లు ఆయన చెప్పారు. పీజీ అడ్మిషన్లు పొందగోరే అభ్యర్థులు సికింద్రాబాద్ పీజీ కళాశాలలోని ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ను సంప్రదించాలని అన్నారు. అదేవిధంగా ఇంకా ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, ఎంకాం, బిఎల్ఎస్సి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూనివర్సిటీ వెబ్సైట్ ద్వారా పీజీ అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 7382929623, 8686115491 నెంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు. అంబేద్కర్ యూనివర్సిటీ ద్వారా అందుతున్న విద్యా అవకాశాలను ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తును పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గంగాధర్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ రవి, స్టడీ సెంటర్ సిబ్బంది బి కాంచన, పడాల సతీష్, ఎస్ విజయలక్ష్మి, ఆర్ కె దాసు తో పాటు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదు

- సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ హాజీజ్ పాషా

**హయత్‌నగర్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం లోని మనసురాబాద్ చౌరస్తాలో డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, రాష్ట్ర సీనియర్ నాయకులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి లు హాజరై, పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడింది కమ్యూనిస్టులే అని వారు అన్నారు. నిజాం క్రూరత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తో రజాకార్ల గుండెల్లో దడ పుట్టించింది కమ్యూనిస్టు పార్టీ అని వారు తెలియజేశారు. తెలంగాణ రైతంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు, చరిత్రను వక్రీకరిస్తే, సహించేది లేదని మతోన్మాదులను వారు తీవ్రంగా హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్ రెడ్డి లు సంయుక్తంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటం, సాయుధ పోరాటం లోనూ ఏమాత్రం పాత్రలేని మతోన్మాదులు విమోచన దినోత్సవం అని ప్రగల్బాలు పలుకుతున్నారని వారు ధ్వజమెత్తారు. నిజాంకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడి ప్రాణాలు అర్పించిన కమ్యూనిస్టు యోధులను, అమర వీరులను విస్మరిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని వారు ఆగ్రహించారు. ప్రజలకు వాస్తవాలు తెలిసేలా సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాన్ని నేటి తరం విద్యార్థులకు, యువతకు తెలియపరచవలసిన బాధ్యత మన అందరి పైన ఉన్నదని వారు అన్నారు. తెలంగాణ సాయిధ పోరాటం ద్వారా 3000 గ్రామాలకు విముక్తి కలిగించి, పది లక్షల ఎకరాలను పేదలకు పంచిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ అని వారు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, బందగి వంటి అమరుల త్యాగాలు వృధాగా పోవని, వారి ఆశయాలను సాధించి తీరుతామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, ఏఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హయత్ నగర్ మండల సహాయ కార్యదర్శులు మ్రి శోభన్, కర్నే సుజాత, ఎ.ఐ.టి.యు.సి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, శాఖ కార్యదర్శులు సరిత, గూని శోభ, అరుణ్, పారిజాత, అర్ సౌజన్య, శ్రీను, యమునా, పిఅనిత, ప్రజా నాట్యమండలి కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ధ్యానంతోనే మనస్సు ప్రశాంతత

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల సతీమణి జమున

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** ధ్యానమనేది ఒక కులానికి, మతానికి, ప్రాంతానికి చెందినది కాదని మనస్సుకు సంబందించిందని, ధ్యానంతో మానసిక ప్రశాంతత లబిస్తుందని మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. ఆదివారం తూంకుంట మున్సివల్ లోని హార్ట్ ఫుల్నెస్ శ్రీరామచంద్రమిషన్ కోఆర్డినేటర్ అర్చన, ఆశ్రమ మేనెజర్ సత్యేంద్ర ప్రకాష్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మున్సిప ల్ కేశవరంలో ఒకరోజు ధ్యానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ ద్యానోత్సవంలో ఉమ్మడి మండలంలోని మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, కేశవరం, జగ్గంగూడ, అలియాబాద్, ఆద్రాస్పల్లి, లాల్గడిమలక్పేట, బొమ్మరాశిపేట, తదితర గ్రామా లకు చెందిన సుమారు 300 మంది ఈ ధ్యానంలో పాల్గొన్నారు. అనంతరం ధ్యానకేంద్రం కోఆర్డినేటర్ అర్చన, ఆశ్రమ మేనెజర్ సత్యేంద్రప్రకాష్ లు మాట్లాడుతూ.. ఈ ద్యానం పొందడానికి తూంకుంటంలోని శ్రీరామచంద్రమిషన్ ను సంప్ర దించాలని సూచించారు. మూడు రోజులు ద్యానంలో పాల్గొనాలని ఈ ద్యానాన్ని ఉచితంగా నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మూడుచింతలపల్లి మున్సిపల్ అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్ గౌడ్, లక్ష్మాపూర్ మాజి సర్పంచ్ సింగం అంజనేయులు, జగ్గంగూడ మాజి ఉపసర్పంచ్ నరేంద్రరెడ్డి, స్పీకర్లు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



# ఇప్పటికీ నిజాం పరిపాలనలోనే హైదరాబాద్

- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రకాష్ రావు**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** భారతదేశానికి 1947 ఆగస్టు 15 స్వాతంత్రం వచ్చిన హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇప్పటికీ నిజాం పరిపాలనలో ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రకాష్ రావు అన్నారు. ఆదివారం సదాశివపేటలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సిపిఐ జిల్లా కార్యదర్శి తాజోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి. ప్రకాష్ రావు హాజరై మాట్లాడారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15 స్వాతంత్రం వచ్చిన హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇప్పటికీ నిజాం పరిపాలనలో ఉందన్నారు. ఇక్కడి ప్రజలను దొరలు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్‌లు, జాగిర్దార్‌లు అనేక రకాల ఇబ్బందులకు గురి చేశారన్నారన్నారు. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని 1947సెప్టెంబర్ 11న తెలంగాణ సాయుధ పోరాటానికి సిపిఐ నేతలు రావి నారాయణరెడ్డి, మగ్దూం మొయియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షోయిబుల్లా ఖాన్, రాజాబ్ అలీలు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులో పోరాటంతో 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బిజెపి నేతలు వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. చరిత్ర కలిగిన సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తూ హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరిస్తుందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు షఫీ అహ్మద్, మండల కార్యదర్శి పాండు, పట్టణ కార్యదర్శి అనసూజా, మునిపల్లి మండల కార్యదర్శి గంగమ్మ, సిపిఐ నాయకులు బుజ్జమ్మ, ముస్తఫా, పూలమ్మ, శంకరప్ప, సాధిక్ అలీ, బిపాషా, సంజీవ్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 16న బైరాన్‌పల్లిలో జరిగే సంస్మరణ సభను జయప్రదం చేయండి

- **సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి**



**చేర్యాల, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఈనెల 16 మంగళవారం బైరాన్ పెల్లి బురుజు వద్ద జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చేర్యాలలోని పార్టీ కార్యాలయంలో కొంగరి వెంకట మావో అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. నాడు మన తెలంగాణ ప్రాంతంలో భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దొరల జమీందారుల నైజాము రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా రైతులు, వృత్తిదారులు, కార్మికులు మహిళలు నాటి పీడనకు వ్యతిరేకంగా ఏకమై ఎదురు తిరిగి పోరాడి 10 లక్షల ఎకరాల భూములను సాధించు కున్నారని, వెట్టి చాకిరి విముక్తి జరిగిందని, ఈ పోరాటంలో నాలుగు వేల మంది ఆశువులు భాషారని బైరాన్ పల్లి గ్రామం పై అనేకమార్లు రజాకార్లు దాడులు నిర్వహించగా బైరాన్ పల్లిలో గ్రామ రక్షక దళం రజాకార్లను తరిమికొట్టగా బైరాన్ పల్లి పై కక్షగట్టి రజాకార్లు మోసపూరితంగా మూకుమ్మడి దాడి నిర్వహించగా ఒకే రోజు 96 మందిని కాల్చి చంపినారని బైరానపల్లి బురుజు వద్ద రక్తం ఏరులై పారిందని నాడు వీరమరణం పొందిన బైరాన్ పల్లి అమరవీరుల ను స్మరించుకుంటూ ఈ నెల 16న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంస్మరణ సభను నిర్వహించబోతున్నామని ఈ సంస్మరణ సభకు ముందు చేర్యాల గాంధీ సెంటర్ నుండి బైకు ర్యాలీ ప్రారంభమై బైరాన్ పల్లి వరకు నిర్వహించనున్నామని ఈ బైకు ర్యాలీ, సంస్మరణ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ చుక్కా రాములు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్ కుమార్, చేర్యాల పట్టణ కమిటీ సభ్యులు బోయిన మల్లేశం కార్యకర్తలు తుప్పతిరాజు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్చెరు నియోజకవర్గమని సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబి పురస్కరించుకొని.. ఆదివారం పటాన్చెరు పట్టణంలో ముస్లిం యువత ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ పురస్కరించుకొని పట్టణంలోని మహాత్మా గాంధీ పార్క్ వద్ద సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, గూడెం విక్రమ్ రెడ్డిల ఆధ్వర్యంలో శీతల పానీయాలు, త్రాగు నీటి పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ మతాల సారాంశం ఒక్కటేనని.. ప్రతి ఒక్కరూ పరమత సహనం రూపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో తోడ్పాటు



**చేర్యాల, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో తోడ్పడుతుందని జనగామ డిసిసి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం చేర్యాల మండల కేంద్రంలోని రేణుక గార్డెన్ లో పలు జిల్లాలకు సంబంధించిన కరాటే విద్యార్థులకు బెల్టుల పంపిణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు కరాటేలో రానించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఇదే కార్యక్రమంలో సెన్సాయి డాక్టర్ ఎంఎస్. పాషా కరాటే రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ.. విద్యార్థులు కటోరో శ్రమిస్తే తప్ప కరాటేలో ఉన్నత శిఖరాలను అవరోహించలేరని..కరాటే మానసిక శరీరక ఉన్నతితో పాటు ఉద్యోగాల్లో సైతం మంచి అవకాశాలు ఉంటాయని అన్నారు. కరాటే మహిళలకు ఆత్మ రక్షణతో పాటు మనోధైర్యాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే జిల్లా కార్యవర్గ సభ్యులు చింతల మల్లేశం, విజ్జగిరి ప్రభాకర్, ఎస్.ఎల్లా గౌడ్, ఎస్ ఎల్ల దాస్, పి అవినాష్, ఇతర సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**శివ్వంపేట, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ సేవా పక్షం కార్యక్రమంలో పాల్గొనాలని బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం శివ్వంపేట మండలంలో సేవా పక్షం మండల స్థాయి కార్యాశాల కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దపులి రవి ఆధ్వర్యంలో మండల పార్టీ ఇంచార్జి కవిత రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 17 న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా 17 తేదీ నుండి అక్టోబర్ 2 తేదీ వరకు అంటే 15 రోజులు పాటు సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు, అమ్మ పేరుతో మొక్కలు నాటడం, కుల వృత్తుల వారిని అలాగే రిటైర్డ్ అధికారులను సన్మాన కార్యక్రమం, అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో పాఠశాలల్లో పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నాయకులకు నిర్దేశించడం జరిగిందన్నారు. అనంతరం బీజేపీ శివ్వంపేట మండల కమిటీని ఎన్నుకొని, వారికి నియామక పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి కవితా రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండల్ రావు, జిల్లా కార్యదర్శులు అశోక్ సాదుల, ఎరుకలి భిక్షపతి, బాదే బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శిలు వినోద్ కుమార్, సుధాకర్, మండల ఉపాధ్యక్షులు శేఖర్, షాదుల్లా, సంజీవులు, కుమార్ గౌడ్, నర్సాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, మండల్ కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్, యువ మోర్చా మండల అధ్యక్షుడు భాస్కర్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు భాస్కర్ నాయక్, జిల్లా నాయకులు శ్రీనివాస్ గౌడ్, నర్సారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ రత్నాకర్, యువ మోర్చా నాయకులు నాగరాజు, బూత్ అధ్యక్షులు శివ శంకర్, గణేశ్, నాగరాజు, రాంసింగ్ నాయక్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్మట ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

- **దాత రాళ్ల బండి వెంకట రమణ చారి**



**నంగునూర్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కి తన వంతు కృషి చేస్తా అని దాత రాళ్ల బండి వెంకటరమణచారి అన్నారు. మండలంలోని నర్మట గ్రామంలో ఆదివారం రోజు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల లో పాఠశాల ప్రధానా ద్వారం వద్ద 4 లక్షల 50 వేల రూపాయలతో నిర్మిస్తున్న గేటు పనులను దాత రాళ్ల వెంకటరమణాచారి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ తగిరెడ్డి దేశి రెడ్డి మాట్లాడుతూ నర్మట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు దాత రాళ్ల బండి వెంకటరమణ చారి చేస్తున్న కృషి , ఆర్థిక సహకారం అభినందనీయం అని, పాఠశాలలో భోజన శాలకు 8లక్షల 50 వేల రూపాయలు, కాంపౌండ్ వాల్ కి 60 వేలు, గేటుకు 4 లక్షల 50 వేల రూపాయలు నిధులు దాత వెంకట రమణ చారి ఇవ్వటం పాఠశాల విద్యార్థుల పట్ల ప్రేమ కు నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పాల నారాయణ, టీచర్ ఎండి రఫీ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 17న బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ఝరసంగం, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈ నెల 17న ఝరా సంఘం మండల కేంద్రంలో మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, భారత ప్రధానమంత్రి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం పై ఆదివారం వర్క్ షాప్ నిర్వహించినట్లు మండల పార్టీ అధ్యక్షులు బంటు పురుషోత్తం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 వ తేదీ నాడు ఉదయం ఈ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదవ రెడ్డి, నర్సింలు, రమేష్ అశోక్ కుమార్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **ఫ్రైడ్ హార్ట్ ఇనిస్ట్యూట్ హాస్పిటల్ ప్రారంభం**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గుండె చికిత్స కోసం సంగారెడ్డి పట్టణంలో ఫ్రైడ్ హార్ట్ ఇన్స్టిట్యూట్ ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది ఈ మధ్యకాలంలో గుండె వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు హార్ట్ ఎటాక్లతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందుబాటులో డాక్టర్లు ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి యజమాన్యాన్ని కోరారు. ఫ్రైడ్ హార్ట్ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గుండె చికిత్స కోసం ఈ హాస్పిటల్ ను సంగారెడ్డి పట్టణంలోని 50 బెడ్డేడ్ హాస్పిటల్ ని ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీవో 81లో మిగిలిన వీఆర్ఏ వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** జీవో 81లో మిగిలిన వీఆర్ఏ వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని ఆదివారం 61 వీఆర్ఏ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఐబీ ఆఫీసులో 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ జీవో 81 సమస్యా గురించి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేని కలిసిన వారిలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, చంద్రకాంత్, మహేష్, అశోక్, ఆంజనేయులు, మురళి, రాము, శ్రీనివాస్ ఉన్నారు.

# సామాజిక సేవ అభినందనీయం




**పటాన్‌చెరు, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** సామాజిక సేవా కార్యక్రమాల్లో మంజీర విజ్ఞాన కేంద్రం కృషి అభినందనీయమని పటాన్చెరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ వినాయక్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్ చెరు పట్టణంలోని శ్రామిక భవన్ లో మంజీర విజ్ఞాన కేంద్రం, సిఐటియు ఆధ్వర్యంలో ఆమేదా హాస్పిటల్స్ సౌజన్యంతో అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ డాక్టర్ల బృందం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంను పటాన్ చెరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ వినాయక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో వైద్యం అతి ఖరీదైన ఈ రోజుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుతో వారికి కొంత స్వాంతన చేకూర్చినట్లవుతుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో మంజీర విజ్ఞాన కేంద్రం కృషి అభినందనీయమన్నారు. ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహించడానికి ముందుకు వచ్చిన ఆమేదా హాస్పిటల్స్ మరియు అమెరికన్ లేజర్ కంటి హాస్పిటల్ డాక్టర్ల బృందమునకు అభినందనలు తెలియజేశారు. ప్రతిదీ లాభాలతో చూడకుండా ప్రజలకు సేవా దృక్పథంతో వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులను ప్రజలందరు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆమేదా హాస్పిటల్స్ డాక్టర్ రాజేంద్ర, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, మంజీర విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు అర్జున్, భాసిత్ లు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతుగా ముందుంటామన్నారు. గతంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడంతోపాటు సామాజిక బాధ్యతలో భాగంగా మహిళలకు టైలరింగ్, కంప్యూటర్,స్పోకెన్ ఇంగ్లీష్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలలో ఏంవికే, సిఐటియు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, మూర్తి , సురేష్, వెంకటేశ్, గిరి, నర్సింగరావు, డాక్టర్ బృందం, హాస్పిటల్స్ సిబ్బంది రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

- **మంత్రి శ్రీహరి**



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** రైతులకు అండగా నిలిచేది సంక్షేమం కోరేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని రాష్ట్ర మత్స్య, పాడి పరిశ్రమ, క్రీడలు యువజన శాఖా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు.కొన్నాలుగా నారాయణపేటబి కొడంగల్ ఎత్తిపోతల పథకం లో భూములు కోల్పోతున్న రైతులు పరిహారం ఎక్కువ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.దాంతో పరిహారం 14 లక్షల నుంచి 20 లక్షలు మంజూరు చేస్తామని ప్రకటిస్తూ మంత్రి ఆదివారం నారాయణపేట లోని దీక్షలో ఉన్న రైతుల చే దీక్షలను విరమింప చేశారు.అనంతరం మంత్రి మాజీ డి సి డి అధ్యక్షుడు కే.శివకుమార్ రెడ్డి తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ 69 జిఒ ద్వారా నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి సాగునీరు అందించి ప్రాంత ప్రజల రైతాంగం కలలు నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ప్రకటించిన 14 లక్షలు కాకుండా 20 లక్షలు నష్టపరహారని అందించి రైతాంగ కళ్ళల్లోని ఆనందాన్ని నింపుతున్నామని అన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు కల్పించిన ఏ ఎత్తి పోతల పథకం ఆగదని రైతుల శ్రేయస్సు ఆగదని అన్నారు.అలాంటి వాటికి రైతులు,ప్రజలే బుద్ధి చెప్పారని మళ్ళీ మీ ముందుకు వస్తే ఈ సారి మరింత గట్టిగా బుద్ధి చెప్పాలని అన్నారు.ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులతో స్వీట్లు పంచుకొన్నారు. కార్యక్ర మంలో అఖిలపక్ష నాయకులు వెంకట్రాం రెడ్డి, గోపాల్, మచ్చేందర్ బలరాం,ఇంకోబా, మడి వాల్ కృష్ణ. కాన్కుర్తి వెంకటరెడ్డి, బసిరెడ్డి, బసవరాజ్, ఉట్కూర్ గోపాల్ రెడ్డి, సూర్య ప్రకాశ్ రెడ్డి లతోపాటు మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, కోనగిరి హనుమంతు, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు సలీం ఇతరత్రులు పాల్గొన్నారు.



## పోడు వ్యవసాయాన్ని అడ్డుకోవద్దు

- ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 14 (జనంసాక్షి)** : ఆదివాసీలు జీవనోపాధి కోసం చేస్తున్న పోడు వ్యవసాయాన్ని అడ్డుకోవద్దని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అనుబంధ అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి కోరారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టాలు ఉన్నపటికీ అటవీశాఖ అధికారులు ఆదివాసులను బెదిరింపులకు గురిచేసి, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసులపై అక్రమంగా పెట్టిన కేసులను కొట్టివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగానే టైగర్ జోన్ పేరుతో జీవో 49 తెచ్చి ఆదివాసులపై అటవీశాఖను ఉసిగొలిపి, పోలీసుల బలంతో దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయించి ఆదివాసులను జైలు పాలు చేస్తూ, కోర్టుల చుట్టూ తిప్పుతూ మానసికంగా భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసులందరికీ పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చి అధికారం లోకి వచ్చారని అన్నారు. 2005 అటవి హక్కుల చట్టం ప్రకారం ఆదివా సులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తెచ్చిన జీవో 49 భేషర తుగా రద్దు చేసి, ఆదివాసులకు ఇచ్చిన హామీ తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీలు, ఏఐకేఎంఎస్ నాయకులు సత్యం, భీమయ్య , బుర్స నాగయ్య, పురుషోత్తం, శ్రీనివాస్, గంగమ్మ, శంకరక్క, మారక్క, ముత్తయ్య, కనకయ్య, సమ్మక్క పాల్గొన్నారు.

# అందినంత దోచుకున్న ధర్మారెడ్డి

- గత ప్రభుత్వంలో అభివృద్ధి ముసుగులో దోపిడీ
- మాజీ ఎమ్మెల్యే విమర్శలు బాధ్యతారాహిత్యం
- ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నాం
- విలేకరుల సమావేశంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ధ్వజం



**పరకాల, సెప్టెంబర్ 14 (జనం సాక్షి):** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ లబ్ధిపొందాలని కెసిఆర్ కుటుంబం నుండి మొదలు నియోజకవర్గ నాయకులకు ఫ్యాషన్ అయిపోయిందని అన్నారు. యూరియా కొరతపై బిఆర్ఎస్ నాయకులు రైతులను అయోమయంలో పడేలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని,బాధ్యతగల రాజకీయ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించకుండా నిజాయితీగా ఉండాలని అన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాకు మొత్తం 16 వేల మెట్రిక్ టన్నుల గాను 14వేల 500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, మిగతా యూరియా మరి కొద్ది రోజుల్లో వస్తుందన్నారు.మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి చేస్తున్న విమర్శలు బాధ్యత రహితానికి నిదర్శనం అని, రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ఖమ్మంలో రైతులకు బేడీలు వేసి జైలుకు పంపిన చరిత్ర మీదనీ, వడ్ల కుప్పల మీదనే గుండెపోటు వచ్చి రైతులు మరణించింది మీ టిఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్నారు.అభివృద్ధి గురించి అవగాహన ఉన్నదా అని అడిగే స్థాయి నీకు ఉన్నదా అని ప్రశ్నించారు.పరకాల ను విద్యా, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కృషి చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పెండింగ్ బిల్లులను చెల్లించాము,49 వేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టి పోయిన దుర్మార్గపు ప్రభుత్వం మీ టిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు.నెలకు 6వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెడుతూ 6500 కోట్ల అప్పును కడుతున్నామని అన్నారు.గత ప్రభుత్వం అభివృద్ధి ముసుగులో దోచుకు తింటే ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనే మేము కష్టపడి పనిచేస్తున్నామని అన్నారు. నియోజక వర్గంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని వారి కోసం డైరీ, కుట్టు శిక్షణా కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను తీసుకొని వచ్చి విద్యారంగంలో అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నానని అన్నారు.అవసరం లేనిచోట చెక్ డ్యామ్ లను,రోడ్లను నిర్మించి దోచుకుతిన్నావు.టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి చేస్తున్నాం 863 ఇండ్లు ఇచ్చాం, మోడ్రన్ విలేజ్ గా అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. హాస్పిటల్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటల్ బిల్లులు ఇప్పించలేని చేతకాని దద్దమ్మవు మాపై విమర్శలు చేస్తున్నావ్ 11.5కోట్ల నీ బిఆర్ఎస్ హాయంలో పెండింగ్లో హాస్పటల్ బిల్లులు ఉన్నాయని మా ప్రభుత్వం అట్టి బకాయిలు చెల్లించిందని అన్నారు.యూరియా సప్లై చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పై ఉందని, యూరియా పై బిఆర్ఎస్ నాయకులు ఎక్కడ కూడా కేంద్రాన్ని,బిజెపిని విమర్శించడం లేదని ఆ రెండు పార్టీలు ఒకటే అన్నారు.కేంద్రంపై కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని అన్నారు.



## రైతులకు తప్పని యూరియా తిప్పలు

**నల్లబెల్లి, సెప్టెంబర్ 14 (జనంసాక్షి):** మండల రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. గత నెల రోజులుగా యూరియా కోసం మండల కేంద్రం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వ్యవసాయ పనులను సైతం పక్కనపెట్టి యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్ లో నిలబడుతున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా కోసం మహిళలు సైతం క్యూ లైన్ లో నిలబడ్డారు. ఉదయం నుంచే రైతు వేదిక వద్ద రైతులు బారులు తీరారు. వ్యవసాయ అధికారులు జారీ చేసే టోకెన్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండలానికి సరిపడా యూరియాను ప్రభుత్వం అంద చేయాలని రైతులు కోరుతున్నారు.

# జీవో నెం.64ను రద్దు చేయాలి

- పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- సిఐటియూ జిల్లా అధ్యక్షులు బందు సాయిలు




**భూపాలపల్లి, సెప్టెంబర్ 14 (జనంసాక్షి)** : గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్స్ డైలీ వేతన కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నెల సెప్టెంబర్ 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. వారి న్యాయమైన డిమాండ్లకు సీఐటీయూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా అధ్యక్షులు బందు సాయిలు మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్లో పనిచేస్తున్న డైలీ వేతన కాంటినెంట్ పార్ట్ టైం వర్కర్లు గత 30 సంవత్సరాలకు పైగా జిల్లా కలెక్టర్ వ్యక్తి ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. 2021 జూన్ 15వ తేదీన టిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 64 ప్రకారం వేతనాలు చెల్లించాలని మౌలిక ఆదేశాలు ఈ ప్రభుత్వం ఇచ్చిందని, దీని ఫలితంగా వేతనాలు బాగా తగ్గుతున్నాయని, కావున జీవో నెంబర్ 64 ను అమలును వెంటనే నిలిపివేయాలని ఇప్పుడు చెల్లిస్తున్న విధంగానే జిల్లా కలెక్టర్ కనీస వేతనాలు సర్కులర్ గెజిట్ ప్రకారంగా యధావిధిగా వేతనాలు చెల్లించాలని కోరారు. జీవో నెంబరు 212ను అనుసరించి 2014 నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు ఉన్న వారందరినీ పర్మినెంట్ చేయాలని, మిగతా వారందరికీ నల్గొండ జిల్లాలో కొంతమందికి ఇస్తున్న విధంగా టైం స్కేల్ ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ విధానం అమలు చేయకూడదని జీవో నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు ఇస్తే గతంలో తీసుకున్న వేతనాలు 26,800 అయితే జీవో నెంబర్ 64 ప్రకారం గా 11700కు తగ్గిపోతుంది. వారిగా కార్మికుల వేతనాలు తగ్గిపోయే అవకాశం ఉందని తెలిపారు. 12 నెలలకు వేతనాలు దసరా సెలవులు సంక్రాంతి సెలవులు వేసవి సెలవులు కూడా ఇవ్వాలని, 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలి వేతనంతో కూడిన వారంతరపు సెలవులు అమలు చేయాలని, వారి న్యాయమైన సమ్మెకు సిఐటియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ మద్ద తెలియజేస్తుందని ప్రభుత్వం వెంటనే ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పాఠశాల వర్కర్లు హాస్టల్లో పనిచేస్తున్న వర్కర్ల యూనియన్ లీడర్లతో చర్చలు జరిపి వెంటనే సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమార్ రాజు, వర్కర్స్ నాయకులు లావుడియా కిషన్, బి రామ్ సింగ్, కంటి భాయ్, సరూప, విజయ, ఎర్రక్క, సరోజన, స్వామి, వెంకట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానానికి ముందుకు రావాలి

- సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 14 (జనంసాక్షి)** : ప్రజలందరూ అపోహలు వీడి అవయవ దానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కోరారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి పట్టణానికి చెందిన నేత్రదాత డోలి కృష్ణమూర్తి సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా డోలి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు భార్య డోలి పుష్ప, కుమారులు నాగేంద్ర ప్రసాద్, సాయికృష్ణ పుట్టెడు దుఃఖంలోను నేత్రదానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపి చూపుని ప్రసాదించి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. వారికి మెమోంటో అందజేసి శాలువాతో సత్కరించారు. డోలి కృష్ణమూర్తి కుటుంబ సభ్యుల స్ఫూర్తితో ప్రజలందరూ మరణించిన తరువాత నేత్ర, అవయవ, శరీరాలు వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కళ్లలోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని, నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవయవాలు అవసరం ఉన్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని, శరీర దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకి అందించి కొన్ని వేల వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి, ప్రజల వైద్య చికిత్సకి ఉపయోగపడే అవకాశం ఉందని అన్నారు. ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్, నేత్రదాత డోలి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, డోలి సుకుమార్, డోలి సుధీర్ పాల్గొన్నారు.

## నట్టల మందు, వ్యాక్సిన్లు అందజేయాలి

- గొర్రెలు మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్




**మహబూబాబాద్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి)** : గొర్రెలు మేకలకు నట్టల మందుతో పాటు అన్ని రకాల వ్యాక్సిన్లు మందులు ప్రభుత్వం పంపిణీ చేయాలని గొర్రెలు మేకల పెంపకం దార్ల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ నగర్ లోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఉడుత రవీందర్ మాట్లాడుతూ గతంలో వెటర్నరీ హాస్పటల్లో అన్ని రకాల మందులు వ్యాక్సిన్లు అందజేసే వారని ప్రస్తుతం గొర్రెలు మేకలకు ఎలాంటి మందులు అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్ల కాపర్లు గొర్రెలు మేకలకు మందులు కొనలేక ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ప్రభుత్వం స్పందించి అన్ని రకాల మందులు అందజేసి గొర్ల కాపరులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, జిల్లా నాయకులు చలగొల్ల మల్లయ్య, ఇమ్మడి గోవిందు, గంద్రకోటి కుమార్, కొమ్మనబోయిన యాకయ్య, వాసం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## కాజ్‌వే మరమ్మతులకు నిధులు కేటాయింపు

- 'గౌరారం వాగు పై వంతెన నిర్మాణం ఎన్నడో' అన్న శీర్షికన వచ్చిన జనంసాక్షి కథనానికి స్పందించిన మంత్రి సీతక్క...
- 5 లక్షలు నిధులు కేటాయించిన మంత్రి సీతక్క
- నూతన వంతెన నిర్మాణానికి కోటీ 50 లక్షల రూపాయల నిధులు కేటాయింపు



**మంగపేట సెప్టెంబర్ 14(జనంసాక్షి)** : మండలంలోని కొత్తూరు మోట్లగూడెం, బొంబాయిగూడెం గ్రామాల మధ్యనున్న గౌరారం వాగుపై ఉన్న కాజ్వే ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద ప్రవాహానికి పూర్తిగా కొట్టకపోయిన కాజ్వే వల్ల రెండు గ్రామాల ప్రజలకు పూర్తిగా వాహనాల రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని శనివారం జనంసాక్షి దినపత్రికలో ' గౌరారం వాగుపై వంతెన నిర్మాణం ఎన్నడో..' అని ప్రచురించగా వెంటనే స్పందించిన మంత్రి సీతక్క స్పెషల్ గ్రాండ్ కింద తక్షణమే కాజ్వే మరమ్మత్తుల నిర్మాణ పనులను చేపట్టాలని 5 లక్షల రూపాయల నిధులను విడుదల చేశారు. ఈ విషయంపై కోమటిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మార్పుల వెంకటరెడ్డి కి ఫోన్ చేసి త్వరగా కాజ్వే మరమ్మత్తులను మొదలుపెట్టే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క తెలిపినట్లు వెంకటరెడ్డి తెలిపారు. అలాగే గౌరారం వాగుపై కొత్తూరు మోట్లగూడెం, బొంబాయిగూడెం గ్రామాలకు ఎటువంటి రవాణా అంతరాయం కలగకుండా నూతన వంతెన నిర్మాణం కొరకు అధికారులు ఎస్టిమేషన్ పంపగా వెంటనే స్పందించిన మంత్రి సీతక్క సుమారు 1 కోటి 50 లక్షల రూపాయల నిధులను కేటాయించడం జరిగిందని త్వరలోనే వంతెన నిర్మాణ పనులు జరగనున్నాయని వారు తెలిపారు. గౌరారం వాగు పై వరద ప్రవాహంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జనంసాక్షి దినపత్రికలో ప్రచురించి అధికారులకు, మంత్రి సీతక్కకు తెలిపినందుకు జనంసాక్షి దినపత్రికకు అలాగే ఈ విషయంపై వెంటనే స్పందించి నిధులను కేటాయించిన మంత్రి సీతక్క కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



### గౌరారంవాగు పై వంతెన నిర్మాణం ఎన్నడో....!

- రెండు గ్రామాల మధ్య పూర్తిగా నిలిచిన వాహనాల రాకపోకలు
- వరద నీటితో రైతన్నలకు తప్పని తిప్పలు

మంగపేట సెప్టెంబర్ 12(జనంసాక్షి): మండలంలోని కొత్తూరు మోట్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల గౌరారంవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ వరద దాటికి కొత్తూరుమోట్లగూడెం, బొంబాయిగూడెం రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శుక్రవారం బొంబాయిగూడెం గ్రామ రైతులు తమ పంటలకు అవసరమయ్యేటువంటి యూరియా, ఇతరత్రా పురుగు మందులను తరలించేందుకు తీవ్ర అవస్థలకు గురయ్యారు. గతంలో గౌరారంవాగు ఉధృతంగా ప్రవహించడంతో వాగుపై నిర్మించినటువంటి కాజ్వే పూర్తిగా కొట్టుకపోగా అధికారులు ప్రమాద స్థలం అని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. కానీ శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంతో అప్పటినుండి రైతన్నలకు, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు వాపోయారు. గత వర్షాకాలంలో అధికారులు వాగు పై వంతెన నిర్మాణం కోసం ఎస్టిమేషన్ వేశారని గ్రామస్తులు తెలిపారు. కానీ నేటి వరకు కూడా ఎటువంటి నిర్మాణ పనులను చేపట్టకపో వడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వాగుపై ఉన్న కాజ్వే పూర్తిగా కొట్టుకపోవడంతో రైతన్నలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు వాపోయారు. పంటకు సంబంధించిన ఎరువులను తరలించాలంటే వాగుకు ఇటువైపున ఒక వాహనం.. వాగుకు అటువైపున ఒక వాహనం (ట్రాక్టర్) పెట్టి వరద నీటిలోనే ఎరువులను మోసుకుంటూ వెళ్ళి వాహనంలో వేసి తరలిస్తున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి గౌరారం వాగు పై వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని వారు కోరారు.

జనంసాక్షి
13 Sep 2025 - Page 7
https://epaper.janamsakshi.org/clip/394613

# ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తాం

- బీటీరోడ్లు, బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**శాయంపేట , సెప్టెంబరు14 (జనం సాక్షి)** : గ్రామీణాభివృద్దే లక్ష్యంగా భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలం లోని కొప్పుల, కాట్రపల్లి గ్రామాలల్లో రూ.1044 లక్షలతో బీటీ రోడ్లు మరియు బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే స్థానిక కాంగ్రెస్ నేతలు, అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. కొప్పుల గ్రామంలో బీటీ రోడ్డు కొప్పుల నుండి పరకాల చలివాగు పై నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు రూ.574 లక్షలు, కొప్పుల నుండి పరకాల పట్టణం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు రూ.213 లక్షలు, అనంతరం కాట్రపల్లి గ్రామంలో కాట్రపల్లి నుండి రాజుపల్లి గ్రామం వరకు నూతన బీటీ రోడ్డు రూ.257 లక్షలతో నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కాట్రపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అందుకోసం ప్రభుత్వ నిధులతో పాటు ఇతర పథకాల ద్వారా కూడా రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం అందే వరకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధి అన్నది పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా, పల్లెల్లో కూడా సమానంగా ఉండాలి అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా 10321 కేసులు పరిష్కారం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 14 (జనం సాక్షి)** : జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని, వీటి ద్వారా 10321 కేసులు పరిష్కారమ య్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 83 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు -1079, ఈ పెట్టి కేసులు -6012, డ్రంకెన్ అండ్ డ్రైవ్ మరియు, మోటార్ వెహికల్ చట్టం కేసులు-3003, సైబర్ కేసులు -227 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 83,48,202 రూపాయలు బాధితులకు అందజేశాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలుబడించిందని తెలిపారు.రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బంది పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం

**• ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి స్పష్టం**

**కల్లూరు, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరోగ్య సంరక్షణ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతనందిస్తూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. కల్లూరు లోని రైతు వేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, పలువురు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు 90 మందికి, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులు 22 మందికి 50,85,052 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే రాగమయి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు తమఆడపిల్లల వివాహాలు చేయాలంటే ఆర్థికంగా వెసులుబాటు




లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా ఆర్థికంగా సహకారం అందిస్తూ పేదలకు అండగా పని చేస్తుందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో వేలాది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిమౌలిక సదుపాయాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగం అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తుందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ పాలన ఎలా ఉంది! ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన ఎలా ఉంది అనేది ప్రజలు బేరిజు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, తాసిల్దార్ పులి సాంబశివుడు, స్థానిక ఎస్సై డి హరిత,కల్లూరు మున్సిపాలిటీ మేనేజర్ నందిసెట్టి నాగేశ్వరరావు,ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ దారా రంగ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆలకుంట నరసింహారావు,మండలకాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు, భాగం ప్రభాకర్, ఏనుగు సత్యం బాబు, బొల్లం రామారావు, కీసర మోహన్ రెడ్డి, దేవరపల్లి వెంకటేశ్వరరావు, పోట్రు అర్జున్ రావు, నల్లగట్ల పుల్లయ్య, మచ్చ వెంకటేశ్వరరావు, కె.వి.ఆర్. మత్స్య సహకార సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మర్సకట్ల బాల శౌరి, మాజీ సర్పంచ్ కొండపల్లి శ్రీమన్నారాయణ, ప్రముఖ కాంట్రాక్టర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లపురెడ్డి అనిమిరెడ్డి, జిల్లెల్ల భాస్కర్ రెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ జిల్లెల్ల కృష్ణారెడ్డి, కళ్యాణపు వెంకటేశ్వరరావు, జోనబోయిన గోపాలరావు, ఉబ్బన రాంబాబు, జంగం నరసింహారావు, బైర్ల కాంతారావు, తక్కెళ్ళపాటి దుర్గాప్రసాద్, కుంచాల వీరయ్య, బొల్లె పోగు రవికుమార్, బీరవెల్లి మాధవ్, భూక్య శివకుమార్ నాయక్ ,సంఘం రామకృష్ణ, మట్టా రామకృష్ణ,ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాజీ బాయ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్ లో బాల, బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

**• హాజరైన జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు శాంతికుమార్**



**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం స్టేడియం మైదానంలోని ఇండోర్ స్టేడియంలో సబ్–జూనియర్ బాలబాలికల జిల్లా జట్లకు ఆదివారం నాడు ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి దాదాపు 200 మంది బాలబాలికలు పాల్గొనగా కబడ్డీ అసోసియేషన్ ప్రబబుల్స్‌గా 18 మంది బాలురు, 18 మంది బాలికలు ఎంపిక అయ్యారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు శాంతికుమార్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. కబడ్డీ వంటి ఆటలు యువతలో నైపుణ్యాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. శ్రమించి, సాధన చేసి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిసే అవకాశాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కురుమూర్తి గౌడ్, దామోదర్ రెడ్డి, రాములన్న, రామచంద్రయ్య, తదితరులు పాల్గొనారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా



**భువనగిరి, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ పట్టణ మరియు మండల శాఖ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని జగదేవపూర్ రోడ్డు గుంతల మయమై మరియు జగదేపూర్ రైల్వే బ్రిడ్జి పై గుంతలు పడి రోజు వాహనదారులు పడి గాయాల పాలవుతున్నారు మరియు గత నెల రోజుల నుండి ప్రమాదాలు జరిగి ముగ్గురు చనిపోవడం జరిగింది. అయినప్పటికీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడి రోడ్డుని బాగు చేపిద్దాం అనే ఆలోచన లేకపోవడంతో ఈరోజు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది ఈ రోడ్డును పట్టించుకోని ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ అధికారులు మేలుకొని వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తూ ఉంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో నాయకులను అరెస్టు చేయించి పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది ఇలాంటి అక్రమ అరెస్టులతో భయపడేది లేదని 4 రోజుల్లోపు పనులు మొదలు పెట్టాలని లేనియెడల భువనగిరి మాజీ శాసనసభ్యులు శ్రీ పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు , బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ , మండల అధ్యక్షులు జనగాం పాండు , బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి , మాజీ కౌన్సిలర్లు కాజా అజీముద్దీన్ , నాయకులు ఇట్టబోయిన గోపాల్ , కుశంగల రాజు , తాదూరు బిక్షపతి , తాడేం రాజశేఖర్ , వెల్దుర్తి రఘునందన్ , బర్రె రమేష్ , ఇక్బాల్ చౌదరి , కాజం, ఇస్మాయిల్, ముజీబ్, కంచి మల్లయ్య, అతికం లక్ష్మీనారాయణ గౌడ్, ర్యాకల శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, కృష్ణ, సుబ్బూరు రమేష్, కంకల కిష్టయ్య, రత్నం పురం పద్మ, సిరిపంగ సుభాష్, నాయిని శ్రీనివాస్, చాగంటి నరసింహ, కంచనపల్లి నర్సింగరావు, గుండబోయిన నరసింహ, గుర్రాల శ్రీశైలం, ముదిగొండ మహేష్, చెన్న గౌరీ శంకర్, పెంట నితీష్, సిల్వేరు మధు, పోల ప్రవీణ్, కుమార్, సందీప్, తోటకూరి సురేష్, చందు, సైదులు, మనీష్, శ్రీశైలం, ఆమీర్ పాల్గొనడం జరిగింది.

# రైతులకు యూరియా అగచాట్లు ఇంకెన్నాళ్లు..?

**• మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి**

**హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** నియోజకవర్గ వ్యాప్తంగా పంటల సాగు పనులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందు చూపులేనితనం కారణంగా రైతులకు యూరియా కొరతతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎరువుల కేంద్రాల చుట్టూ తిరిగే అగచాట్లు తప్పడం లేదని మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేతగానితనం వల్ల రాష్ట్రంలో రైతులకు యూరియా సమస్య ఉత్పన్నమైందని ఆరోపించారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో హుజూర్ నగర్ నియోజకవర్గానికి సంబంధించి వివిధ ఫర్టిలైజర్ కంపెనీల నుండి రైల్వే వ్యాగన్ల ద్వారా సరఫరా చేయబడిన అధిక భాగం సుమారు 70 శాతం యూరియా మార్క్ పెయిడ్ ద్వారా వ్యవసాయ సహకార సంఘాలకు, మన గ్రోమోర్, ఆగ్రోస్ కేంద్రాలకు సరఫరా చేయుచుండగా మిగిలిన సుమారు 30 శాతం యూరియాను 50 మందికి పైగా డీలర్స్ 200 పైగా షాపులు ఉన్నప్పటికీ వారందరికీ యూరియా అమ్మే అవకాశం ఇవ్వకుండా మిర్యాలగూడ, హుజూర్ నగర్ పరిధిలో ఉన్న ఐదుగురు డీలర్స్‌కు మాత్రమే యూరియా అందిస్తూ పరోక్షంగా అధికార యంత్రాంగమే యూరియా బ్లాక్



మార్కెట్‌కి తరలిపోయే అవకాశం కల్పిస్తున్నారని దుయ్యబట్టారు. బ్లాక్ మార్కెట్ ద్వారా పక్క దారి పడుతున్న యూరియాను అరికట్టి రాష్ట్ర రైతాంగానికి అందించవలసిన బాధ్యత కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు అచేతనంగా ఉండి చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కొందరు ప్రైవేట్ డీలర్స్ యూరియాను బ్లాక్ చేసి తమ ఏజెంట్ల ద్వారా గ్రామాలకు తరలించి అక్కడ రైతాంగానికి అధిక రేట్లకు 500 నుండి 650 రూపాయల వరకు అమ్ముకుంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని వాపోయారు. ముందు చూపులేని ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తమ పొలం పనులు వదులుకొని ఎరువుల కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందన్నారు. నియోజకవర్గంలో 40 రోజుల క్రితం నాటుపెట్టిన పొలాలకు సైతం మొదటి దఫా చల్లుకోవడానికి యూరియా దొరకక రైతులు అనేక అగచాట్లు పడుతున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తొమ్మిదిన్నర సంవత్సరాలు రాష్ట్రంలో ఎటువంటి ఎరువులు, విత్తనాలు, కరెంటు, నీళ్ల కొరత లేకుండా బిఆర్ఎస్ పాలన రైతులకు స్వర్ణ యుగంగా ఉండేదని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మాజీ మంత్రి నాయకత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తెలంగాణలోనే అధిక వరి పండించిన జిల్లాగా కీర్తికెక్కిందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం మేలైన విత్తనాలు, సరైన కరెంటు సమయానికి ఎరువులు దొరకక వ్యవసాయం రంగం సంక్షోభంలోకి నెట్టి వేయబడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవ తీసుకొని నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ నబీ, మాజీ సర్పంచులు అద్దంకి సైదేశ్వర రావు, గల్లా సైదులు, షేక్ అలీ, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, మండల పార్టీ ఉపాధ్యక్షులు కట్టా సతీష్ కుమార్, మల్లెపల్లి నరసింహారావు, మండల నాయకులు ఎండి ముజీబ్, తోట బిక్షం, గండు సైదులు, కడియాల రమేష్, తోట నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు టీజీఈ హైట్స్ ప్రాజెక్టును విజయవంతం చేయండి

**• టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు**

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు టీజీఈ హైట్స్ ప్రాజెక్టును విజయవంతం చేయాలని టిజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం మండలం లోని పోలేపల్లి లోని రాజీవ్ స్వగృహ సముదాయం నందు ప్రభుత్వ ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీకి టెండర్ దక్కినందుకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు సహకారంతో ప్రభుత్వ ఉద్యోగులకు అతి తక్కువ ధరలో గృహ సదుపాయం కల్పించాలని సదుద్దేశంతో ఈ ప్రాజెక్టును సాధించుకున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, పోలీస్ డిపార్ట్మెంట్ వారు హోంగార్డులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. హైదరాబాదులో ఉన్న ఐ రైజ్డ్ బిల్డింగ్స్ కు సరి సమానంగా ఈ ప్రాజెక్టును ఒక



మోడల్ ప్రాజెక్టుగా రూపొందించి సంవత్సరంలోపే పూర్తి చేసి ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ రాజీవ్ స్వగృహ సముదాయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులైన ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ,గెజిటెడ్, నాన్ గెజిటెడ్, పంచాయతీరాజ్, రెవిన్యూ, శాఖలతో పాటు పోలీస్ శాఖ వారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, దానితోపాటు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగులైన ఎల్ఐసి, బ్యాంకింగ్, సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, కె.టి.పి.ఎస్, జెన్కో, ఎఫ్.సి.ఐ కి చెందిన అన్ని రంగాల ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక ఒరవడి కలిగిన ఖమ్మం జిల్లాలో ఉద్యోగ కమ్యూనిటీ అంతా ఒకే ప్రాంతంలో ఉండే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించి ఆదర్శవంతంగా ఉండేలా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్బీఐ రిలేషన్ షిప్ మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ ఎస్బీఐ బ్యాంకు లోన్ ఎలిజిబిలిటీ ఉన్నా వారందరికీ లోన్ ఇస్తామని,హౌసింగ్ లోన్ కు సంబంధించి సందేహాలు కి వివరణా ఇచ్చారు .ఈ రోజు 26 మంది ఎన్రోల్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదేన శ్రీనివాస్ , టీజీ ఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ సెక్రటరీ విజయ్ కుమార్, శేష్ ప్రసాద్, రాంబాబు, పుష్ప రాజ్, మాధవరావు,వేల్పుల శ్రీను,వెంకటేశ్వర్లు, టిఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జెడ్, ఎస్ .జైపాల్ విజయకుమార్,ఎర్ర రమేష్, తాళ్లూరి శ్రీకాంత్,పెద్దినేని రాధాకృష్ణ, యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ ఎంప్లాయిస్ అధ్యక్షుడిగా రమణారెడ్డి ఎన్నిక

**బోనకల్, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** ఇరిగేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బజ్జూరి రమణారెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి తరలివచ్చిన ఇరిగేషన్ శాఖ ఉద్యోగస్తులు అందరూ కలిసి జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రమణారెడ్డి బోనకల్లు మండల కేంద్రంలో ఉన్నటువంటి ఇరిగేషన్ సబ్ డివిజన్ లో గత 15 సంవత్సరాలుగా తన యొక్క విధులు నిర్వహిస్తూ ప్రతి కాలవపై ప్రతి ఆయకట్టు వివరాలు క్షుణ్ణంగా తెలిసినటువంటి రెడ్డి రైతుతో మంచి సంబంధాలు కలిగి ఉండి తలలో నాలుకలా ఉంటూ ఒక్క ఎకరా కూడా ఎండకుండా ఎవరు పొలం ఎక్కడ ఉంది ఆ పొలం ఎవరిది అని తెలిసినటువంటి నైపుణ్యం గలవాడు అని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఎలాంటి సమస్యలు వచ్చిన స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరింపచేయడం అతని ప్రత్యేకత. అటు రైతులతోనే కాకుండా ఇటు రాజకీయ నాయకులతో పాత తరం , కొత్త తరం అన్ని రాజకీయ పార్టీల మండల పెద్ద నాయకుల నుండి చిన్న నాయకుల వరకు వారితో మంచి సంబంధం బాంధవ్యాలు కలిగి రబి సీజన్లో రైతులు నీటి కొరత సమయాల్లో వారు ధర్నాలకు



పూనుకునే సమయంలో కూడా తన చాకచక్యంతో వారితో మాట్లాడి పెద్ద పెద్ద ధర్నాలు సైతం నిలువరింప జేసి వారి ఆయకట్టుకి తన అనుభవంతో నీటిని వెంటనే పంపించి పరిష్కరిస్తూ ఆయకట్టు ని తడిపి ధర్నాలు లేకుండా చేయడంలో అతను దిట్ట. బోనకల్ మండలానికి ఉద్యోగస్తుల సమస్యల పట్ల తనదైన పాత్రలో చురుకుగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నందున వారిని రెండవ సారి జిల్లా ఇరిగేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు మండల అన్ని పార్టీల రాజకీయ నాయకులు మరియు వారి ఇరిగేషన్ సబ్ డివిజన్లో పనిచేస్తున్న డి ఈఈ తమ్మవరపు వెంకటేశ్వర్లు ఏ ఈఈ లు సామ్రాజ్, ఏడుకొండలు , వారి ఆఫీస్ సిబ్బంది ,లస్కర్లు అభినంద నలు తెలియజేశారు.

## సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**కోదాడ, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) :** సహకార సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనంతగిరి మండలం గొండ్రియాల సొసైటీ చైర్మన్ గా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన బుర్ర నరసింహారెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. రైతులకు సహకార సంఘాల ద్వారా రుణాలను అందజేస్తూ ఆర్థిక చేయూతను అందించాలని కోరారు. గత ప్రభుత్వాల హయాంలో సహకార సంఘాలు నిర్వీర్యమై ఉన్నాయన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఎరువులు ,పురుగుమందులు అందజేయడమే కాకుండా రైతులు తమ పంటను నిల్వ చేసుకునేందుకు సహకార సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి,మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు,బాబు నాయక్,మాగి యాకోబు,షేక్ నాగుల్ మీరా,సీఈఓ మట్టపల్లి రమేష్,పర్సనల్ ఇంచార్జ్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గీత కార్మిక కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

**• తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు**

**రామన్నపేట, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతి కల్లుగీత కుటుంబానికి గీత బంధు' పేరుతో రూ. 10 లక్షలు ఇవ్వాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండలంలోని బోగారం వికాస్ ఫంక్షన్ హాల్లో కల్లుగీత కార్మిక సంఘం మండల 3 వ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధి గా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న 5 లక్షల కుటుంబాల ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు 5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తరతరాల నుండి కల్లుగీత వృత్తి చేస్తూ ప్రభుత్వానికి వేలాది కోట్ల పన్నులు చెల్లించారు కానీ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గీత కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. అతి ప్రమాదకరమైన కల్లుగీత వృత్తి చేస్తున్న గీత కార్మికులందరికీ ఎలాంటి రాజకీయ ఒత్తిడిలేకుండా ప్రమాదాలు నివారించుటకై సేఫ్టీ కిట్లు అందించాలని, స్వయం ఉపాధి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. ప్రభుత్వ లిక్కర్ పాలసీ వలన రోజు రోజుకి వృత్తి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం లిక్కర్, బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారిస్తూ గీత కార్మికుల వృత్తిని, ఉపాధిని దెబ్బతీస్తుందని అన్నారు. ప్రతీ సొసైటీకి 5 ఎకరాల భూమి, కల్లుకు మార్కెట్ సౌకర్యం యాదాద్రి భువనగిరి జిల్లా నందనం నీరా తాటి,ఈత ఉత్పత్తుల పరిశ్రమను త్వరగా ప్రారంభించి యువతి, యువకులకు, కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కల్లుగీత వృత్తి చేస్తున్న ప్రతి ఒక్కరికి మోటార్ బైక్ లు ఇవ్వాలని, పెన్షన్ ఐదు వేలకు పెంచాలని, మెడికల్ బోర్డు నిబంధన తొలగించాలని, అర్హులైన వారందరికీ సభ్యత్వం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోలగోని జయరాములు మాట్లాడుతూ.. సొసైటీ కి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని ,బెల్టు షాపులను నిరోధించాలని, సొసైటీలో కమిటీ భవనాలు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న ఎక్స్గ్రేషియోను తక్షణమే విడుదల చేయాలని , కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలని, కుటీర పరిశ్రమకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో రాష్ట్ర నాయకులు రాగిరి కృష్ణయ్య, గాజుల ఆంజనేయులు జిల్లా ఉపాధ్యక్షులు బావండ్లపల్లి బాలరాజు జిల్లా నాయకులు ఎర్ర రవీందర్, కూనూరు మల్లేశం, ప్రముఖ పారిశ్రామికవేత్త కూనూరు సాయి కుమార్ గౌడ్ మండల నాయకులు మునుకుంట్ల లెనిన్, తాళ్లపల్లి జితేందర్,




తూర్పునూరు శ్రీనివాస్, బైరు రామకృష్ణ, ఆకిటి శ్రీను, పబ్బతి జాంగిర్, గంగదేవి అంజయ్య, పబ్బతి అంజనేయులు, కొమ్మగోని అశోక్ గౌడ్, పల్సం కనకయ్య, ఎర్ర కాటమయ్య, తాటిపాముల నవీన్, అంతటి దశరథ, లగ్గొని యాదయ్య, ఎర్ర వెంకటేశం, బైరు శంకరయ్య, పందుల శ్రీను, తాటిపాముల లింగయ్య, గంగాదేవి జమ్మయ్య, గంగాదేవి అంజయ్య, గంగాపురం కాటమయ్య బొడిగె ఆంజనేయులు, గుండాల యాదయ్య, తాళ్లపల్లి దుర్గయ్య, కంభంపాటి శ్రీకాంత్, కప్పల రాజయ్య, కొన్నె అశోక్, పల్సం కిష్టయ్య, కొన్నె అంజయ్య, గడ్డమీది సత్తయ్య, నాతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# కొత్త ఉద్యోగాలకు ఓకే కానీ..

## టెకీల ఆలోచనలు



**జనంసాక్షి:**చాలా మటుకు టెక్నాలజీ నిపుణులు కొత్త అవకాశాలపై ఆసక్తిగా ఉన్నప్పటికీ .. ఉద్యోగాల ఎంపిక విషయంలో మాత్రం ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. తమ లక్ష్యాలు, కెరియర్ పురోగతి, శారీరక ..మానసిక ఆరోగ్ లాంటి అంశాలకు సదరు ఉద్యోగం ఎంత వరకు దోహదపడుతుందనేది బేరీజు వేసుకుంటున్నారు. దేశీ టెకీలపై గ్లోబల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ మైఖేల్ పేజ్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.దీని ప్రకారం అంతర్జాతీయంగా అత్యంత ఆత్మవిశ్వాసంతో, ఉద్యోగాల ఎంపికలో లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్న టెక్ నిపుణుల్లో భారతీయ ప్రొఫెషనల్స్ కూడా ఉన్నారు. దీనికి సంబంధించిన సర్వేలో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా సుమారు 5,000 మంది ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు. భారతీయ ప్రొఫెషనల్స్‌లో 94 శాతం మంది కొత్త అవకాశాలపై ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అవకాశాలను పరిశీలించాలనే ఆలోచనే తాము ఉద్యోగాలు మారడానికి ప్రేరణగా ఉంటుందని 39 శాతం మంది టెకీలు తెలిపారు. మెరుగైన జీతం, వృద్ధి అవకాశాలు కారణమని 31 శాతం మంది చెప్పారు.వెసులుబాటు విషయంలో టెక్ నిపుణులు ఏమాత్రం రాజీపడటం లేదు. 26 శాతం మంది సరళతరమైన పని విధానాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఒకవేళ మాటిమాటికీ ఆఫీసుకు రమ్మంటే ఉద్యోగాన్ని కూడా విడిచిపెట్టేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని 45 శాతం మంది తెలిపారు. 23 శాతం మంది తమ ప్రస్తుత వేతనాలపై అసంతృప్తిగా ఉన్నారు. 20 శాతం మంది చురుగ్గా శిక్షణ పొందుతున్నారు. అర్థవంతమైన పని, కెరియర్లో వృద్ధి అవకాశాలకు ప్రాధాన్యతనివ్వడానికి మొగ్గు చూపుతున్నారు.టెక్ నిపుణులు, ఉద్యోగాలను ఎంచుకోవడంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్న నేపథ్యంలో కంపెనీలు కూడా కేవలం మెరుగైన వేతనాన్ని ఇవ్వజూపడానికే పరిమితం కాకుండా వెసులుబాటు, వృద్ధి అవకాశా ల్లాంటివి కూడా ఆఫర్ చేయాల్సి వస్తోంది.హైబ్రిడ్ పని, ఏఐ సన్నద్ధతపై పెట్టుబడులు, నమ్మకం..పారదర్శకతకు పెద్దపీట వేసే సంస్కృతిని పెంపొందించే కంపెనీలు టాప్ ప్రతిభావంతులను ఆకర్షించడంతో పాటు పోటీ మార్కెట్లోను గట్టిగా నిలబడటానికి వీలుంటుంది.

# నిర్మాణానికి ముందు మట్టి పరిశీలన తప్పనిసరి

## సాంప్రదాయ ఫౌండేషన్ పద్ధతులు పాటించాల్సిందే..

**ఇంటి నిర్మాణం అనేది కేవలం ఒక ఆస్తి నిర్మాణం మాత్రమే కాదు.. ఇది తరాల వారసత్వానికి బలమైన ఆధారం. ఈ నిర్మాణంలో అత్యంత కీలకమైన దశ ఫౌండేషన్. పునాది బలంగా లేకపోతే, ఎంత అందమైన నిర్మాణమైనా కాలక్రమంలో బీటలు పడే ప్రమాదం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో భౌగోళిక పరిస్థితులు, మట్టి స్వభావం, నీటి మట్టం వంటి అంశాలు ఫౌం డేషన్ ఎంపికపై ప్రభావం చూపుతాయి. అం దుకే, ప్రతి ఇంటి నిర్మాణానికి ముందు మట్టి పరీక్ష చేయడం తప్పనిసరి. ఇది భవనం బరువును మట్టి తట్టుకోగలదా అనే విషయాన్ని నిర్ధారిస్తుంది.**



**హైదరాబాద్,జనంసాక్షి:**ఇప్పటికీ చాలా మంది ఇండివిడ్యువల్ ఫుటింగ్ లేదా స్ట్రిప్ ఫౌండేషన్ వంటి సాంప్రదాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. ఇవి చిన్న స్థాయి గృహాలకు అనువైనవి. ఇండివిడ్యువల్ ఫుటింగ్ పద్ధతిలో ప్రతి పిల్లర్ కింద ప్రత్యేకంగా ఫుటింగ్ వేసి, భవన బరువును సమంగా పంపిణీ చేస్తారు. స్ట్రిప్ ఫౌండేషన్ పద్ధతిలో గోడల వెంట కాంక్రీట్ స్ట్రిప్ వేసి, గోడల బరువును మట్టిలోకి పంపిస్తారు.అయితే, మట్టి బలహీనంగా ఉన్న చోట రాఫ్ట్ ఫౌండేషన్ లేదా పైల్ ఫౌండేషన్ అవసరం అవుతుంది. రాఫ్ట్ ఫౌండేషన్‌లో మొత్తం భవనానికి ఒకే పెద్ద ఆర్‌సీసీ స్లాబ్ వేసి, బరువును సమంగా పంపిస్తారు. పైల్ ఫౌండేషన్‌లో లోతైన కాంక్రీట్ పైల్స్ వేసి, భారం లోతుగా ఉన్న బలమైన మట్టికి చేరేలా చేస్తారు. ఇవి ఖర్చుతో కూడుకున్నవే అయినా, భద్రతకు మిన్న.ఇటీవల కాలంలో ప్రీకాస్ట్ ఫౌండేషన్ బ్లాక్స్ అనే పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఫ్యాక్టరీలో తయారైన ఫౌండేషన్ బ్లాక్స్‌ను నిర్మాణ స్థలానికి తీసుకెళ్లి అమర్చడం వల్ల నిర్మాణ వేగం పెరుగుతుంది. కార్మిక వ్యయం తగ్గుతుంది. మెటీరియల్స్ వేస్టేజ్ తగ్గుతుంది. మరో కొత్త పరిష్కారం జియోపాలిమర్ కాంక్రీట్ ఫౌండేషన్. ఇది సాంప్రదాయ సిమెంట్‌కు ప్రత్యామ్నాయంగా ఫ్లై యాష్, స్లగ్ వంటి పారిశ్రామిక వ్యర్థాల ఆధారంగా తయారవుతుంది. ఇది తక్కువ కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తుంది. పర్యావరణానికి మేలు చేస్తుంది. పట్టణ ప్రాంతల్లో రెట్రోఫిట్ అవసరమైన చోట మైక్రోపైల్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు. ఇది చిన్న వ్యాసం గల పైల్స్ ద్వారా భవనాన్ని రీఇన్‌ఫోర్స్ చేయడం ద్వారా భద్రతను పెంచుతుంది. ఒక సాధారణ 1000 చ.అ.ఇంటి నిర్మాణానికి ఫౌండేషన్ ఖర్చు రూ.3.7 లక్షల నుండి రూ.5.9 లక్షల వరకు ఉండొచ్చు. ఇందులో మెటీరియల్స్, కార్మికుల వ్యయం, సాయిల్ టెస్టింగ్, నిర్మాణ డిజైన్ ఖర్చులు ఉంటాయి. ప్రస్తుత మార్కెట్‌లో బ్యాగు సిమెంట్ ధరలు రూ.350-రూ.400, స్టీల్ కేజీ రూ.60-రూ.70, ఇసుక ఇక క్యూబిక్ అడుగుకు రూ.40-రూ.60 మధ్య ఉన్నాయి.అందుకే, నిర్మాణానికి ముందు స్థానిక కనస్ట్రక్టర్ లేదా స్ట్రక్చరల్ ఇంజినీర్ సలహా తీసుకోవడం మంచిది.ఇంటిని నిర్మించడం అంటే భద్రత, మన్నిక, అందం అన్నీ మిళితమైన ప్రక్రియ. పునాది పద్ధ తులు కూడా ఈ మారుతున్న అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్నాయి. పర్యావరణ అనుకూలత, నిర్మాణ వేగం, ఖర్చు తగ్గింపు వంటి అంశాలు కొత్త పద్ధతుల అభివృద్ధికి దోహదపడుతున్నాయి. భవిష్యత్తులో త్రీడీ ప్రింటెడ్ ఫౌండేషన్లు, స్మార్ట్ సెన్సర్లతో సాయిల్ మానిటరింగ్ వంటి సాంకేతికతలు కూడా అందుబాటులోకి రావొచ్చు.

## గుడ్ల ధరలు



హైదరాబాద్ ₹ 5.37

వరంగల్ ₹ 5.39

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్



₹ 1,01,900 (22 క్యారెట్లు)

₹ 1,11,170 (24 క్యారెట్లు)

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్



₹ 1,43,000




# అందమైన దేశంలో శాశ్వత నివాసం

## భారతీయులకు అవకాశం

**జనంసాక్షి:**ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా పేరుగాంచిన 'ఫిన్లాండ్'.. భారతీయులకు శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది.వర్క్, ఎడ్యుకేషన్ ప్రయోజనాల నుంచి ఫ్యామిలీ స్పాన్సర్‌షిప్ వరకు అన్ని సదుపాయాలను అందించడానికి దేశం సిద్ధంగా ఉంది.అందమైన దేశమే కాకుండా.. జీవించడానికి కూడా ప్రసిద్ధి చెందిన ఫిన్లాండ్, వరుసగా ఎనిమిది సంవత్సరాలు ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా ర్యాంక్ సాధించింది. ఈ దేశంలో భారతీయులు శాశ్వతంగా నివాసం ఉండటానికి.. అక్కడి ప్రభుత్వం అర్హతగల అభ్యర్థులకు శాశ్వత నివాస అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ఫిన్లాండ్‌లో శాశ్వత నివాసం ఉండటం వల్ల.. సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, విద్య, పెన్షన్ పథకాల వంటి ప్రయోజనాలు పొందవచ్చు.మీ కుటుంబ సభ్యులను మీతో చేర్చుకోవడానికి మీరే స్పాన్సర్ చేయవచ్చు. కంటిన్యూస్ రెసిడెంట్ పర్మిట్ కోసం ఫిన్లాండ్‌లో కనీసం నాలుగు సంవత్సరాలు నివసించి ఉండాలి. ఈ వ్యవధి 2026 జనవరి నుంచి ఆరు సంవత్సరాలకు పెరుగుతుంది.

# మరింత నష్టాల్లోకి ఫ్లిప్‌కార్ట్

## మింత్రా లాభం జూమ్..



**జనంసాక్షి:**గత ఆర్థిక సంవత్సరంలో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇండియా నష్టం మరింత పెరిగి రూ. 5,189 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నష్టాలు రూ.4,248 కోట్లుగా నమోదయ్యాయి. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాం టోఫ్లర్ ప్రకారం.. తాజాగా ఆదాయం రూ. 70,542 కోట్ల నుంచి 17 శాతం పెరిగి రూ. 82,787 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 17 శాతం పెరిగి రూ. 88,121 కోట్లకు చేరాయి. ఫ్యాషన్, లైఫ్‌స్టయిల్ ఈ-కామర్స్ సంస్థ మింత్రా డిజైన్స్ గత ఆర్థిక సంవత్సరంలో రూ. 548 కోట్ల లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 31 కోట్లతో పోలిస్తే ఇది అనేక రెట్లు అధికం కావడం గమనార్హం. మరోవైపు, సమీక్షాకాలంలో సంస్థ ఆదాయం రూ. 5,122 కోట్ల నుంచి 18 శాతం వృద్ధి చెంది రూ. 6,043 కోట్లకు చేరింది.

# జాబ్ హగ్గింగ్

## ప్రమాదంలో ఉద్యోగుల భవిష్యత్!

**జనంసాక్షి:**సాధారణంగా ఉద్యోగం నచ్చకపోతే.. మరో ఉద్యోగంలో చేరుతారు. కానీ పరిస్థితులు మారిపోయాయి. కొంతమంది ఉద్యోగులకు తాము చేస్తున్న జాబ్ నచ్చకపోయినా.. కొత్త ఉద్యోగంలో చేరడానికి భయపడుతున్నారు. దీనిని 'జాబ్ హగ్గింగ్' అని నిపుణులు చెబుతున్నారు.ఆర్థిక అనిశ్చితి, ఉద్యోగ భద్రత లేకుండా పోవడం వంటి కారణాల వల్ల ఉద్యోగుల్లో ఒకింత భయం మొదలైంది. ఇటీవల కాలంలో అమెరికాలో ఉద్యోగావకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఉన్న ఉద్యోగంలోనే సురక్షితంగా ఉంటే చాలనుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. అయితే కొత్త ఉద్యోగాల కోసం వెతికే సమయం కూడా పెరిగిపోయింది.కోవిడ్ తరువాత ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్స్ ఎక్కువయ్యాయి. లక్షల మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. దీంతో జాబ్ హగ్గింగ్ మొదలైంది. జాబ్ హగ్గింగ్ అంటే.. ఉద్యోగులు కంపెనీ పట్ల విధేయతతో ఉన్నట్లు కాదు. అది వాళ్ల భయానికి సూచన అని నిపుణులు చెబుతున్నారు.



## లండన్‌లో ఉద్రిక్తతలపై ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు

# వలసలతో బ్రిటన్ నాశనమవుతోంది

లండన్,**జనంసాక్షి:**బ్రిటన్‌లో భారీ స్థాయిలో యాంటీ ఇమిగ్రేషన్ ర్యాలీ జరిగింది. లక్షల మంది పైగా ప్రజలు రోడ్లపైకి వచ్చి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో టెస్లా సీఈవో, ప్రపంచ బిలియనీర్ ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వలసలతో బ్రిటన్ నాశనం అవుతోంది అంటూ కామెంట్స్ చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై చర్చ మొదలైంది.బ్రిటన్‌లో యాంటీ ఇమిగ్రేషన్ ర్యాలీ ఎలాన్ మస్క్ స్పందించారు. ఈ సందర్భంగా వీడియోలో మాట్లాడుతూ.. 'భారీగా, అనియంత్రితంగా వస్తున్న వలసలతో బ్రిటన్ నాశనమవుతోంది. వలసల కారణంగా హింస పెరిగిపోతోంది. ఇది ఇలాగే కొనసాగితే హింస ప్రజలందరి వద్దకు వస్తుంది. ఇ?ప్పటికైనా ప్రతిఘటించాల్సిందే.. పోరాడాల్సిందే. మన హక్కులు కాపాడుకోవాల్సిందే. పోరాడండి.. లేదంటే చనిపోతారు.. అని వారికి మద్దతు ఇచ్చారు. చివరగా.. బ్రిటన్‌లో ప్రభుత్వ మార్పు జరగాలని నేను అనుకుంటున్నాను' అని కామెంట్స్ చేశారు. ఇదిలా ఉండగా.. శనివారం సెంట్రల్ లండన్‌లో జరిగిన ఈ ర్యాలీ యూకే చరిత్రలోనే అతి పెద్దది. ఈ సందర్భంగా ప్రజలందరూ..'మా దేశాన్ని మాకు తిరిగి ఇవ్వండి, పడవలను ఆపండి వంటి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఇక, ఈ ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫార్-రైట్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ నిర్వహించిన 'యునైట్ ది కింగ్‌డమ్' ర్యాలీ హింసాత్మకంగా మారింది. వలస విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ ప్రదర్శనలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ ఘటనల్లో 26 మంది పోలీసు అధికారులు గాయపడగా, 25 మందిని అరెస్ట్ చేశారు.మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ర్యాలీకి ఊహించిన దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో, సుమారు 1,10,000 నుంచి 1,50,000 మంది ప్రజలు హాజరయ్యారు. ప్రదర్శన చివరి దశలో కొంతమంది నిరసనకారులు అదుపుతప్పి పోలీసులపై బాటిళ్లు విసిరి దాడులకు పాల్పడ్డారు. ప్రత్యర్థి వర్గాల నిరసనకారులను వేరుచేయడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించారు. ఈ దాడుల్లో నలుగురు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో వారిని అడ్డుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఇదే సమయంలో 'స్టాండ్ అప్ టు రేసిజం' సంస్థ ఆధ్వర్యంలో సుమారు 5,000 మందితో వలసదారులకు మద్దతుగా మరో ప్రదర్శన కూడా జరిగింది.

# లాడెన్‌ను మట్టుబెట్టాక. పాక్ పరిస్థితి దయనీయం

## రహస్యాలు వెల్లడించిన పాక్ మాజీ అధికారి



న్యూఢిల్లీ,**జనంసాక్షి:** 2011, మే 2.. తెల్లవారుజామున యునైటెడ్ స్టేట్స్ అత్యంత సాహసోపేతమైన సైనిక కార్యకలాపాలను అమలు చేసింది. పాకిస్తాన్‌లోని అబోటాబాద్‌లో 40 నిమిషాల పాటు జరిపిన దాడిలో యూఎస్ నేవీ సీల్స్(%ఖూ చీఖజఎ ాజూూాం%) 9/11 దాడుల సూత్రధారి, అల్-ఖైదా అధిపతి ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టాయి.ఈ ఆపరేషన్ ప్రపంచాన్ని షాక్‌నకు గురిచేయడమే కాకుండా, పాకిస్తాన్ విశ్వసనీయత అంతర్జాతీయ స్థాయిలో దెబ్బతింది. అయితే ఈ సమయంలో చోటుచేసుకున్న పలు పరిణామాలను పాక్ దాస్తూ వచ్చింది. లాడెన్ భార్యలను అమెరికా విచారించిన సంగతిని కూడా ఏనాడూ బహిర్గతం చేయలేదు.తాజాగా పాక్ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మాజీ ప్రతినిధి ఫర్హతుల్లా బాబర్ రచించిన 'ది జర్దారీ ప్రెసిడెన్సీ: నౌ ఇట్ మస్ట్ బీ టోల్డ్' అనే పుస్తకం.. పాక్ ఇంతకాలం దాచుతూ వచ్చిన రహస్యాలను బహిరంగపరచింది. బిన్ లాడెన్ హత్య తర్వాత అతని భార్యలను పాకిస్తాన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తరువాత సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఏజన్సీ (సీఐఎ) బృందం అబోటాబాద్ కంటోన్మెంట్‌లో ప్రత్యక్షమై లాడెన్ భార్యలను విచారించింది. అయితే ఇది పాకిస్తాన్ సార్వభౌమాధికారంపై తీవ్రమైన ఆందోళనలను రేకెత్తించింది. ఈ ఎపిసోడ్ దేశానికి జాతీయ అవమానంగా బాబర్ పేర్కొన్నారు. పాకిస్తాన్ గడ్డపై అమెరికన్ ఏజెంట్లు స్వేచ్ఛగా తిరుగుతుండటంతో పాక్ ప్రభుత్వం, సైన్యం ఒత్తిడికి లోనవుతున్నట్లు కనిపించిందని ఆయన రాశారు. ఈ సంఘటన పాకిస్తాన్‌కు తీవ్ర ఇబ్బందిని కలిగించిందని బాబర్ ఆ పుస్తకంలో పేర్కొన్నారు.నాటి అమెరికా విదేశాంగ కార్యదర్శి హిల్లరీ క్లింటన్, సెనేటర్ జాన్ కెర్రీతో సహా సీనియర్ అమెరికన్ అధికారులు పాకిస్తాన్‌కు ఎలా వచ్చారో ఈ పుస్తకంలో వివరించారు. ఆ సమయంలో ఇస్లామాబాద్.. భవిష్యత్తులో అమెరికా ఏకపక్ష దాడులకు దూరంగా ఉంటుందని హామీ పొందేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. అయినప్పటికీ, యునైటెడ్ స్టేట్స్ ఎటువంటి హామీలు ఇవ్వలేదని బాబర్ వివరించారు. ఈ దాడికి చాలా కాలం ముందు నుంచే బిన్ లాడెన్.. అబోటాబాద్ రహస్య స్థావరంపై సీఐఎ నిఘాను సారించడం పాకిస్తాన్‌కు అత్యంత బాధాకరమైన విషయగా మారిందని బాబార్ పేర్కొన్నారు.

# పాక్ సైన్యం, టీటీపీ మధ్య భీకరపోరు..

## 19 మంది జవాన్లు మృతి

పెషావర్,**జనంసాక్షి:**

పాకిస్తాన్‌లో ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో సైన్యానికి, నిషేధిత తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) ఉగ్రవాదులకు మధ్య భీకరపోరు కొనసాగుతోంది.నాలుగు రోజులుగా జరుగుతున్న పోరాటంలో కనీసం 19 మంది సైనికులు, 45 మంది ఉగ్రవాదులు చనిపోయారని ఆర్మీ తెలిపింది. బజౌర్ జిల్లాలో ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో 22 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.దక్షిణ వజీరిస్తాన్‌లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో 13 మంది టెర్రరిస్టులు మృతి చెందారు. ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో 12 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. గురువారం లాల్ ఖిల్లా మైదాన్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు సైనికులు, 10 మంది ఉగ్రవాదులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్‌ల అనంతరం ఆయా ప్రాంతాల్లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.



# అబ్బురం.. ఈ నిర్మాణం

## భోపాల్ '90 డిగ్రీల' వంతెనకు పోటీగా నాగపూర్ 'బాల్కనీ ఫ్లైఓవర్'



**నాగ్‌పూర్‌జనంసాక్షి:**మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన వింతైన ఫ్లైఓవర్ వార్తల్లో నిలిచింది. దీనిపై వెళ్లే వాహనదారులు తికమకపడటం ఖాయం అనిపించేలా దానిని నిర్మించారు.ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోనూ ఇలాంటి అద్భుతాన్నే నిర్మించారు. ఈ తాజా ఇంజినీరింగ్ పరిజ్ఞానం ఇప్పుడు అందరి దృష్టిని అలరిస్తోంది. నాగ్‌పూర్‌లో నిర్మాణంలో ఉన్న ఈ ఫ్లైఓవర్ అశోక్ చౌక్ సమీపంలోని ఒక ఇంటి బాల్కనీ భాగం గుండా వెళ్లడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.స్థానికులు దీనిని ఎనిమిదవ అద్భుతం అని అంటున్నారు. భారత జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ), నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లు ఒక ఇంటి బాల్కనీ గుండా ఈ నిర్మాణం చేపట్టేముందు ఎందుకు దీనిని గమనించేలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బాల్కనీ ఫ్లైఓవర్ గురించి ఇంటి యజమాని ప్రవీణ్ పాత్రే, అతని కుమార్తె సృష్టితో పాటు సీనియర్ బీజేపీ ఎమ్మెల్యే మోహన్ మేట్‌లు మీడియాతో మాట్లాడారు.పాత్రే, అతని కుమార్తె తెలిపిన వివరాల ప్రకారం.. వారి కుటుంబం ఆరు తరాలుగా ఆ ఇంట్లో నివసిస్తోంది. ఈ ఆస్తి దాదాపు 150 సంవత్సరాల నాటిది. ఈ ఇంటిని 25 సంవత్సరాల క్రితం పునరుద్ధరించారు. కాగా ఫ్లైఓవర్ తమ బాల్కనీని ఆనుకంటూ వెళ్లడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, భద్రతా ప్రమాదాల గురించి ఆందోళన చెందడం లేదని వారు అన్నారు. అయితే ఈ ఇంటి ప్లాన్‌కు ఆమోదం ఉందా? అని అడిగినప్పుడు వారు తప్పించుకునే సమాధానం ఇచ్చారు.9.2 కిలోమీటర్ల మేర ఈ ఫ్లైఓవర్‌ను ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో రూ. 998 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ వివాదంపై అధికారులు మాట్లాడుతూ దీనిపై ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్‌కు తెలియజేశామన్నారు.ఈ అనధికార నిర్మాణాన్ని కూల్చివేయడం నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత అని అన్నారు. కాగా సౌత్ నాగ్‌పూర్ ఎమ్మెల్యే మోహన్ మేట్ మాట్లాడుతూ ఈ ఫ్లైఓవర్ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోకపోవడం ఆశ్చర్యపరిచిందన్నారు. దీనికి కారకులైనవారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం బాల్కనీకి చేరుకునే ముందుగానే సంబంధింత అధికారులు నోటీసు జారీ చేసి, నిర్మాణాన్ని తొలగించి ఉండాల్సిందని ఆయన అన్నారు.9.2 కిలోమీటర్ల మేర ఈ ఫ్లైఓవర్‌ను ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో రూ. 998 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ వివాదంపై అధికారులు మాట్లాడుతూ దీనిపై ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్‌కు తెలియజేశామన్నారు.ఈ అనధికార నిర్మాణాన్ని కూల్చివేయడం నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత అని అన్నారు. కాగా సౌత్ నాగ్‌పూర్ ఎమ్మెల్యే మోహన్ మేట్ మాట్లాడుతూ ఈ ఫ్లైఓవర్ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోకపోవడం ఆశ్చర్యపరిచిందన్నారు. దీనికి కారకులైనవారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణం బాల్కనీకి చేరుకునే ముందుగానే సంబంధింత అధికారులు నోటీసు జారీ చేసి, నిర్మాణాన్ని తొలగించి ఉండాల్సిందని ఆయన అన్నారు.

# కాలువలోకి దూసుకెళ్లిన కారు

**జైపూర్(జనంసాక్షి):**రాజస్థాన్ లోని జైపుర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హరిద్వార్ నుంచి వస్తున్న ఓ కారు కాలువలో పడి ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. శనివారం రాత్రి హరిద్వార్‌నుంచి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. జైపుర్‌లోని శివదాస్‌పుర పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ప్రహ్లాద్?పుర సమీపంలోని రింగ్ రోడ్డు కింద ఉన్న కాలువలో కారు పడిపోయింది. వేగంగా వస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి రింగ్ రోడ్ పై నుంచి దాదాపు 16 అడుగుల కిందకు పడిపోయిందని అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదంలో కారులోని ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా, ఆదివారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో ఓ యువకుడు కాలువలో పడి ఉన్న కారును చూశాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీనితో డీసీపీ సౌత్ రాజర్షి రాజ్ వర్మ సహా ఇతర అధికారులు ఘటనాస్థలానికి వెళ్లారు. హుటాహుటిన కారును కాలువలోంచి బయటకు తీయించారు. కారులో ఉన్న మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. మృతులంతా హరిద్వార్?లో అస్థికలు కలపడం కోసం వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషాధ ఘటనలో రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు మృతి చెందారు. వీరంతా జైపుర్‌లోని పులియావాస్ కేక్రి, వాటికకు చెందినవారుగా తెలుస్తోందని చక్సు ఏసీపీ సురేంద్ర సింగ్ తెలిపారు.మృతుల్లో సింగనేర్‌కు చెందిన రామ్‌రాజ్ వైష్ణవ్, అతని భార్య మధు, వారి కుమారుడు రుద్ర ఉన్నారు. అజ్మీర్‌లోని కేక్రికి చెందిన రామరాజ్ బంధువు కలురామ్, ఆయన భార్య సీమ, వారి కుమారులు రోహిత్, గజరాజ్ ఉన్నారని పోలీసులు తెలిపారు.పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం, ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్న రామరాజ్ తమ బంధువు చితాభస్మాన్ని హరిద్వార్? వద్ద గంగానదిలో కలపడానికి వెళ్లారు. ఆయన కుటుంబంతో పాటు కలురామ్ భార్య, పిల్లలు కూడా హరిద్వార్‌కు వెళ్లారు. వారు జైపుర్‌కు తిరిగి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రక్కు..

రాజస్థాన్‌లోని ధోల్పూర్‌లో శనివారం ఖాటుశ్యామ్ నుంచి తిరిగి వస్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఓ ట్రక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీనితో ఒక వ్యక్తి మరణించగా, 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనితో వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# బాక్సింగ్ లెజెండ్ రికీ హాటన్ కన్నుమూత



హైడే : బ్రిటన్ బాక్సింగ్ దిగ్గజం, 'హిట్‌మ్యాన్'గా పేరుగాంచిన రికీ హాటన్ (46) హఠాత్తుగా మరణించాడు. ఈ డిసెంబర్‌లో రింగ్‌లోకి పునరాగమనం చేయాలని సన్నాహాలు చేస్తున్న ఆయన మరణం కుటుంబ సభ్యులు, అభిమానులను శోకసంద్రంలో మునిగేలా చేసింది. మాంచెస్టర్ పోలీసులు స్పందిస్తూ, ఆదివారం ఉదయం ఉత్తర ప్రాంతంలోని హైడే ఏరియాలో రికీ మృతదేహం లభించిందని, ఆయన మరణం అనుమానాస్పదంగా అనిపించ లేదని తెలిపారు. పోస్ట్‌మార్టం తర్వాత మరణ కారణాలు స్పష్టమవుతాయని పేర్కొన్నారు.
తన సూపర్ పంచ్‌లతో 'హిట్‌మ్యాన్' అనే బిరుదు సంపాదించిన రికీ హాటన్, సుదీర్ఘ కెరీర్‌లో అనేక టైటిళ్లను గెలుచుకున్నాడు. రింగ్‌లోకి దిగితే ప్రత్యర్థులకు భయం పుట్టించే రికీ, అజేయ బాక్సర్ కొస్త్యా సుజున్ (రష్యా–ఆస్ట్రేలియా ప్రొఫెషనల్ బాక్సర్)కు 2005లో ఓటమి రుచి చూపించాడు. ఆ విజయంతో మొదలైన ఆయన జైత్రయాత్ర 2007 వరకు కొనసాగింది. అయితే, లాస్ వేగాస్‌లో అమెరికా బాక్సర్ ఫ్లాయిడ్ మెవేదర్ జూనియర్ చేతిలో రికీ ఓటమి చవిచూశాడు. ఆ తర్వాత ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్న ఆయన, ఐదేళ్ల తర్వాత బాక్సింగ్‌కు వీడ్కోలు పలికాడు. తన వ్యక్తిగత జీవితం గురించి గతంలో ఇంటర్వ్యూలో రికీ వెల్లడిస్తూ, తాను తాగుడు అలవాటుకు బానిస అయ్యానని, అది డ్రగ్స్‌కు దారితీసిందని, దాంతో తన జీవితం నియంత్రణలో లేకుండా పోయిందని చెప్పాడు. రికీ హాటన్ మరణం బాక్సింగ్ ప్రపంచంలో గొప్ప శూన్యతను మిగిల్చింది.



# ఆంధ్ర బ్యాటింగ్ కోచ్‌గా వినీత్ ఇడుక్కర్

విజయవాడ : రంజీ ట్రోఫీ సీజన్ కోసం తయారులు చేస్తున్న ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) కోచింగ్ సిబ్బందిని పటిష్టం చేసుకుంది. ప్రధాన కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్‌ను ఎంపిక చేసిన ఏసీఏ, బ్యాటింగ్ కోచ్‌గా ముంబై దిగ్గజం వినీత్ ఇడుక్కర్‌ను ఆదివారం ఖరారు చేసింది. ఈ మాజీ ఆటగాడు ఇప్పటికే ఆంధ్ర స్క్వాడ్‌తో చేరాడు. కర్నాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మైసూర్‌లో జరుగుతున్న టోర్నమెంట్‌తో ఇడుక్కర్ కోచింగ్ జర్నీ ప్రారంభమవుతుంది. 'ముంబై ఆధిపత్యంలో ఇడుక్కర్ పాత్ర అపూర్వం. సహాయక సిబ్బందిగా అతని సేవలు గుర్తుండిపోయాయి. అతని బ్యాటింగ్ సూచనలతో ముంబై రంజీ సెమీఫైనల్ చేరింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలిచింది. అనుభవజ్ఞుడైన ఇడుక్కర్ సేవలు ఆంధ్ర జట్టుకు ఉపయోగపడతాయని నమ్ముతున్నాం' అని ఏసీఏ ప్రకటించింది. ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 43 మ్యాచ్‌లు ఆడిన ఇడుక్కర్, ఆంధ్ర జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా ఎంపికైనప్పుడు సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఏసీఏతో చర్చలు, ఒప్పందం పూర్తయిన తర్వాత మీడియాతో మాట్లాడతానని చెప్పిన అతను, మైసూర్‌కు బయలుదేరుతున్నానని క్రిక్‌బజ్‌కు తెలిపాడు. రంజీ చాంపియన్ ముంబైకి కొన్ని సంవత్సరాలుగా కోచింగ్ ఇచ్చిన ఇడుక్కర్‌తో 2025–26 సీజన్ ముందు ముంబై క్రికెట్ సంఘం కాంట్రాక్ట్ రద్దు చేసుకుంది. దీంతో ఇడుక్కర్ సేవలను వాడుకోవాలని ఆంధ్ర క్రికెట్ సంఘం ముందుకు వచ్చింది. 16 సంవత్సరాల ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 43 మ్యాచ్‌లు ఆడిన ఈ మాజీ క్రికెటర్, ఆంధ్ర బ్యాటింగ్‌ను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాడని ఆశిస్తున్నారు.

# ఆశాలపై వేధింపులు ఆపాలి

## సీఐటియు మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ



కాప్రా, సెప్టెంబర్ 14 (జనం సాక్షి ) : నిచ్చెయ్ ఎన్రోల్మెంట్ పనులు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఏఎన్ఎంలు చేస్తుంటే, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మాత్రం ఆశాలపై వేయడం అన్యాయం అని జిల్లా సీఐటియు కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ విమర్శించారు. ఆదివారం సీఐటియు మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల పై అధికారులు పెడుతున్న ఒత్తిడిని సీఐటియు ఖండిస్తుందని, ఇప్పటికే అడల్ట్ బీసీజీ సర్వే పూర్తి చేసి సంవత్సరం గడిచినా, వాగ్దానం చేసిన పారితోషికం ఆశాల ఖాతాల్లో జమ కాలేదని ఆయన గుర్తు చేశారు. అయినప్పటికీ ఇప్పుడు బీసీజీ టీకాల ఆన్లైన్ నమోదు చేయాలని అధికారుల వేధింపులు మొదలుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. యువిన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఐహెచ్ఐపీ, ఈ–సంజీవని ఓపీ వంటి అన్ని ఆన్లైన్ పనులు ఇతర జిల్లాలలో ఏఎన్ఎంలు చేస్తుంటే, ఇక్కడ మాత్రం ఆశాలపై మోపడం అన్యాయమని పేర్కొన్నారు. చేయకపోతే తీసేస్తాం అంటూ అధికారులు బెదిరించడం దారుణమని అన్నారు. ఆశాలను చదువుకోని వారినీ తీసుకున్నప్పుడు వారి పరిస్థితి ఏంటో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఫిక్స్‌డ్ వేతనం లేకుండా ఎన్ని రోజులు ఇలా చాకిరీ చేయిస్తారని ప్రశ్నించారు. ఆశాల పనులు ఆశాలతోనే చేయించాలిగాని, అదనపు బాధ్యతలు మోపరాదని, సమస్యలు పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

# బెంగాల్ క్రికెట్ బాస్‌గా మరోసారి సౌరవ్ గంగూలీ

కోల్‌కతా : భారత మాజీ కెప్టెన్, క్రికెట్ దిగ్గజం సౌరవ్ గంగూలీ మరోసారి బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడిగా సేవలందించనున్నాడు. 2015 నుంచి 2019 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా పని చేసిన గంగూలీ, తన ముద్ర వేసిన ఈ పదవిని రెండోసారి అధిరోహించనున్నాడు. ఆయన తర్వాత బాధ్యతలు ఆయన పెద్ద సోదరుడు స్నేహాశిష్ గంగూలీ చేపట్టనున్నారు. దీంతో బెంగాల్ క్రికెట్ మరోసారి గంగూలీ కుటుంబం చేతుల్లోకి రానుంది. క్యాబ్ వార్షిక సమావేశం సెప్టెంబర్ 22న జరగనుంది. అదే రోజు కొత్త కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహించబడతాయి. ఈ ఆదివారం అధ్యక్ష పదవి కోసం గంగూలీ నామినేషన్ వేశాడు. పోటీగా ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవంగా క్యాబ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైనట్టే. 2019 నుంచి క్యాబ్ అధ్యక్షుడిగా స్నేహాశిష్ గంగూలీ వ్యవహరిస్తున్నారు.
'మరోసారి బీసీసీఐ అధ్యక్ష పదవి చేపట్టారా?' అనే ప్రశ్నకు గంగూలీ 'అనవసరంగా ఊహించకండి' అంటూ బదులిచ్చాడు. దీంతో బీసీసీఐ బోర్డులో ఉండే ఆసక్తి లేదని స్పష్టమవుతోంది. ఇప్పటికే ఎస్ఏ20 లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్ కోచ్‌గా ఎంపికైన గంగూలీ, బీసీసీఐ అధ్యక్ష పదవి చేపట్టే సిద్ధత చూపడం లేదు.క్యాబ్ కొత్త కార్యవర్గం కూడా ఏకగ్రీవంగా ఎన్నికవుతుంది. ఉపాధ్యక్షుడిగా నితీశ్ రంజన్ దత్తా, కార్యదర్శిగా బాబ్లు కొలే, సంయుక్త కార్యదర్శిగా మదన్ మోహన్ ఘోష్, కోశాధికారిగా సంజయ్ దాస్ నామినేషన్ వేశారు. ఈ నలుగురికి పోటీ లేకపోవడంతో వారు ఎన్నికైనట్టే. గంగూలీ నేతృత్వంలో బెంగాల్ క్రికెట్ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.





# హై జంప్ ఫైనల్‌లో సర్వేశ్ కుశారే

టోక్యో, సెప్టెంబర్ 14: భారత హై జంపర్ సర్వేశ్ కుశారే ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో చరిత్ర సృష్టించాడు. టోక్యో వేదికగా జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో ఆదివారం నిర్వహించిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లో అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. టోక్యో ఒలింపిక్స్ విజేత గియన్‌మార్కో తంబేరిని వెనక్కి నెట్టి, భారత్ నుంచి హై జంప్ ఫైనల్‌కు చేరిన తొలి పురుష అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు. క్వాలిఫైయింగ్ రౌండ్‌లో 2.16 మీటర్ల ఎత్తును దాటడానికి నిర్ధారిత లక్ష్యంతో బరిలోకి దిగిన సర్వేశ్, తొలి ప్రయత్నంలో విఫలమైనప్పటికీ మనోధైర్యం కోల్పోలేదు. రెండవ ప్రయత్నంలో 2.25 మీటర్ల ఎత్తును సునాయాసంగా దాటి ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు. సర్వేశ్‌తో పాటు 13 మంది అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. పతక వేటలో సర్వేశ్ మరింత మెరుగైన ప్రదర్శన చేసి భారత్‌కు గర్వకారణమవాలని దేశం ఆకాంక్షిస్తోంది.



# రాణించిన అభిషేక్, తిలక్ వర్మ

దుబాయ్, సెప్టెంబర్ 14: ఆసియా కప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో పాకిస్తాన్ నిర్దేశించిన 128 రన్స్ లక్ష్యాన్ని భారత్ పరుగులు ముంచుతూ మొదలుపెట్టింది. పవర్‌ప్లేలో అభిషేక్ శర్మ (31), తిలక్ వర్మ (15 నాటౌట్) అద్భుతంగా ఆడి జట్టు స్కోర్‌ను 61/2కు చేర్చారు. ఇంకా 67 రన్స్ కావాలి. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (4) క్రీజులో ఉన్నాడు. షాహీన్ అఫ్రిది మొదటి ఓవర్‌లో అభిషేక్ తొలి రెండు బంతులకు 4, 6 కొట్టాడు. రెండో ఓవర్‌లో సయిూద్ అయూబ్‌ను ఉతికేసినా శుభ్‌మన్ గిల్ (10) రెండు ఫోర్లు సాధించాడు. కానీ ఆఖరి బంతికి స్టంప్డ్ అవ్వడంతో వికెట్ పడింది. అభిషేక్ జోరు తగ్గకుండా సయిూద్‌ను లక్ష్యంగా చేసి రెండు బౌండరీలు కొట్టి అతడి ఓవర్‌లోనే 31 రన్స్‌తో వెనుదిరిగాడు. తిలక్ వర్మ వచ్చి నవాజ్ ఓవర్‌లో రెండు ఫోర్లు బాది 60o స్కోర్ చేశాడు. దాంతో పవర్‌ప్లేలో భారత్ 61/2 సాధించింది.
పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు విజృంభించారు. టాస్ ఓడి బౌలింగ్‌కు దిగిన భారత్‌కు పేసర్లు మొదట్లోనే బ్రేక్ ఇచ్చారు. దుబాయ్ స్టేడియంలో మొదటి ఓవర్ తొలి బంతికే హార్దిక్ పాండ్యా సయిూద్ అయ్యూబ్ (0)ను బౌల్డ్ చేశాడు. రెండో బంతిని ఇన్‌స్వింగర్‌గా వేసి బుమ్రా చేతికి క్యాచ్ పట్టించాడు. ఒక్క పరుగుకే వికెట్ పడింది. తర్వాత జస్ప్రీత్ బుమ్రా మొహమ్మద్ హారిస్ (3)ను ఔట్ చేసి పాక్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. అక్షర్ పటేల్ (2–18) వరుసగా ఫఖర్ జమాన్, సల్మాన్ అఘా (3)ను పెవిలియన్ పంపాడు. కుల్దీప్ యాదవ్ (3–18) తన స్పిన్ మ్యాజిక్‌తో మూడు కీలక వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు.
ఓపెనర్ షహీబ్‌జాద్ ఫర్హాన్ (41) దూకుడుగా ఆడి అర్ధశతకం దిశగా సాగాడు. కానీ కుల్దీప్ చేతిలో 41కే ఔట్ అయ్యాడు. 64/6 వద్ద పాక్ 100 లోపై ఆలౌట్ అవుతుందనిపించింది. కానీ డెత్ ఓవర్లలో షాహీన్ అఫ్రిది (33 నాటౌట్) మెరుపులతో దంచేశాడు. బుమ్రా ఓవర్‌లో సూఫియన్ ముకీం (10) రెండు ఫోర్లు కొట్టి స్కోర్ 100 దాటించాడు. చివరి బంతికి ముకీంను బౌల్డ్ చేసిన బుమ్రా రెండో వికెట్ తీశాడు. పాండ్యా 20వ ఓవర్‌లో షాహీన్ రెండు సిక్సర్లు బాది పాక్ 127/9కు చేరింది. భారత్ విజయం దాదాపు ఖాయమని అనిపిస్తోంది.

# నిర్మాణ పనుల్లో ప్రహరీ కూలీ కార్మికుడు మృతి

## నలుగురు కార్మికులు గాయాలు



రాజేంద్రనగర్, సెప్టెంబర్14(జనం సాక్షి) : గండిపేట మండలం ఖానాపూర్ లోని శ్రీదేవి కాలేజ్ ఎదురుగా ఓ భారీ కన్వెన్షన్ హాల్ నిర్మాణ పనులో ఓ కార్మికుడా మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రహరీ పక్కన డ్రైనేజీ తవ్వుతుండగా దాదాపు 10 అడుగుల ఎత్తున్న గోడ కూలిపోయి వారిపై పడి గాయపడింది,రవీంద్రనగర్, ఆదిలాబాద్ జిల్లా కు చెందిన శేఖర్ మండల్(24) అనే కార్మికుడు మార్గమధ్యలో గాయాలతో మరణించాడు. గాయపడిన మిగిలిన ముగ్గురు కార్మికులుమీర్జాపూర్, బీహార్ రాష్ట్రనికి చెందిన కుల్దాన్(22) నడిగూడెం, సూర్యాపేట జిల్లాకు చెందిన గుంజ నరసింహ(21),ఉదయ్ మహేశ్వర్ (25)లు కాంటినెంటల్ హాస్పిటల్ లో, మరో వ్యక్తి బిహార్ కు చెందిన రవి పాశ్వాన్(18) సిటిజన్ ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు.

# రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు

- ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం.
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) : ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో మైనారిటీ ఫంక్షనాల్లో ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం కావడం జరిగిందని ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు గయాజుద్దీన్,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్ హైమద్ లు పేర్కొనడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ బాలు,జమీల్ లు మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని లేవని రక్తదానం పట్ల అపోహలను విడనాడి రక్తదానానికి ముందుకు రావాలని అన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన నీతి న్యాయం ధర్మం సమాజ సేవ అనే సూత్రాలను నిజజీవితంలో పాటించి సన్మార్గంలో నడవాలని అన్నారు సేవా మార్గంతోనే మానవ జీవితానికి సార్ధకత ఏర్పడుతుందని అన్నారు.రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు గయాజుద్దీన్ మరియు కమిటీ సభ్యులు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ శిబిరంలో 22 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యకులు ముక్రం, సయ్యద్ మీర్,అజీజ్ రెహమాన్,అహ్మద్ పాషా,కమిటీ సభ్యులు, ముస్లిం యువత పాల్గొనడం జరిగింది.





# చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేత

మంథని, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఇస్లాం నగర్ చెందిన ఖదీర్ కుమార్తె చిన్నారి వైద్య చికిత్స కోసం ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో సేకరించిన రూ. 51 వేలు కమాన్పూర్ డాక్టర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఛత్రపతి శివాజీ యువసేన తమవంతుగా ఆర్థిక సహాయం అందజేస్తూ వారికి అండగా నిలుస్తుండడం అభినందనీయమన్నారు. ఇలాగే ఇకముందు కూడా మరి ఎంతోమందికి చేయూతనించే విధంగా ముందుకు సాగాలని సూచించారు. తమ వంతు కూడా ఆర్థిక సేవ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జంగపెల్లి సతీష్, వ్యవస్థాపక అధ్యక్షులు. జంగపెల్లి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు మల్యాల శేఖర్, పలు రాజకీయ పార్టీల నాయకులు మచ్చగిరి రాము, రంగు సత్యనారాయణ , గుర్రం లక్ష్మిమల్లు ,గడపకృష్ణమూర్తి, అనవేనా లక్ష్మిరాజాం, కుక్క చంద్రమొగిలి ,మల్లారపు అరుణ్, యువసేన నాయకులు ,కొత్తపల్లి సతీష్, జంగపల్లి చిన్న శ్రీనివాస్, తిరుపతి, రవి అభి, శ్రవణ్, వెంకటేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు

# లోక్‌అదాలత్ కేసుల పరిష్కారంలో జిల్లాది 4వ స్థానం

నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) : జాతీయ మెగా లోక్–అదాలత్ కేసుల పరిష్కారంలో నిజామాబాద్ జిల్లా 4వ స్థానంలో నిలిచిందని సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ అదాలత్ లో 7 వేల 4 వందల 44 కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి రూ. 42 లక్షల 45 వేల 273 రూపాయలను తిరిగి బాధితులకు అందజేశామన్నారు. జిల్లాలో జాతీయ మెగా లోక్–అదాలత్‌ను విజయవంతం చేసినందుకు అధికారులను, సిబ్బందిని సీపీ అభినందించారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930 కి కాల్ చేసి గాని, http://cybercrime.gov.in అయి దరఖాస్తు చేయాలని సీపీ సూచించారు. ఈ సందర్భంగా జాతీయ మెగా లోక్–అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు సైబర్ క్రైమ్ ఏసీపీ వై. వెంకటేశ్వర్ రావ్, సీఐ ముఖిద్ పాషా, సీసీఆర్బీ సీఐ సతీష్, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని సీపీ అభినందించారు.

# ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ .. శస్త్రచికిత్సలో కొత్త ఒరవడి

- అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఎన్ సోమశేఖర్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 14:
అపోలో హాస్పిటల్స్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, శస్త్రచికిత్సలో కచ్చితత్వం, ఆధునికతపై దృష్టి సారించామని తెలిపారు. తెలంగాణ ఆర్థోస్కోపీ సొసైటీ, ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ, తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ సహకారంతో అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జూబ్లీ హిల్స్‌లోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో 9వ ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్ 2025 జరిగింది. ఈ సమ్మిట్‌లో యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు శస్త్రచికిత్స నైపుణ్యాలను మెరుగుపరచడానికి జ్ఞానం, ప్రాక్టికల్ స్కిల్స్‌ను పెంచేందుకు శిక్షణా కార్యక్రమం రూపొందించామని డాక్టర్ సోమశేఖర్ రెడ్డి వివరించారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా అందించిన జ్ఞానం డెలిగేట్ల నుంచి సానుకూల స్పందనను పొందిందని, విద్యార్థులు తమ శస్త్రచికిత్స కచ్చితత్వం, నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేందుకు ఇది ఉపకరించిందని ఆయన తెలిపారు.
ఈ సంవత్సరం సమ్మిట్‌లో మోకాలు, హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలు అవసరం లేకుండా జాయింట్ సమస్యలకు చికిత్స చేసే వినూత్న విధానాలపై దృష్టి సారించామని డాక్టర్ రెడ్డి పేర్కొన్నారు. జాయింట్స్ మధ్య కార్టిలేజ్‌ను పునరుత్పత్తి చేసే నూతన సాంకేతికతలపై నిపుణుల చర్చలు జరిగాయని, ఇవి శస్త్రచికిత్స అవసరం లేని రోగులకు ఉపశమనం కలిగించే మార్గాలను సూచించాయని చెప్పారు. జాయింట్ మార్పిడి శస్త్రచికిత్స అవసరమైన సందర్భాల్లో రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్సల తాజా పురోగతులను పరిశీలించి, సంప్రదాయ పద్ధతులతో పోల్చి చర్చించామన్నారు. ఆర్థోపెడిక్ చికిత్సలో కొత్త పరిధులను విస్తరించడం, రోగులు వేగంగా కోలుకోవడం మా లక్ష్యమని ఆయన అన్నారు.
అపోలో హాస్పిటల్స్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సమ్మిట్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ మిథిన్ ఆచి మాట్లాడుతూ, ఆర్థోపెడిక్ చికిత్సలో అత్యాధునిక పురోగతులపై ప్రత్యేకంగా చర్చించామన్నారు. జాయింట్ సమస్యల చికిత్సను రూపాంతరం చేస్తున్న తాజా శస్త్రచికిత్సా విధానాలపై దృష్టి సారించామని, ముఖ్యంగా జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సల్లో రోబోటిక్స్ పాత్ర, మోకాలి కార్టిలేజ్ గాయాలకు చికిత్స చేసే సింగిల్ స్టేజ్ విధానంపై చర్చించామన్నారు. ఈ విధానం ఆర్థ్రైటిస్ ప్రారంభాన్ని నివారించడంలో ఉపయోగపడుతుందని, జాయింట్‌ను కాపాడే అత్యాధునిక పద్ధతులు, భుజం శస్త్రచికిత్సలో కీహోల్ విధానాలపై చర్చలు జరిగాయని తెలిపారు. ఇవి రోగులకు మెరుగైన ఫలితాలను అందిస్తూ కొత్త ప్రమాణాలను సృష్టిస్తున్నాయన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్స దీర్ఘకాలిక ప్రభావంపై పరిశోధనలు జరుగుతున్నప్పటికీ, హిప్ రీప్లేస్‌మెంట్ సమయంలో కప్‌ను కచ్చితంగా అమర్చడం, తీవ్రమైన మోకాలి వక్రీభవనాలను నిర్వహించడంలో దాని ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన చెప్పారు. దేశీయంగా అభివృద్ధి చేసిన రోబోటిక్ పరిష్కారాలు ఖర్చులను తగ్గించడమే కాక, కచ్చితమైన చికిత్సను అందిస్తాయని, దీంతో అధునాతన చికిత్స ఎక్కువ మంది రోగులకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.
గత తొమ్మిదేళ్లుగా ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్ ఒక ప్రత్యేక విద్యా వేదికగా నిలిచిందని, ఆర్థోప్లాస్టీ, ఆర్థోస్కోపీ, కార్టిలేజ్ రిపేర్ రంగాల్లో తాజా పురోగతులను నిపుణులు రూపొందించిన శస్త్రచికిత్స వీడియోల ద్వారా ప్రదర్శించామని డాక్టర్ ఆచి తెలిపారు. వివిధ చికిత్స పద్ధతుల్లో నిపుణులైన ఉత్తమ వైద్యులను ఒక చోట చేర్చి, భవిష్యత్ ఆర్థో సర్జన్లకు ప్రత్యేక శస్త్రచికిత్సా పద్ధతులపై శిక్షణ ఇవ్వడం ఈ సమ్మిట్ ఉద్దేశమని ఆయన అన్నారు. ఆర్థోస్కోపీ వంటి కీహోల్ విధానాలు నొప్పిని తగ్గించి, వ్యాధిని సరిచేయడంలో సహాయపడతాయని, కార్టిలేజ్ సంబంధిత చికిత్సలు, మోకాలి జాయింట్, హిప్ రీప్లేస్‌మెంట్ వంటి అధునాతన చికిత్సలను భారతదేశ ఆర్థోపెడిక్ చరిత్రలో మొదటిసారి ఇక్కడ ప్రదర్శించామని తెలిపారు. ఒకే రోజులో ఒకే సమావేశంలో 42 ఆర్థోపెడిక్ ప్రక్రియలను ప్రదర్శించడం ప్రపంచ రికార్డని, దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ఆర్థోపెడిక్ వైద్యులు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారని డాక్టర్ ఆచి పేర్కొన్నారు.

# మహిళల అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 14 (జనంసాక్షి) : మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.ఆదివారం వేములవాడలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు మహిళలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పం తో ముందుకు పోతున్నారన్నారు. రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారన్నారు. అనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తలులకు పేద్ధపీట వేయడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20 వేల పైచిలుకు కోట్లను కేటాయించడం జరిగిందన్నారు.మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందన్నారు.
ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వారు ఆర్థికంగా ఎదగాలని మైక్రో ఎంటర్ప్రైజేషన్, మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్మెంట్ యూనిట్లో, సోలార్ పవర్ ప్లాంట్, డైరీ యూనిట్స్ వంటి వాటిని ఏర్పాటు చేయడం కోసం బ్యాంకు లింకేజీ వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందనారు.2024–25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ ద్వారా రూ 20084 కోట్లు, 2025–26 సంవత్సరానికి రూ 58 కోట్లు బ్యాంకు లింకేజీ అందజేయడం జరిగిందని, 4350 సంఘాలకు రూ 5 కోట్ల 72 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు.మహిళా సంఘాల సభ్యురాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోన్ బీమా, ప్రమాద బీమా స్కీం వలన ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందనారు. ప్రమాదవశాత్తు ఎవరైనా సంఘ సభ్యులు చనిపోతే వారు తీసుకున్న రుణం మాఫీ తో పాటు పది లక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించడం జరుగుతుందన్నారు.వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికీ మీ అందరి ఆశీర్వాదాలు ఉండాలన్నారు.



## వన మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి సీఎండి

**గోదావరిఖని, జనంసాక్షి :** భూపాలపల్లిలోని మిలీనియం క్వార్టర్స్ వెనక వైపు ఉన్న సింగరేణి కొత్త నర్సరీ మైదానంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి భూపాలపల్లి ఏరియా వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వన మహెూత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం మొక్క నాటి నీరు పోశారు. అనంతరం ప్రకృతి ప్రేమికుడైన సింగరేణి సీ అండ్ ఎండీ బలరాం 370 మొక్కలను ఏకబికిన నాటారు. ఈ సందర్భంగా బలరాంని ఎమ్మెల్యే అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటివరకు 20వేల కు పైగా మొక్కలు నాటిన తొలి సివిల్ సర్వీసెస్ ఆఫీసర్గా సింగరేణి సీ అండ్ ఎండి బలరాం రికార్డ్ సృష్టించారు.

## స్థానిక భాషలు, మాతృభాషలు.. ఆత్మనిర్భర భారతానికి అతిపెద్ద శక్తి

- గుజరాత్ 'హిందీ దివస్' కార్యక్రమంలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రసంగం
- అమిత్ షా, గుజరాత్ సీఎం సహా పలువురు హాజరు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 14 (జనంసాక్షి):** హిందీ కేవలం ఒక భాష మాత్రమే కాదు, కోట్లాది భారతీయుల భావోద్వేగాలు, సంస్కృతికి ప్రతీక అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. 'హిందీ దివస్' సందర్భంగా ఆదివారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్ర న్యాయ రాష్ట్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, పార్లమెంటరీ రాజభాషా కమిటీ ఉపాధ్యక్షులు భర్తృహరి మహతాబ్, స్థానిక ఎంపీ దినేష్ మక్వానా, ప్రముఖ గుజరాతీ విద్యావేత్త ప్రొఫెసర్ విజయ్ పాండ్యా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, భాష నాగరికత, సంస్కృతికి ఆత్మ అని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లు భాష కేవలం వ్యక్తీకరణ సాధనం కాదు, సంస్కృతి, సంప్రదాయం, జాతీయ చైతన్యానికి ప్రాణం అన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ఆత్మనిర్భరత, విశ్వగురుత్వం దిశగా వేగంగా పురోగమిస్తోందని, స్థానిక భాషలు, మాతృభాషలు ఆత్మనిర్భర భారతానికి పెద్ద శక్తిగా నిలుస్తాయని చెప్పారు. జాతీయ విద్యా విధానం భారతీయ భాషలకు విద్య, జ్ఞానంలో ప్రాధాన్యతనిచ్చిందని, అమిత్ షా మార్గదర్శనంలో హిందీ, భారతీయ భాషలు సాంకేతికత, పరిపాలనలో విస్తృతంగా వినియోగంలోకి వస్తున్నాయని తెలిపారు. రాజభాషా విభాగం అనేక ప్రాజెక్టుల ద్వారా హిందీ, ఇతర భారతీయ భాషలను డిజిటల్ యుగంలో శక్తివంతం చేస్తోందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలలో రాజభాషా విభాగం చారిత్రక కార్యక్రమాలను చేపట్టింది. హిందీ శబ్ద సింధు డిజిటల్ నిఘంటువులో ఏడు లక్షలకు పైగా పదాలు ఉండగా, వీటిలో 25 వేల పదాలు భారతీయ భాషల నుండి సేకరించబడ్డాయి. ఇది హిందీ విస్తరణతో పాటు భారతీయ భాషల మధ్య సంధాన సేతువును నిర్మిస్తోందని, భారతీయ భాషా విభాగ ప్రాజెక్టు సమన్వయానికి గొప్ప ఉదాహరణ అని చెప్పారు. కంఠస్థ, అనువాద్ సాధన్ వంటి సాంకేతిక టూల్స్ రాజభాషా అమలును సులభతరం చేసి, ఆధునికతను జోడించాయని, ఈ సాధనాలు హిందీ, భారతీయ భాషలను పరిపాలన, విద్య, సాంకేతికతలతో అనుసంధానిస్తున్నాయని తెలిపారు. హిందీ ప్రపంచ వేదికపై బలమైన స్థానం సంపాదించిందని, విద్య, కమ్యూనికేషన్, పరిపాలనలో దాని ప్రాధాన్యత పెరుగుతోందని, హిందీ సినిమా, సాహిత్యం, ఆర్థికరంగం దానికి కొత్త ఎత్తులకు తీసుకెళ్లాయని చెప్పారు. విదేశాలలో కోట్ల మంది హిందీని మాట్లాడుతూ, అర్థం చేసుకుంటున్నారని, ఐక్యరాజ్యసమితి వంటి వేదికలపై హిందీకి లభించిన గుర్తింపు భారత సాంస్కృతిక శక్తికి ప్రతీక అన్నారు. హిందీ రాజభాషగా ఉండటం వల్ల ప్రభుత్వ పనితీరు సమన్వయంగా మారిందని, ప్రభుత్వ పత్రాలు, ఉత్తరాలు హిందీలో లభించడంతో ప్రజలు, ప్రభుత్వం మధ్య దూరం తగ్గిందని, సామాన్యుడికి పాలనతో నేరుగా సంభాషించే అవకాశం కలిగిందని తెలిపారు. తాను హిందీయేతర రాష్ట్రమైన తెలంగాణ నుండి వచ్చినప్పటికీ, అమిత్ షా ప్రేరణతో ప్రభుత్వ కార్యకలాపాల్లో, సంభాషణలో హిందీని సులభంగా ఉపయోగిస్తున్నానని చెప్పారు. మాతృభాష శాస్త్రీయ పరిశోధన, వ్యాపారం, డిజిటల్ సంభాషణ, అంతర్జాతీయ దౌత్య భాషగా మారాలని, యువ శాస్త్రవేత్తలు హిందీ, భారతీయ భాషల్లో పరిశోధనలు చేయాలని, వ్యాపారవేత్తలు ఈ భాషల్లో వ్యాపార మోడళ్లను రూపొందిస్తే, సాంకేతిక నిపుణులు ఈ భాషల్లో పరిష్కారాలు అందిస్తే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని అన్నారు. హిందీతో పాటు అన్ని భారతీయ భాషలకు సమాన గౌరవం, అవకాశాలు లభిస్తే భారత ఏకత్వం బలోపేతమవుతుందని, ఈ సదస్సు విజయవంతం కావాలని, మోదీ, అమిత్ షా నాయకత్వంలో హిందీ, భారతీయ భాషలు ఆత్మనిర్భర్, విశ్వగురువైన భారతాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆకాంక్షించారు.

## ఆత్మన్యూనత వీడండి.. చైతన్యంతో పోరాడండి




- గడపగడపకు బీసీ భావజాలాన్ని తీసుకెళ్దాం
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు పిలుపు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 14 (జనంసాక్షి):** అభద్రత, ఆత్మన్యూనత భావాన్ని వీడి, రాజ్యాధికారం కోసం పట్టుదలతో పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో కరీంనగర్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ రాజ్యాధికార సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవిలు హాజరై బీసీలనుద్దేశించి ప్రసంగించారు. బీసీ రాజ్యాధికార సభ కోసం సమావేశం ఏర్పాటు చేశామని, దీని ముఖ్యదేశం గత 75 సంవత్సరాలుగా బీసీలు ఎంతో నష్టపోతున్నారని అన్నారు. ఇకనైనా మేల్కొని బీసీలు నష్టపోకుండా వారి హక్కులను సాధించే దిశగా పోరాటం చేయాలని, వారు ఆత్మనునత భావాన్ని వదిలి చైతన్యంతో పోరాడావలసిన ఆవశ్యకత ఉందన్నారు. బీసీలలో చైతన్యం నింపడం కోసం వివిధ పుస్తకాలు, ఆర్టికల్స్ రాసినట్టు గుర్తుచేశారు. అదేవిధంగా గ్రామగ్రామానా, గడపగడపనా బీసీ బావాజాలాన్ని తీసుకువెళ్లినట్టు తెలిపారు. గతంలో హైదరాబాదులో తాజ్ కృష్ణ హెూటల్లో బీసీలందరూ కలిసి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వానికి కులగనున చేయాల్సిందిగా డిమాండ్ చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి కులగలను చేసిందని, అదేవిధంగా బీసీలకు 42% రిజర్వేషన్లను సాధించుకునేందుకు పోరాటం చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం 9వ షెడ్యూల్లో పొందుపరచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఉరుమల్ల విశ్వం, ఎమ్మెల్సీ కంటెస్టెడ్ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ , బీసీ నాయకులు సబ్బని వెంకట్, కరీంనగర్ జిల్లా బిసిఐఎఫ్ నాయకులు ఇప్పనపెల్లి సాంబాని మాజీ జెడ్పీటీసీ చొప్పదండితో పాటు 1000 మంది బీసీ మేధావులు పాల్గొన్నారు.




## కలగానే మిగిలిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సీఎం హామీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13 (జనం సాక్షి) :** తెలంగాణ విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఎన్నో ఏండ్లుగా పోరాటం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం, 2023 సెప్టెంబర్ 13న హన్మకొండలోని ఏకశిలా పార్క్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ప్రజా దర్బార్‌లో సంఘ నాయకులతో చర్చించి జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19,600 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు 18 సంవత్సరాలుగా వివిధ హెూదాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోస్టర్ కం మెరిట్ పద్ధతిలో పరీక్షలు, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు జరిగాయని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రెగ్యులర్ ఉద్యోగులమవుతామని, తాము కూడా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని కృషి చేశామని చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐదేళ్ల కాంట్రాక్టు ఉద్యోగం చేస్తే రెగ్యులర్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆశించామని, కానీ 15 సంవత్సరాలుగా నష్టపోయిన జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్న రేవంత్ రెడ్డి హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులను కలిసి విన్నవించినా సమస్య పరిష్కరించబడలేదని, 9 నెలల క్రితం నెల రోజుల సమ్మె చేసినప్పుడు ఒప్పంద ప్రకారం ఇచ్చిన హామీలు అమలు కాకుండా ఉండిపోయాయని, సమ్మె కాల జీతం కూడా చెల్లించలేదని వాపోయారు. పాలన మారినా, పాలకులు మారినా పట్టించుకోకపోవడం బాధాకరమని, రాష్ట్ర ప్రజల సంక్షేమం అంటే ఉచిత పథకాలు మాత్రమేనా అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేసి జీవనం గడపలేని స్థితిలో ఉన్న ఉద్యోగులు గుర్తుకు రావడం లేదా అని, తాము తమ కుటుంబాలు, బంధువులు, సన్నిహితులతో కలిసి కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించామని అన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల కంటే కాంట్రాక్టు ఉద్యోగులు ఎక్కువ పనిచేస్తున్నా, విద్యాశాఖలో కీలక పాత్ర పోషిస్తున్నా, కనీస వేతనాలు లేకపోవడం బాధాకరమని తెలిపారు. ఉద్యోగులు మరణించినా చెల్లించాల్సిన గ్రాట్యుటీ వంటి చెల్లింపులు కూడా చేయకపోవడం వెట్టిచాకిరీకి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలంటే, కుటుంబాన్ని పోషించాలంటే పనికి తగిన వేతనం అవసరమని, సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఇచ్చినా, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, సిక్కిం, అస్సాం, జమ్మూ %డ% కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించినా, తెలంగాణలో ఈ హామీ అమలు కావాలని కోరుతున్నారు. వారి ప్రధాన డిమాండ్లు: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి, వెంటనే పే స్కేల్ అమలు చేయాలి, ప్రభుత్వ ఉద్యోగాల్లో 20% వెయిటేజ్ ఇవ్వాలి, 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి.

## కరీంనగర్ కార్పొరేషన్‌పై ఎంఐఎం జెండా ఎగురవేస్తాం





- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో పొత్తు వద్దు
- కరీంనగర్లో 25 స్థానాల్లో పోటీ చేసేందుకు అనుమతి ఇవ్వండి
- అధినేత అసదుద్దీన్ ఒవైసీకి గులాం అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి
- గులాం అహ్మద్ ను సన్మానించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 14 (జనంసాక్షి):** కార్యకర్తలు అందర్నీ సమిష్టిగా కలుపుకుపోతూ, వర్గ విభేదాలను పక్కన పెట్టి, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పై ఎంఐఎం పార్టీ జెండాను ఎగురవేస్తామని, సర్పంచ్, జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో సైతం పోటీ చేసి సత్తా చాటుతామని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఎంఐఎం అధినేత, భారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి భరోసా ఇచ్చారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ ఎంఐఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కమిటీ నాయకులతో ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ, ముఖాముఖిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరపున గులాం అహ్మద్ హుస్సేన్ మాత్రమే సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో పొత్తువద్దని గతంలో బిఆర్ఎస్ పార్టీతో స్నేహపూర్వక పోటీ వల్ల కరీంనగర్లో ఎంఐఎం పార్టీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. 7సీట్లకు డబుల్ గెలిచే అవకాశాలు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వల్ల నీరుగారి పోయిందన్నారు. కరీంనగర్ నగరంలో 66 డివిజన్లకు గాను 38 డివిజన్లలో కమిటీలు వేశామని, 25డివిజన్లలో ఎంఐఎం పార్టీ బలంగా ఉందని, ఈ25 డివిజన్లలో ఎంఐఎం పార్టీ అభ్యర్థులు గెలిచే అవకాశం ఉన్నందున పోటీ చేసేందుకు అనుమతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్, జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో సైతం ఎంఐఎం పార్టీ పోటీ చేసి సత్తా చాటుతుంద న్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, రామగుండం, పెద్దపల్లిలో సైతం ఎంఐఎం పార్టీ పోటీ చేసి పెద్ద ఎత్తున విజయం సాధించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఎంఐ పార్టీలో చేరే వారి కోసం అందరికీ తలుపులు తెరిచే ఉంచామన్నారు. ఒకరిద్దరూ అసంతృప్తిగా ఉండడం ఏ రాజకీయ పార్టీలోనైనా సహజమని, వారి కోసం పార్టీని బలోపేతం చేయ కుండా ఉంటామా అని ప్రశ్నించారు. వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం, ఈద్గా భూమి, ఖబ్రస్థాన్ల భూముల సాధన కోసం ఎంఐఎం ఖచ్చితంగా పోరాటం చేస్తుందన్నారు. ఈసందర్భంగా ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చివరగా అధ్యక్ష ఉపన్యాసం చేశారు.

పార్టీ అధ్యక్షుడి నిర్ణయమే సుప్రీం అని, పార్టీ బలోపేతం కోసం అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయాలకు యావాన్మంది ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు కట్టుబడి వుండాలని ఎంఐఎం అధినేత జిల్లా ఎంఐఎం శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం ఆసన్నమైం దని, పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ కు ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, గజ మాలతో ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయుడు
### రైల్వే రిటైర్డ్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ శ్రీనివాసులు

- నేత్రదానంతో ఇద్దరికి చూపు
- మెడికల పరిశోధనకు మెడికల్ కాలేజీకి దేహ దానం



**గోదావరిఖని, జనంసాక్షి :** సౌత్ సెంట్రల్ రైల్వేలో చీఫ్ మెడికల్ డైరెక్టర్గా పని చేసి రిటైర్డ్ అయిన డాక్టర్ ప్రత్తి శ్రీనివాసులు( 78) అనారోగ్యంతో, హైదరాబాద్‌లో శనివారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని మణికొండలో ప్రస్తుతం నివాసం ఉంటున్న శ్రీనివాసులు అనారోగ్యంతో చికిత్స పొందుతూ, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. కాగా, శ్రీనివాసులు ఆశయం మేరకు ఆయన నేత్రాలను మృతుని సమీప బంధువైన సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీ. హెచ్. లింగమూర్తి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు కార్నియాలను దానం చేశారు. మెడికోల వైద్య పరిశోధన కోసం శ్రీనివాసులు పార్థివ దేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్స్టూట్ ఫౌండర్ నాగేశ్వరరావు సమక్షంలో, మోహన్ ఫౌండేషన్ సహకారంతో అందజేశారు. కాగా, గతంలో జరిగిన ఓ నేత్రదాత సంస్మరణ సభలో అవయవ, శరీర దానాలకు డాక్టర్లు ఎవరు కూడా ముందుకు రావడం లేదని వక్తలు ఆవేదనతో వేదికపై మాట్లాడుతుండగా, అక్కడే ఉన్న డాక్టర్ శ్రీనివాసులు ఎప్పటికప్పుడు స్పందించి, నా మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేస్తానని ప్రకటించారని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి గుర్తు చేశారు. ఆనాడు డాక్టర్ శ్రీనివాసులు చేసిన స్ఫూర్తిదాయకమైన నిర్ణయాన్ని గౌరవిస్తూ, వారి ఆశయం మేరకు నేత్రాలు, శరీరాన్ని దానం చేయడానికి భార్య లత, కూతురు, అల్లుడు అంజని – సందీప్ ముందుకు వచ్చారు. పలువురికి స్ఫూర్తిగా నిలిచిన నేత్ర, పార్థివ దేహదాత కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, పెద్దపల్లి జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు లగిశెట్టి చంద్రమౌళి, గోదావరిఖని పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ తదితరులు అభినందించారు. శ్రీనివాసులు మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

## గ్రోమోర్ సెంటర్ ఫర్టిలైజర్స్ ఇష్టారాజ్యం

### చూసి చూడనట్టుగా వ్యవసాయ అధికారులు

**సైదాపూర్ (జనం సాక్షి) :** సైదాపూర్ మండలంలోని గ్రోమోర్ సెంటర్‌కు యూరియా వచ్చినట్లు తెలిసి, రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడి యూరి యా కోసం వేచి ఉంటే, అనూహ్య పరిణామం ఎదు రైంది. గ్రోమోర్ ఫర్టిలైజర్ సెంటర్‌లో ఒక్క యూరియా బస్తాకు అదనంగా వెయ్యి రూపాయల విలువైన గుళికల ప్యాకెట్ లేదా క్రిమిసంహారక మందు తీసుకోవాలని షరతు విధించారు. దీంతో, రైతులు చేసేది లేక ఒక యూరియా బస్తాకు వెయ్యి రూపాయల విలువగల ఏదో ఒక బ్రాండ్ క్రిమిసంహారక మందును తీసుకోవాల్సి వచ్చింది. ఈ షరతు కారణంగా, రైతులకు ఎలాంటి ఉపయోగం లేని క్రిమి సంహారక మందును అదనంగా అంటగట్టడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతు న్నాయని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలు అందరి కళ్ల ముందు జరుగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం, అందుబాటులో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధి కారులు స్పందించి, ఇలాంటి అన్యాయాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.




### కరీంనగర్ కమిషనరేట్‌లో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 3,130 కేసులు పరిష్కారమయ్యాయని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిష్కారమైన కేసుల్లో పెండింగ్ లో ఉన్న 568 కేసులతో పాటు, 210 ఈ – పెట్టి కేసులను, 2149 డ్రంక్ అండ్ డ్రైవ్ , ఇతర మోటార్ వెహికల్ చట్ట ఉల్లంఘన కేసులను పరిష్కరించారు. అంతేకాకుండా, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితుల ఖాతాల్లో నిలిపివేసిన రూ. 25,79,883ను 103 కేసుల ద్వారా బాధితులకు కోర్టుల సమక్షంలో తిరిగి ఇప్పించడం జరిగిందని కమిషనర్ వివరించారు. ఈ లోక్ అదాలత్ నిర్వహణలో సహకరించిన న్యాయమూర్తులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, ప్రజలకు కక్షిదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### హక్కుల రక్షణ..హామీల అమలు..నూతన గనులు రక్షణకు
## ఏఐటియుసి ఐక్య ఉద్యమాలకు ముందుకు రావాలి

**జిఎల్ బికేఎస్ గౌరవ సలహాదారు టి.శ్రీనివాస్**

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఎన్నికల సందర్భంగా ఏఐటియుసి, ఐఎన్టియుసి సంఘాలు కార్మికులకు ఆదాయ పన్ను రద్దు,పెర్క్స్,సొంత ఇంటి పథకం,నూతనగనులు,వారసత్వ ఉద్యోగాలు,కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ వేతనాలు,డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలు,ఈపి ఆపరేటర్లు,ట్రేడ్స్ మెన్, సూపర్వైజర్ల ప్రమోషన్స్, మారుపేర్ల కార్మికుల సమస్య ఆప్సెంటిజం పేరున డిస్మిస్ అయిన కార్మికుల వన్ టైం సెటిల్మెంట్ తదితర హామీలేవి నేటికి అమలుకు నోచుకోలేదని అధికారంలో ఉన్న పార్టీలకు అనుచితమైన ప్రాధాన్యత నిస్తూ సింగరేణిలో కార్మిక సంఘాల చట్టబద్ధమైన హక్కులు, గుర్తింపు ప్రాధాన్యతను యాజమాన్యం విస్మరిస్తుందని కార్మికులు ఎన్నుకున్న గుర్తింపు సంఘానికి కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారం ఇవ్వాల్సిన గుర్తింపును ఇవ్వకుండా స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన అంగీకారాలను అమలు చేయడానికి మొండిగా నిరాకరించటం కార్మిక వ్యతిరేక మైనదని,గుర్తింపు సంఘంగా తమ హామీలను అమలు చేయించాల్సిన బాధ్యత ఏఐటియుసిపై ఉందని కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయించడానికి ఇప్పటికైనా ఐక్య పోరాటాల నిర్మాణానికి ఏఐటియుసి ముందుకు రావాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (ఐఎఫ్టియు)గౌరవ సలహాదారులు టి. శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

గోదావరిఖనిలో సింగరేణి ముఖ్య కార్యకర్తల సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో టి.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలను లేకుండా చేసేందుకు కంకణం కట్టుకున్నదని దీనికి ఎన్నికలను అడ్డం పెట్టుకొని ఓడిన కార్మిక సంఘాలకు సభ్యత్వ,గేట్ మీటింగ్ లపై నిషేధాలు విధించిందని గెలిచిన సంఘాలపై ఎన్నో పరిమితులు విధించిందని నిరంకుశ కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ను అడ్డం పెట్టుకొని కార్మిక సంఘాలను దూరం చేసేందుకు పూనుకుందని అన్నారు. సింగరేణిలో గని కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న11 కార్మిక సంఘాకు కార్మిక సంఘాల చట్టం ప్రకారం వర్తించాల్సిన హక్కులు సౌకర్యాలను సైతం నిరాకరించిందన్నారు.సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఎఐటి యుసితో



చేసుకున్న ఒప్పందాలను అమలు చేయకుండా మొండికేస్తున్న దని,అధికార పార్టీ మద్దతుగా ఉన్న కార్మిక సంఘాలతో మాట్లాడుతుంద ని గుర్తింపు సంఘం విమర్శిస్తుంద న్నారు.కోడ్ ఆఫ్ డిసిప్లైన్ పేరుతో జరుగుతున్న కార్మిక సంఘాల నిర్మూలన కుట్రను గుర్తింపు సంఘం ఇప్పటికైనా గమనించాలని ఆయన అన్నారు.

సింగరేణి వేలంపాటలో పాల్గొని గనులను సంపాదించాలని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ప్రభుత్వానికి లేఖ రాయడం వల్ల సింగరేణికి కార్మికులకు ఎంత మాత్రమూ ప్రయోజనం లేదని ఆయన అన్నారు.వేలంపాటలో లాభం పొందిన సింగరేణి సంస్థ కొత్తగా కార్మికులను రిక్రూట్ చేసుకుంటుందా అని ప్రశ్నించారు? వేలంపాటలో గనులు దక్కకుంటే సింగరేణి గని కార్మికుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒడిశాలో నైని బ్లాక్ లో నల్గురు తప్ప సింగరేణి కార్మికులు ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. కార్మికులకు ఉద్యోగాలు రాని వేలంపాటను ఆమోదించటం సింగరేణి గని కార్మికులకు ప్రమాదకరమైందని,సింగరేణి గనులు సింగరేణి ద్వారానే తీయాలని ఇందు వల్ల ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిఎల్ బికేఎస్ ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్య, ఏ.వెంకన్న, డి.బ్రహ్మానందం, ఎండి. రాసుద్దీన్, గౌని నాగేశ్వర రావు, ఈ.నరేశ్, టి.శ్రీనివాసు, జి.మల్లేష్, ఎస్.నర్సింగం, ఐ. రాజేశం, ఎం.సిద్దయ్య, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ కేసుల కోసం
## మధ్యవర్తిత్వ కేంద్రాలు

**మెట్‌పల్లి, సెప్టెంబర్ 14, (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్ని వేగంగా పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు ముందడుగు వేస్తూనే ఉందని ఈ క్రమంలో లోయర్ కోర్టులో పెండింగ్ కేసుల్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించే ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్బిట్రేషన్ తరహాలోనే ప్రతి కోర్టులో మీడియాషన్ సెంటర్స్ ఏర్పాటుకోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ కి సుప్రీం కోర్టు కొన్ని మార్గదర్శకాల్ని జారీ చేసిందని జాతీయ,రాష్ట్ర లీగల్ సర్వీసెస్ మార్గదర్శకాల ప్రకారం అన్నీ జిల్లా యూనిట్ల పరిధిలోని జిల్లా లీగల్ సర్వీసెస్ అథరిటీస్ ఆధ్వర్యంలో అన్ని లోయర్ కోర్టుల్లో పెండింగ్ కేసుల లిస్టింగ్ చేయడంతో పాటు వాటి పరిష్కారం కోసం ఆయా కోర్టుల్లోనే మీడియాషన్ సెంటర్లని ఏర్పాటు చేసిందని ఈ క్రమంలో మధ్యవర్తిత్వానికి ఆస్కారం ఉన్న కేసుల్ని ఇరుపార్టీల సహకారం తో రాజీ చేయడానికి ఆసక్తి, అనుభవం, నైపుణ్యం ఉన్న న్యాయవాదుల నుండి దరఖాస్తుల్ని స్వీకరించి ఎంపిక చేయడం జరిగిందని ఎన్నికలో భాగంగా మెట్ పల్లి నుండి సీనియర్ న్యాయవాదులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్ లని ఎన్నిక కావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతు న్యాయవాదులకు శిక్షణ అనంతరం,వారి వారి కోర్టు పరిధిలోనే మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రాజీకి సిద్దంగా,అనుకూలంగా ఉన్న లిస్టింగ్ కేసుల్ని బదిలీ చేసి వాటి పరిష్కరానికీ కృషి చేస్తారు.ఆదివారం రోజు నుండి 5 రోజుల ప్రత్యేక శిక్షణ ఉంటుంది.జగిత్యాల జిల్లా తో పాటు, మెట్ పల్లి, కోరుట్ల, ధర్మపురి లలో మొత్తం 5 జూనియర్ సివిల్ కోర్టులతో పాటు, 2 సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉండగా, వీటిలో దాదాపు 600 కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరానికి ఆస్కారం ఉన్నట్టు జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గుర్తించారు.వీటి సత్వర పరిష్కరం కోసం ప్రస్తుతం జిల్లా కోర్టులో ఒక మీడియాషన్ సెంటర్ పనిచేస్తుంది. మెట్ పల్లి మరియు కోరుట్ల కోర్టుల్లో కూడా మీడియాషన్ సెంటర్లని ఏర్పాటుకి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మీడియాషన్ సెంటర్ల నిర్వహణ పై వీరికి ఈ నెల 16 నుండి 20 వరకు కరీంనగర్ లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారని పేర్కొన్నారు.









జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
15 సెప్టెంబర్ 2025

# 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పోషణ మాసం ప్రారంభం

**ప్రతి ఇంటికీ పోషణ సందేశం చేరేలా కార్యచరణ**

- ప్రతి ప్రాజెక్టుకూ రూ. 30 వేలు, జిల్లాకు రూ. 50 వేల నిధుల మంజూరు
- పోషణ మాసాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు మంత్రి సీతక్క లేఖలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోషణ మాసం మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. చిన్నారులు, మహిళల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మహోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తోంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా అంగన్వాడీ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికీ పోషణ సందేశం చేరవేసేలా కార్యచరణ సిద్దం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు లేఖలు పంపారు. పోషణ మాసం మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వారు చురుకుగా పాల్గొనాలని, తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలకు ప్రోత్సాహం కల్పించాలని కోరారు. కుటుంబ ఆరోగ్యానికి పోషకాహారం మొదటి అడుగు అయిన నేపథ్యంలో, ప్రతి ఇంటిలో పోషణపై చైతన్యం కల్పించడమే ఈ మాసం ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ.30,000, ప్రతి జిల్లాకు రూ.50,000 నిధులను విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిధులను ఉపయోగించి గ్రామస్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోషణపై చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు, ఆరోగ్య పరీక్షల క్యాంపులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, శరీరానికి అవసరమైన పోషకాహారాన్ని అందించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించేందుకు, అలాగే చక్కెర, ఉప్పు, నూనె వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో సక్రమమైన ఆహారపు అలవాట్లను పెంపొందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో ప్రతి ఇంటికీ పోషణ సందేశం తీసుకెళుతామన్నారు. పోషణ మిషన్‌లో పురుషుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా కుటుంబాల్లో పోషకాహారంపై సమగ్ర అవగాహన కలిగించాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమని మంత్రి సీతక్క వివరించారు. "వోకల్ ఫర్ లోకల్" నినాదంతో గ్రామీణ స్థాయిలో ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించి ఆత్మనిర్భరతను పెంచే కార్యక్రమాలు కూడా ఇందులో భాగంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. టెక్నాలజీ వినియోగంతో గ్రామస్థాయిలోనూ పోషణ డేటాను సేకరించి, వాటిపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపడతామని వెల్లడించారు. పోషణ మాసం కాలంలో ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "పోషణ తెలంగాణ నిర్మాణం మనందరి బాధ్యత. ప్రతి గ్రామం, ప్రతి కుటుంబంలో ఈ చైతన్యం పెంపొందాలి. ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసి, ఆరోగ్య తెలంగాణకు బాటలు వేస్తాం" అన్నారు. పోషణ మాసంలో బాగంగా ప్రతి రోజు చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను సిద్దం చేసి జిల్లాలకు పంపించారు. అనుగుణంగా ఆయా కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలంతా చురుకైన పాత్ర వహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోషిత, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో ఈ పోషణ మాసం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింగరేణిని రక్షించింది కేసీఆరే..

- టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణిని రక్షించింది కేసీఆరే అని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి నిర్వీర్యం కావడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కారణమని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మిర్యాల రాజిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 2050 వరకు థర్మల్ పవర్ వుండవద్దని కుట్ర పన్నారు. బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణ చేస్తున్నారు. కేసీఆర్ ను ఒప్పించి కొప్పుల ఈశ్వర్ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. సింగరేణి కార్మికులకు ఎక్స్ గ్రేషియా ఇప్పించింది కేసీఆర్ ప్రభుత్వం. సింగరేణిలో 40వేలమంది కార్మికులు ఉండటానికి కారణం కేసీఆర్. కేసీఆర్ సీఎం కాకపోతే సింగరేణిలో 25వేల మంది ఉద్యోగులు ఉండేవారు కాదు అని రాజి రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కార్మికసంఘాలకు గౌరవాధ్యక్షులుగా పని చేసినవారు రాజీనామా చేశారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం మీటింగ్ పెట్టుకుని కొప్పుల ఈశ్వర్‌ను ఎన్నుకున్నామని, కార్మిక చట్టాలకు అనుగుణంగా కొప్పుల ఈశ్వర్‌ను గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నామని, అంతకుముందు అనేకమంది తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి గౌరవాధ్యక్షులుగా పని చేశారని, సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటించకపోతే కార్యాచరణ ప్రకటిస్తామని రాజిరెడ్డి హెచ్చరించారు.

# ధూల్‌పేట్‌లో 8 కిలోల గంజాయి స్వాధీనం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పాతబస్తీలోని ధూల్‌పేట్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు ధూల్‌పేట్‌లోని దిలావర్ జంగ్‌లోని ఓ వ్యక్తి ఇంట్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆ ఇంట్లో నిల్వ ఉంచిన 8 కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. దాంతో గంజా ప్రాసెసింగ్ మెషీన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్న రాజాసింగ్, తుల్జారాం సింగ్ అనే వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సీజ్ చేసిన గంజాయి విలువ రూ. 4 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులు ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గంజాయి భారీగా పట్టుబడడంతో.. ధూల్‌పేట ఏరియాలో పోలీసులు నిఘా పెంచారు. గంజాయి విక్రయాలు కొనసాగిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మరోవైపు బంజారాహిల్స్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు డ్రగ్స్ సరఫరదారుల నుంచి 14.83 గ్రాముల ఎండీఎంఏ, 70 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ హైదరాబాద్ నగరంలో పలువురికి విక్రయించేందుకు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో తేలింది.


# కోట్లాది భారతీయుల భావోద్వేగం 'హిందీ'

- హిందీసహా భారతీయ భాషలన్నింటికీ సమాన గౌరవం
- గుజరాత్ 'హిందీ దివస్' కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**అహ్మదాబాద్ (జనంసాక్షి) :** 'హిందీ కేవలం ఒక భాష మాత్రమే కాదు. కోట్లాది భారతీయుల భావోద్వేగాలు, సంస్కృతికి ప్రతిరూపం." అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. 'హిందీ దివస్'ను పురస్కరించుకుని ఆదివారం గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో నిర్వహించిన హిందీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్ర న్యాయ రాష్ట్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, పార్లమెంటరీ రాజభాషా కమిటీ ఉపాధ్యక్షులు భర్తృహరి మహతాబ్, స్థానిక ఎంపీ దినేష్ మక్వానా, ప్రఖ్యాత గుజరాతీ విద్యావేత్త ప్రొఫెసర్ విజయ్ పాండ్యా తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రసంగించారు. భాష అనేది నాగరికత, సంస్కృతికి ఆత్మ. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లుగా భాష కేవలం వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదన్నారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో హిందీ, భారతీయ భాషలను సాంకేతికత, పరిపాలనలో విరివిగా ప్రాచుర్యం పొందేలా చేస్తున్నారు. అట్లాగే రాజభాషా విభాగం ఎన్నో ప్రాజెక్టులను ఆరంభించిందని, వాటి ద్వారా హిందీతోపాటు ఇతర భారతీయ భాషలు డిజిటల్ యుగంలో మరింత శక్తివంతమయ్యాయని, గత కొన్ని సంవత్సరాలలో రాజభాషా విభాగం అనేక చారిత్రాత్మక కార్యక్రమాలను చేపట్టిందని, హిందీ శబ్ద సింధు డిజిటల్ నిఘంటువులో ప్రస్తుతం ఏడు లక్షలకు పైగా పదాలు ఉన్నాయి. అందులో సుమారు ఇరవై ఐదు వేల పదాలు భారతీయ భాషల నుండి సేకరించబడ్డాయని తెలిపారు. భారతీయ భాషా విభాగ ప్రాజెక్ట్ హిందీ, భారతీయ భాషల మధ్య సమన్వయానికి అద్భుతమైన ఉదాహరణ అని, మన మాతృభాష శాస్త్రీయ పరిశోధన భాషగా, పరిశ్రమ–వ్యాపార భాషగా, డిజిటల్ సంభాషణ భాషగా, అంతర్జాతీయ దౌత్య భాషగా మారేలా చూడాల్సిన అవసరం మనందరిపైనా ఉందని అన్నారు. భారత యువ శాస్త్రవేత్తలు హిందీ, భారతీయ భాషల్లోనే పరిశోధనలు చేయాలి. వ్యాపారవేత్తలు తమ వ్యాపార మోడల్లను ఈ భాషల్లోనే సృష్టిస్తే, సాంకేతిక పరికరాలు ఈ భాషల్లోనే సులభంగా అందుబాటులో ఉంటే, అప్పుడు మాత్రమే నిజమైన అర్థంలో ఆత్మనిర్భర్ భారత్ స్వప్నం సాకారం అవుతుందన్నారు. ఈ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ, హెూం మంత్రి అమిత్ షా నాయకత్వంలో హిందీ, భారతీయ భాషల యాత్ర నిరంతరం ముందుకు సాగుతుందని, భారతదేశాన్ని ఆత్మనిర్భర్, విశ్వగురువుగా తీర్చిదిద్దడంలో ఇది విశేషమైన పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదన్నారు.

# వందేళ్ల చరిత్ర గల శివాల మర్రిచెట్టు నేలకొరిగింది!



**హనుమకొండ (జనంసాక్షి) :** సుమారుగా 100 సంవత్సరాల చరిత్ర కలిగిన చెట్టు ఇది.. శివాల మర్రికి ప్రదక్షణ అనంతరమే భక్తులు స్వామిని దర్శించుకోవడం అనవాయితీ.. అయితే కుండపోత వర్షానికి ఈ చెట్టు నేలకొరిగింది. అతి పురాతన చరిత్ర కలిగిన ఆలయాల్లో ఐనవోలు మల్లికార్జునస్వామి ఒకటి. అటువంటి ఆలయ చరిత్రలో శివాలమర్రి చెట్టుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చే శివసత్తులు, భక్తులు ముందుగా శివాలమర్రి దగ్గర శివసత్తులు వేషధారణ వేసుకొని శివాలమర్రి చుట్టూ శివసత్తులు, భక్తులు ప్రదక్షిణ చేసిన తరువాతే స్వామి వారి దర్శనం చేసుకోవాలని భక్తుల నమ్మకం. ఈ మర్రి చెట్టు సుమారుగా 100 సంవత్సరాల కంటే పైచిలుకు చరిత్ర కలిగిన చెట్టు అని వృద్ధులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ చెట్టు ఐనవోలులో శుక్ర, శనివారం కురిసిన వర్షానికి నేల కొరిగింది. శివాల మర్రి చెట్టు నేలకొరగడంతో గ్రామస్తులు, మల్లన్న భక్తులు, ఆలయ అర్చకులు, ఆలయాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని శివాలమర్రి చెట్టుకు పునర్జీవం పోయాలని కోరుతున్నారు.

# కుమారుడ్ని తిట్టి గదిలో బంధించిన తల్లి..

- బాలుడు ఆత్మహత్య

**లక్నో:** ఒక అంశంపై కుమారుడ్ని తల్లి తిట్టింది. ఇంట్లోని గదిలో బంధించి పనికి వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా ఆ బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మాన్పూర్ ప్రాంతంలోని అద్దె ఇంట్లో నిషా అనే మహిళ ఆరో తరగతి చదువుతున్న 12 ఏళ్ల కుమారుడితో కలిసి నివసిస్తున్నది. తాగుడుకు బానిస అయిన ఆమె భర్త సునీల్ గొడవ వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం మధ్యాహ్నం ఒక అంశంపై కుమారుడు కృష్ణను తల్లి నిషా తిట్టింది. ఆ తర్వాత అతడ్ని గదిలో బంధించింది. డోర్ లాక్ చేసి ఇత్తడి కర్మాగారంలో పనికి వెళ్లింది. ఆమె ఇంటికి తిరిగి రాగా కుమారుడు కృష్ణ ఉరికి వేలాడుతూ కనిపించాడు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో తండ్రి హింసాత్మక ప్రవర్తన కారణంగా సూసైడ్ చేసుకుంటానని కుమారుడు కృష్ణ బెదిరించినట్లు తల్లి నిషా పోలీసులకు తెలిపింది. బాలుడి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# హైదరాబాద్‌లో జింక మాంసం కలకలం

**ఇద్దరు అరెస్ట్**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో జింక మాంసం కలకలం సృష్టించింది. జింక మాంసాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. టోలిచౌకి వద్ద శనివారం అర్ధరాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న జింక మాంసం, మూడు కొమ్ములు, ఐదు రైఫిల్స్ పట్టుబడ్డాయి. వీటిని తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఇద్దరు నిందితులు మహమ్మద్ సలీం, మహమ్మద్ ఇక్బాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జింక మాంసాన్ని, కొమ్ములను పోలీసులు అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వాహనాన్ని సీజ్ చేసి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామన్నారు.

# క్రమశిక్షణ, అవగాహనతోనే సొసైటీల అభివృద్ధి

**ముల్కనూర్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మెన్ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** క్రమశిక్షణ, అవగాహనతోనే సొసైటీల అభివృద్ధి సాధ్యమని ముల్కనూర్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మెన్ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. స్నాక్స్ ఆరవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మన పొదుపుతూనే మన భవిష్యత్తు ముడిపడి ఉందని కష్టపడి సంపాదించిన ప్రతి రూపాయి పొదుపు చేసినప్పుడు దానికి విలువ పెరుగుతుందని అన్నారు. సీనియర్ బ్యాంకర్‌లు నంచర్లె, రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ అన్ని సొంతం చేసుకుని చాలా శ్రమ పడితే తప్ప ఈ స్థాయికి రాదని, అగ్రికల్చర్ డైరెక్టర్, లక్ష్మి బాయి మాట్లాడుతూ క్రమశిక్షణతో నడుస్తున్న సంస్థ అని అన్నారు. అర్‌ఎస్ ప్రవీణ్ మాట్లాడుతూ మీ డబ్బు మీ ఇంట్లో కంటే స్నాక్స్ లో పదిలంగా ఉంటుందని, నా ఆర్డీనే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. రీతిక మాట్లాడుతూ బెస్ట్ సర్వీస్ దివేదెంట్ ఇస్తున్నారన్నారు. సీనియర్ షేర్ హెూల్డర్ సురేష్ మాట్లాడుతూ స్నాక్స్ ఎక్కువ సంఖ్యలో బ్రాంచి లు విస్తరించాలన్నారు. ఆడిటర్ సూర్య ప్రకాష్ రావు, అమ్మాయిలు చాలా క్రమశిక్షణతోపాటు లోపాలు లేకుండా నడుపుతున్నారని సలహాలు ఇచ్చారు, ప్రసిడెంట్ గీత ఆర్థిక ప్రణాళిక చదవడం, త్వరలో బ్యాంకింగ్ రంగంలో సేవలు అందించే లా ప్రయత్నం చేస్తున్నామని ,సెక్రటరీ అలివేలు మంగ, ఇచ్చిన లోన్‌లు అన్ని జిల్లాల్లో స్నాక్స్ బ్రాంచ్ లు పెట్టాలంటే, అందరం ఓన్ చేసుకోవాలని, నవనీత వైస్ ప్రెసిడెంట్, స్నాక్స్ లో సర్వీస్ గూర్చి, సుదక్షన , త్రిఫ్ట్, నిర్మల పబ్లిక్ రిలేషన్ మాట్లాడుతూ 6వ వార్షిక సంతోషాన్ని, ప్రతి మెంబెర్స్ తో వచ్చిన వారికి రావాలని సూచించారు.

# పట్టరా పట్టు హైలెస్సా.. గట్టిగ పట్టు హైలెస్సా

**గోతిలో దిగిన బస్సు... ప్రయాణికుల తిప్పలు**



**కొత్తగూడ సెప్టెంబర్ 14 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన నర్సంపేట ఆర్టీసీ బస్సు గ్రామానికి వెళ్లి తిరిగి నర్సంపేటకు వెళుతున్న క్రమంలో కొత్తపల్లి సమీపంలో గల బూరుకపల్లి వాగు బ్రిడ్జి పక్కన రోడ్డు మీద ఏర్పడిన గోతిలో దిగిన బస్సు ఇబ్బందిగా మారిన రవాణా వ్యవస్థ ప్రయాణికులు మాట్లాడుతూ రోడ్డు త్వరితగతిగా పూర్తి చేయాలని రోడ్డు మొత్తం జారుతూ ఉండడంతో ప్రయాణికులు చాలామంది కింద పడుతున్నారని అన్నారు.

# జట్టుగా వడ్రంగి పిట్టలు

**అరుదుగా కనిపించిన చిత్రం**




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** ఈ రోజుల్లో అసలు వడ్రంగి పిట్టలు ఎక్కడ ఎలా ఉంటాయో కూడ కొంత మందికి తెలియదు. పలు అందమైన రంగుల్లో కనిపించే ఈ వడ్రంగి పిట్టలు ఇప్పుడు కనిపించడం అంతంత మాత్రమే. ఎక్కడో అడవుల్లో తప్ప. వీపుపై పచ్చని రంగు, పొట్ట తెలుపు,నలుపు రంగుల్లో ఉండి నొసలిపై ఎర్రటి కిరీటం దరించినట్టు ఎంతో అందంగా కనిపించే ఈ రెడ్ ఫ్లేమ్ బ్యాక్ వూడ్ పీకర్ అనే ఈ వడ్రంగి పిట్ట సాధారణంగా ఒకటి కనిపిస్తేనే ఎంతో ఆనందం అనిపిస్తుంది మహా ఐతే రెండు ఇది ఇంకా ఆనందం. ఐతే ఒకటి రెండు మూడు కాదు ఏకంగా నాలుగు వడ్రంగి పిట్టలు ఒకే చోట కనిపించడం అరుదైన దృశ్యంగా చెప్పవచ్చు. ఇంతవరకు నాలుగు పక్షులు కలిసి ఉన్న ఫోటోను ఎవరికి చిక్కలేదు. ఎవరూ తీయలేదు కూడ కానీ ఇవి నాలుగు కలిసి ఒకే చోట చెట్టుపై ఆహారం తింటున్న ఈ ఫోటోను ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆదివారం నిర్మల్ జిల్లా కడెం గ్రామ శివారులో ఉన్న కవ్వాల్ అభయారణ్యంలో తన కెమెరాలో బంధించాడు. ఈ సందర్బంగా కృష్ణ మాట్లాడుతూ ఈరకం వడ్రంగి పిట్టలు అడవుల్లో ఎక్కడో ఒకచోట ఒకటి లేదా రెండు మాత్రమే కనిపించే అవకాశం ఉందని కానీ ఏకంగా ఒకేసారి నాలుగు కనిపించడం చాలా అరుదని ఈ దృశ్యం తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి సారి కనిపించిందని ఆఫోటో కూడా తానే తీయడం ఎంతో గర్వంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370